
# స్వాతంత్ర్యానంతర కవులపై
## శ్రీ అరవిందుల తత్త్వ దర్శన ప్రభావం




డా. జి. అరుణకుమారి

హైదరాబాద్ విశ్వవిద్యాలయం



ఈస్ట్‌వెస్ట్ సెంటర్

హైదరాబాదు - 500039

# అరవిందుల అరుణ కిరణాలు

– ఆచార్య జి.వి. సుబ్రమణ్యం

శ్రీ అరవింద యోగి (1872 –1950) పేరు వినగానే విశ్వసాహితీ లోకానికి 'ఫ్యూచర్ పొయిట్రీ' అనే భవిష్య కవితాదర్శనం అంతరంగంలో స్ఫురిస్తుంది. భవిష్య కవితాదర్శనం చేయగలిగిన శ్రీ అరవిందులు క్రాంత దర్శి అయిన కవియోగి. అందువల్లనే భవిష్య కవిత వేదమంత్రంలారూపొందుతుందని ఆయన దర్శించాడు. అది ఆత్మానుభూతిని ఒక్క ఊపులో, సూటిగా, అద్భుతంగా పఠితకు అందచేయడానికి శక్తివంతమైన సాధనంగా పెంపొందుతుందని చెప్పారు. కవి భావాభివ్యక్తికి మనస్సును, బుద్ధిని, ఇంద్రియాలను, భావాలను, ఊహలను వీలైనంత వరకు ఉపయోగించకుండా ఉండటమో, లేదా పూర్తిగా విడనాడటమో చేస్తాడు. ఆత్మనుండి సరాసరి ఆవిష్కృతమయ్యేదే అసలైన కవిత్వం అన్నారు శ్రీ అరవిందులు.

" The true creator of poetry, the true hearer is the soul " కవిత్వాన్ని నిజంగా సృష్టించేదీ, వినేదీ, ఆస్వాదించేదీ కూడా ఆత్మయే అన్నది శ్రీ అరవిందుల కవితా సిద్ధాంతం. సనాతన భారతీయ సాహితీ దర్శన సంప్రదాయానికి ఆధునిక విశ్వజనీన కవితా తత్త్వ దర్శనమందించిన మహాకవియోగి శ్రీ అరవిందులు. వారు సాధించిన పూర్ణయోగం (ఇంటిగ్రల్ యోగ) చూపించిన దివ్యజీవన ప్రస్థానం (ది పాత్ ఆఫ్ డివైన్ లైఫ్), వారు తథ్యమని ప్రకటించిన అద్భుత, సర్వాతీత మానవోత్తముల జన్మ, వారి దైవ విభూతి వలన సృష్టి పరిణామ క్రమం (ఎవోల్యూషన్) త్వరితగతిని ముందుకు సాగటం, మానవులు ఆధి భౌతిక ఉన్నత స్థితులనే సాధనా శిఖరాలను అధిరోహించటం మొదలైన సత్యాలన్నీ వారి ఆధ్యాత్మిక యోగ దర్శన శక్తికి ప్రమాణాలుగా నిలిచాయి. శ్రీ అరవిందుల సాహితీ దర్శనం, సాహితీ సృజన, విమర్శ ఆ ఆత్మ దర్శనం నుండి ఆవిర్భవించినవే.

కవిత్వ దివ్య భవ్యావేశానికి మూలం ఆత్మయే కానీ, మనస్సు(మైండ్) కాదు. కవితా వాక్కును కవిలోని అంతరాత్మయే ఆవిష్కరిస్తుంది. ఆత్మదర్శన ప్రధానమైన కవిత్వంలో కవి సాధించే ఉదాత్తాభివ్యక్తిని గురించి శ్రీ అరవిందులన్న ఈ మాటలు గుర్తుంచుకోతగ్గవి.

కవిత్వ వాణి మన భౌతికం కంటే అతీతమైందీ, మన బుద్ధి కంటె మించిందీ అయినా ఒక అతీత మానసిక శక్తి (సూపర్‌మైండ్) నుంచి పుడుతుంది. ఆ అతీత మానసిక శక్తి వస్తువుల ఆధ్యాత్మిక అస్తిత్వాన్ని విశాలమైన దృష్టితో అంతర్గతమైన సత్యంగా దర్శిస్తుంది.ఆ సత్య ప్రకాశ మహత్వాలను అంత్ఃప్రేరణ నుండి దివ్య భవ్యావేశంతో పుట్టిన భాషలో ఆవిష్కరిస్తుంది.ఆ భాష ఆత్మానంద విభూతిని వ్యక్తంచేసే అంతర్వాహిణి పలికే శబ్దాల వలన అభివ్యక్తమౌతుంది. ఆ అభివ్యక్తిని మంత్రంతో పోల్చవచ్చు అన్నారు శ్రీ అరవిందులు. నిజానికి ఇది ఆధునిక ఆర్ష దర్శనం. అందుకే శ్రీ అరవిందుల భవిష్య కవిత్వ దృక్పథం (ఓవర్ హెడ్ఎస్తటిక్స్).అంటే అతీంద్రియమైన కవితా సౌందర్య తత్వ దర్శనమని భావం. ఇది ఒక అంతర్వికాస గతి సూత్రాన్ని ఆశ్రయించుకొని ఈ శతాబ్దిలో ఏర్పడిన వాస్తవ పరిణామ దశగా శ్రీ అరవిందులు వ్యాఖ్యానించారు.

మానవ చరిత్రలో లాగానే కవిత్వ చరిత్రలో కూడా పరిణామ దశలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. మనిషి భౌతిక దేహం నుండి ఆధ్యాత్మికం వైపు పురోగమనం సాగింది. దశలు దశలుగా వికాస దశలు పొందినట్టి కవిత్వం కూడా వికాసాన్ని పొందుతుంది అని పేర్కొంటూ శ్రీ అరవిందులు ఇంగ్లీషు సాహిత్యంలో ఆయాకాలాలలో, ఆయా కవుల, కవితా దృక్పథాలలో ఆ వికాస దశ ఎట్లా కనపడుతుందో సోదాహరణంగా వివరించారు. ఛాసర్

కవిత్వంలో సూక్ష్మ భౌతిక స్పృహ ప్రధానంగా ఉంది. షేక్స్పియర్ కవిత్వంలో సృజనాత్మమక శక్తిగల కవిత్వం రూపు కట్టింది. 18వ శతాబ్ది కవిత్వంలో బౌద్ధిక, మానసిక శక్తులను ప్రదర్శించిన కవిత ప్రత్యక్షమైంది. ఆ కాలంలోనే మార్మిక తాత్త్విక కవిత్వ శాఖ కూడా విస్తరించింది. కాల్పనిక యుగ కవిత్వంలో మనిషిలోని అవ్యక్త జీవ చైతన్య వైఖరులను వెలార్చే కవితాస్పృహకు ఉష్ణకాంతులు ప్రసరించాయి. 19వ శతాబ్ది ఉత్తరార్థంలో కవిత్వం బహుముఖ మేథాశక్తిని ప్రదర్శించే ప్రవృత్తిని వెలార్చింది. 20 వ శతాబ్దిలో కవిత్వం దివ్యలయాత్మక భాషాభివ్యక్తితో ఆనందానుభవంలోని అనంతమైన అంతర్లయను అనుభవం లోకి అక్షర ప్రవాహంలా దూకించే సద్యశ్శక్తిమంతమైన అభివ్యక్తివైపు వికాసయాత్రను సాగిస్తున్నదని శ్రీ అరవిందులు వ్యాఖ్యానించారు.

మరొక రకంగా చెప్పాలంటే ఆంగ్ల కవిత్వం అలనాటి బ్లేక్‌కవి మానసిక దశావిస్పూర్తి దశ నుండి, వర్డ్స్‌వర్త్ ఆధ్యాత్మికానుభవ అభివ్యక్తి వరకు సాగింది. ఆతరువాత కోల్‌రిడ్జి ఆధిభౌతిక స్పృహ, షెల్లీ భావనాత్మక అతీంద్రియ పరిణామ స్పృహ, కీట్స్ దివ్య సౌందర్యారాధనరా పరిణిత వికాస దశలను సూచిస్తున్నాయి. విక్టోరియన్ యుగ కవుల బుద్ధి శక్తి ప్రదర్శనానంతరం ఆధునికయుగంలో అతీత మానవ మానసిక శక్తుల అభివ్యక్తి స్పృహను మనం దర్శిస్తున్నాం. అందుకు విట్‌మన్, టాగూర్, యేట్స్ కవితలే సాక్ష్యాలు అని వివేచించారు శ్రీ అరవిందులు.

వ్యక్తిత్వ వికాస దశలలో శ్రీ అరవిందులు వరుసగా పేర్కొన్న Psychic , The Inner Mind, The Higher Mind, The Illuminated Mind, The Intuitive Mindవీటన్నిటికీ పైన పేర్కొన్న Over Mind and Over Head Aesthetics స్థితులను, ఆయన సోపపత్తికంగా వివరిస్తున్నా, ఆ వివేచన పద్ధతి సమాధి భాషలో సాగుతున్నదనిపిస్తుంది. అది సహజమే. ఆత్మానందం నుండి ఆవిర్భవించే కవితా కళానుభవాన్ని చెప్పటానికి సమాధి భాషే సమర్థవంతమైంది. అందుకే శ్రీ అరవిందుల విమర్శ ప్రస్థానం అన పేరు పొందింది.

భారతీయ సాహిత్య శాస్త్ర దర్శనాలలో స్ఫోటకూ, ఆత్మ ప్రేరిత అంతర్దర్శనానికీ ప్రాధాన్యం ఉంద. దాన్ని శ్రీ అరవిందులు కావ్యసమాలోచనంలో గ్రహించి ఉపనిషత్సంప్రదాయాన్ని ఉన్మీలింప చేశారు. " కావ్య: సత్య శ్రుత్ణ" అనే ఋగ్వేద సూక్తం శ్రీ అరవిందుల విమర్శ సూత్రం. కవిత్వం దృశ్యం, శ్రవ్యం అయితే దాని దర్శనం అంతర్దర్శనం. దాని శ్రవణం అంత:శ్రవణం. కవిత్వంలో మనం వినే శబ్దలయ నిజానికి మనం వినేదాంట్లో ఒక భాగం మాత్రమే. మనకున్న చెవులు మన లోపలిచెవులకు చెవులు: బయటి చెవులు లోపలి చెవులకు వాహికలు. ఉపనిషత్తులలో చెప్పినట్లు "శ్రోత్రస్య శ్రోత్రమ్" – అందుకే శ్రీ అరవిందులు అంటారు– " దార్శనిక శబ్ద తరంగా లు అంతరాత్మ యొక్క లోలోతుల్లో నుండి విచ్చుకుంటూ వస్తున్న వైఖరియే కవిత్వం అని".

శ్రీ అరవిందులు చెప్పే రిథమ్ అంటే లయ – కావ్యార్థాన్నే కాక పరమార్థాన్ని కూడా తెలిసికొని అనుభవించటానికి తోడ్పడుతుంది. అది సామాన్యంగా సాహిత్యవేత్తలు విశ్లేషించే తాళం, గతి,లయ, మాత్రలు, గణాలు, పాద విభజనలు, పదాదా అంత్యప్రాసలు, శబ్దాలంకార ప్రయోగ వైచిత్రు, రీతులు, శబ్దార్థ శయ్యలు, సంగతులు, స్వరభేదాలు, అర్థ ధ్వని విశేషాలు, భావార్థ సంయోగ ప్రవృత్తులు మొదలైన వాటికి సంబంధించింది కాదు. మానవ అంతరాత్మలో సహజంగానూ, దైవికంగాను సంక్రమించిన రాగ తాళ లయ బద్ధమైన సచ్చిదానందానుభూతికి ఆస్పదమైన భౌతికాతీత, స్వయంప్రభుద్ధ చైతన్య లహరికి సంబంధించింది. అది సాహిత్య విమర్శకులు ప్రస్తావించారు. తాళ లయ లక్షణాలు కంటే విశిష్టమైన సర్వతరంగ ప్రకంపనల సంపుటి. ఇది బ్లూమ్ ఫీల్డ్, ఛామ్‌స్కీ మొదలైన భాషావేత్తలు చెప్పే భాషా శాస్త్ర సిద్ధాంతాలకూ, నిర్మాణ వాదాలకూ, పోస్ట్ స్ట్రక్చరలిజమ్ వాదులకు కొరుకుడు పడనిది. కానీ, అశాస్త్రీయం కానిది, అనాదరించలేనిది. ఆధ్యాత్మిక అస్తిత్వమూలమైనది.

వైఖరీ, వాక్కు, స్ఫోట,ధ్వని ఇవన్నీ ఆత్మానందానుభవ స్ఫోరకశక్తికి పూర్వ రంగాలుగా నిలుస్తాయని శ్రీ అరవిందుల భాష్యం.

శ్రీ అరవిందుల దృష్టిలో కావ్యానందం, కావ్య సౌందర్యం వేరు కావు. ప్రాచీన భారతదేశంలో వేదాలు, ఉపనిషత్తులూ, కావ్యాలు, పుట్టినప్పుడు ప్రజల సౌందర్య సంస్కారం తత్త్వ, మత సంస్కారాలతో మిళితమై, వారి సంస్కృతి స్పృహలో సమన్వయ దృష్టికి పోషకంగా ఉండేది. ఆధునికులు సౌందర్య స్పృహను తత్త్వ స్పృహల నుండి విడదీసి చూడటానికి ప్రయత్నించారు. ఆనందాన్ని సౌందర్యాన్ని వేరు వేరుగా పరిగణించి విమర్శించారు. ప్రాచీనులు సత్యం శివం సుందరాలను ఒక సంపుటిగా భావించారు. అందమైన వాక్కు విశ్వాత్మను శక్తిమంతంగా ఆవిష్కరిస్తుందని తలచారు. సౌందర్య భావ(న)ం , సద్య: పరనిర్వృతి, వాటిని ఉపాసించటం, ఆస్వాదించటం దివ్యత్వంగా భావించారు. అయితే, ఆ అనుభూతిని తర్కబుద్ధితో ఆలోచించే పద్ధతి క్రమంగా పెరిగి, భారతీయ కావ్య శా స్త్రంలోనే ఒక కొత్త పరిణామానికి దారి తీసింది. దానితో కావ్య బహిర్గత లక్షణాల వివేచనం, విశ్లేషణం విరివిగా సాగాయి. అయినా, ఆధ్యాత్మిక దృష్టితో కావ్యరసాస్వాదనం చేసే పద్ధతి మాత్రం మరుగున పడలేదు. పైపెచ్చు క్రమంగా కోలుకొని బలం పుంజుకుంటూ వచ్చింది. ఆసియా దేశాలలో కూడా అదే పద్ధతి దాదాపుగా కనపడుతుంది. పాశ్చాత్య సాహిత్యాలలో కూడా ఈ ఆధ్యాత్మిక దృక్పథం రాను రాను చోటు చేసుకుంటూ వచ్చింది. ఏమైనా, మనం మరల మన ప్రాచీన దృక్పథాన్ని పెంచుకొని సౌందర్యానందాల అద్వైతాన్ని దర్శించినపుడు మాత్రమే నిజంగా స్వాతంత్ర్యం పొందినవాళ్ళమౌతామన్నారు శ్రీ అరవిందులు.

మనకు కావ్య సౌందర్య, కావ్యానందాలను గురించిన సమగ్రమైన సన్నిహితమైన అవగాహన లేకపోవటంతో– ఈనాడు నిర్దుష్టమైన కావ్య తత్త్వ దర్శనం చేయటానికి ఎన్నో అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఆధునికులు తమ అంతర్గతమైన అభిరుచులకూ, బహిర్గతమైన అనుభవాలకూ సమన్వయం కుదుర్చుకొనటం ద్వారా కళానందం పొందగలమని భావిస్తున్నారు. కాని, సద్య:పరనిర్వృతిని పొందే బదులు తాత్కాలిక కళాసుఖాన్ని పొందుతున్నారు. అది వారి జీవితంలో గానీ, ఆత్మలోగానీ లోతైన అనుభూతినీ ఆనందాన్నీ ఇవ్వటం లేదు. మానవాత్మ ఈ రెండింటిలో ఏదో ఒక మార్గం ద్వారా మాత్రమే కావ్యానందాన్ని పొందగలదు. మొదటి మార్గంలో స్వీయజ్ఞానం వలన ఏర్పడిన దృక్పథంలో ఆత్మానుభవంలోని లోతులను పొందవచ్చు. రెండో మార్గంలో ప్రపంచంలో కనపడే సౌందర్య వస్తువులను దర్శించి వాటిలో అంతర్గతంగా ఉండే సత్యాన్ని దర్శించి, దాన్ని తాదాత్మ్యంతో రసావేశంతో పొంది, ఆత్మానందాన్ని అనుభవించవచ్చును. ఈ రెండింటినీ సమన్వయించుకొని కూడా కావ్య సౌందర్యానందాలను అనుభవించవచ్చు. ఎలాగంటే వస్తుగతంగా కనపడే సౌందర్యాన్ని, దాని అంతర్గత విశ్వజననీయమైన సత్యంగా దర్శించి, దాని వలన ఆత్మానందాన్ని పొందవచ్చు. ఈ అనుభవం ప్రాచ్య దేశాలన్నింటిలో పూర్వం జీవితానుభవసారంగా ప్రజలు దర్శించి అనుభవించేవారు. ఆధునిక మేధ ఆత్మ యొక్క లోతులను దర్శించే స్పృహలో అలసభావం అనుసరిస్తోంది. అందువలన ఆనందానికి బదులు అసమగ్రానుభవాలకు గురై ఆందోళన చెందుతున్నది. ఈ ఆందోళనను తొలగించుకొని మానసిక సమత్వాన్ని పొందటమే కళా ప్రయోజనంగా, కళానుభవంగా భావిస్తున్నది. ప్రాచీన కళానంద దృక్పథానికి, ఆధునిక కళాసౌందర్య దృక్పథానికి ఉన్న భేదమే ఇది. దృక్పథాలలో ఉండే భేదాలే అనుభావాలలో కనపడుతున్నాయి.

ఈ సమస్యకు మూల కారణం ఒకటున్నది, అది కావ్య సౌందర్యానందాలను లౌకిక సుఖ దుఖాల సంతోషాల స్థాయిలో ఆధునికులు ఆలోచిస్తూ... కానీ దానిని మనస్తత్వ శాస్త్ర విషయంగా వివేచించి విశ్లేషించటం.

కానీ నిజానికి సౌందర్యం ఆనందమొక్కటే. అవి ఆత్మచైతన్య స్పృహకు సంబంధించినవి. అవి అలౌకికాలే కావు. దివ్యాలు కూడా. అవి ఆనందాభివ్యక్తులు. వాటిని దర్శించి సృజించిన కవి మహాత్ముడు, మహర్షి. అనుభవించిన రసికుడు మహానుభావుడు. The poet has in him a double personality, a double instrument of his response to life and existence. There is in him the normal man absorbed in mere living who thinks and feels and acts like others, and there is the seer of things. The super normal man, the super- soul or delight soul in touch with the impersonal and external fountains of joy and beauty who creates from the source and transmutes by its alchemy all experience into a form of the spirit's Ananda.(The soul of poetic Beauty and Beauty) ఇది అరవిందుల సాహిత్య సౌందర్య తత్త్వ దర్శనం! ఇది వారి సమగ్ర తత్త్వ దర్శనంలో ఒక అంతర్వలయం!

2

"స్వాతంత్ర్యానంతర కవులపై శ్రీ అరవిందుల తత్త్వదర్శన ప్రభావం" అనే అంశంమీద పరిశోధన వ్యాసం రాసిన విజ్ఞురాలు డా.జి.అరుణకుమారిగారు. మానవతవాదం మీద వీరు రచించిన గ్రంథం బాగా ప్రచారంలోకి వచ్చింది. ఈ గ్రంథం కూడా మంచి ప్రాచుర్యంలోకి వస్తుందని విశ్వసిస్తున్నాను.

డా.జి. అరుణకుమారిగారు ప్రసిద్ధ తత్త్వవేత్తల కుటుంబంలో అడుగుపెట్టింది. ఆ వంశంలో కీర్తిపతాకగా నిలిచిన తత్త్వదర్శన విజ్ఞానాన్ని సాహిత్య క్షేత్రానికి వ్యాపింప చేసి మెట్టినింటికీర్తిని మింటిదాకా ప్రసరించేటట్లు చేసింది. విషయం చాలా గంభీరమైంది. కృషి చాలా అభినందనీయమైనది.

19, 20వ శతాబ్దాలలో భారతీయ పునరుజ్జీవన చైతన్యానికి దోహదం చేసిన దార్శనికాచార్యులలో సమగ్రమూర్తిమత్వాన్ని ప్రదర్శించిన కవి యోగి శ్రీ అరవిందులు. శ్రీ రామకృష్ణ పరమహంస నుండి పరంపరగా భారతజాతి జీవితాన్ని, సాహిత్యాన్ని ప్రభావితం చేస్తున్న మహాత్ములలో అటు రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, కవితా రంగాలలో సమర్థవంతమైన పాత్రను సమంగా నిర్వహించింది. అటు ఆధ్యాత్మిక సాహిత్య దర్శనాలలో హిమన్నగ సదృశ్యమైన స్థానాన్ని పొంది ప్రపంచ తత్త్వ సౌందర్య దర్శనాల మీద తమ ప్రభావాన్ని వేసిన పుణ్యమూర్తి శ్రీ అరవిందులే. అందువలన కవుల మీద వారి భావజాలం మీద శ్రీ అరవిందుల తత్త్వ దర్శనాల ప్రభావం ఎలా పడింది. ఎంత మంది మీద పడింది. తెలుగు సాహిత్య వికాసానికి అది ఎంతవరకు తోడ్పడింది అని పరిశీలించడం సమకాలీన సాహిత్య స్పృహకు సంబంధించిన విలువైన అంశం. దానిని తీసుకొని నిపుణంగా నిర్వహించిన డా. అరుణకుమారిగారు అభినందనీయురాలు.

ఆధునిక ప్రపంచానికి అరవిందులు చూపించిన జీవన పథం దివ్య జీవన ప్రస్థానం. సాధన పథం పూర్ణయోగం. సాహిత్య పథం సౌందర్యానందాల అద్వైత దర్శనం. స్వాతంత్ర్య పథం– భౌతికం నుండి ఆధ్యాత్మికం వైపు చేసే ప్రస్థానం. శ్రీ అరవిందుల భవిష్యత్కవిత ఈ చతుర్ముఖ దర్శన భారతి . దీన్ని దర్శించి ఉత్తేజితులై, ప్రభావితులై ప్రతిభావంతంగా అనేక ప్రక్రియలలో ప్రయోగాలు చేసిన తెలుగు కవుల వెలుగు రేఖలను విశ్లేషించటం ఈ గ్రంథ లక్ష్యం. డా . అరుణకుమారిగారు ఈ గ్రంథంలో చేసిన వివేచననంతా సూక్ష్మంగా చెప్పుకోవాలంటే – ఈ క్రింది ఫలితాంశం చాలు.

" శ్రీ అరవిందులు అధిమానసిక కళాతత్త్వానికి ఒక క్రొత్త లక్షణ సిద్ధాంతాన్ని రూపొందించి ఈ నాటి సాహిత్యాన్ని ప్రభావితం చేశారని చెప్పవచ్చు. శ్రీ అరవిందులు సమగ్రతత్త్వ శాస్త్ర ప్రభావం సమకాలీన కవుల మీద బాగా కనిపిస్తుంది. వీరి కవిత్వంలోని వ్యాఖ్యానం సంశ్లేషణాత్మకమైనది. వీరి కవితల్లోని ఇతివృత్తం, సన్నివేశాలు ఎప్పుడూ పరస్పరం సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉంటాయి. శ్రీ అరవిందుల ఆదర్శం ఆధ్యాత్మికమైనది కాబట్టి

స్వాతంత్ర్యానంతర కవుల ఆదర్శ భావాలకి పతాకవంటిది. రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, శ్రీశ్రీ, తల్లావఝుల శివశంకరశాస్త్రి , నోరి నరసింహశాస్త్రి, కరుణశ్రీ, కోవెల సుప్రసన్నాచార్యులు మొదలైన స్వాతంత్ర్యానంతర తెలుగు కవులు తమ రచనల్లో అరవిందుల ప్రకృతి భావాలను, అధి భౌతిక భావాన్ని, భవిష్య భావాన్ని, రూపాంతర యోగభావాన్ని, దివ్యమానవ జాతి భావాన్ని ప్రతిబింబింప చే శారు.

డా.జి.అరుణకుమారిగారి వివేచనలో విలువైన విషయాలను కొన్నింటిని పరితలు తప్పక హర్షిస్తారు. మచ్చుకు–

1. ఆధునిక కవిత్వం ఒక మంత్రంలాంటిదని భావించే కవులు శ్రీ అరవిందుల ప్రభావాన్ని ప్రత్యక్షంగా పొందినవారు. వారి కవిత్వం ప్రతీకాత్మకంగా ఉంటుంది. వారు కల్పించే ప్రతీకలు పాండిత్యంలో కాక, వాసనాజన్యమైన సహజ ప్రజ్ఞ చేత గుర్తించబడతాయి. అవి ఒక మార్మిక తాత్త్విక జీవిత రహస్యాన్ని ధ్వనింపచేస్తాయి. ప్రతీకల ద్వారా కవి ఒక దర్శనాన్ని, అనుభవాన్ని లోకానికి అందించడానికి యత్నిస్తాడు. కొన్ని ప్రతీకలు మార్మికతనే కాక అంతర్గత గుప్త జీవితాన్ని వ్యక్తం చేస్తుంటాయి. ప్రతీకలు సామాన్యంగా ఆధ్యాత్మిక వాస్తవికతకు అనుభవాభివ్యక్తులై ఉంటాయి.

2. అతీంద్రయ కవితా సౌందర్య తత్త్వ దర్శనాన్ని సమాధి భాషలో వ్యక్తం చేసే ప్రవృత్తి శ్రీ అరవిందుల కవితా ప్రభావం ఉన్న కవులలో కనపడుతుంది.

3. భౌతికం నుండి ఆధ్మాత్మికం వరకు ప్రస్థానం చేస్తున్న ప్రవృత్తి కవితలో, వస్తువులో, అభివ్యక్తిలో సామాన్యంగా గోచరమౌతూ ఉంటుంది.

4. ఛందో విన్యాసం కంటె అంతర్లయ ప్రధానమైన అభివ్యక్తి శ్రీ అరవిందుల ప్రభావమున్న రచయితలలో ఎక్కువగా కనబడుతుంది.

5. ఆధ్యాత్మిక దృష్టితో కావ్యరసానందాన్ని ఆస్వాదించే పద్ధతికి ప్రాణప్రతిష్ట చేస్తున్నట్లు ఉంటుంది శ్రీ అరవిందుల ప్రభావమున్న రచన.

స్వాతంత్ర్యానంతర కాలంలో భౌతిక, హేతువాద, మనోవిశ్లేషణ, రాజకీయ, సామాజిక సిద్ధాంతాల బారిన పడి, సాహిత్య మూల్యాలతో పాటు ఆధ్యాత్మిక మూలాలను కోల్పోతున్న తెలుగుసాహిత్యాన్ని పునరుద్ధరించి, దాని పూర్వవైభవాన్ని ఆధునికంగా వినిర్మించాలని యత్నించిన కవిలోకం మీద ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా గానీ శ్రీ అరవిందుల ప్రభావం ఉండక మానదు. అయితే, అది సమష్టి ప్రభావంతో ఒక అంశంగా ఉన్నదా, లేదా ఏకైక ప్రభావంగా ఉన్నదా అని విశ్లేషించటం విశేష కృషితో కూడుకున్న విషయం. ఆ క్లిష్టమైన వివేచనను డా. జి. అరుణకుమారిగారు నిపుణంగా నిర్వహించారు. ముఖ్య ప్రభావ క్షేత్రాలుగా ఆరింటిని ఎన్నుకుని ఆయా రంగాలలో ప్రభావం ప్రవర్తిల్లిన పద్ధతులను సోదాహరణంగా నిరూపించారు. ఆ ఆరూ ఇవి –1.ప్రకృతి భావం, 2.జాతీయ భావం, 3. సామాజిక భావం, 4. భక్తి భావం, 5. అధి భౌతిక వాదం, 6.భవిష్య వాదం. ఈ విభాగ విశ్లేషణతో ఈ పరిశోధనకు ఒక పరిపూర్ణత వచ్చింది.

మొత్తం మీద కొందరు తెలుగు కవుల మీద పడిన శ్రీ అరవిందుల అరుణ కిరణాల సప్త వర్ణాల వివేచనం ఈ గ్రంథం. ఈ అరుణ కిరణాల ప్రసార భారతి డా. అరుణ కుమారిగారు కావటం ఔచిత్యం. రచయిత్రికి నా హార్దిక శుభాభినందనలు!

హైదరాబాదు

03.03.2001. జి.వి.సుబ్రహ్మణ్యం

# విషయ సూచిక

**1. శ్రీ అరవిందులు – సంక్షిప్త పరిచయం :**

శ్రీ అరవిందుల సంగ్రహ జీవిత చరిత్ర – కవిగా, విప్లవవీరుడిగా, యోగిగా శ్రీ అరవిందులు – యోగసాధన శ్రీ అరవిందుల పూర్ణయోగంలోని ప్రత్యేకత

**2. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వ దర్శనం :**

తత్త్వశాస్త్ర నిర్వచనం – జగన్మిధ్యాతత్త్వ పరిశీలన – బ్రహ్మ ఒక్కటే సత్యం – శంకరాచార్యుల అద్వైతం– శ్రీ అరవిందుల సమగ్రతత్త్వశాస్త్రం – మానవ మూర్తిమత్వ లక్షణాలు, మానసిక స్థితులు – మనోవైజ్ఞానిక పరిపూర్ణత – త్రివిధ రూపాంతీకరణం – పూర్ణయోగం – ఆరోహణావరోహణ క్రమం

**3. శ్రీ అరవిందులు – సాహిత్యం :**

సాహిత్య నిర్వచనం – సృజనాత్మకత – విమర్శ – శ్రీ అరవిందుల కవితా నిర్వచనం – కవిత్వం దివ్యమంత్రం – కవి, తత్త్వవేత్త, శాస్త్రజ్ఞుడు – వీరి సామాన్య, అసామాన్య లక్షణాలు – కవిత్వంలో ఐదు దివ్య జ్యోతులు – ఐదు శాశ్వత శక్తులు, – శ్రీ అరవిందుల కవితా రీతులు – జ్ఞానేంద్రియాలు – తన్మాత్రలు – ఆత్మదర్శనమే కవిత్వం.

**4. శ్రీ అరవిందుల సాహిత్యం – విశిష్ట లక్షణాలు :**

శ్రీ అరవిందుల సాహిత్యంలోని సౌందర్యావబోధ, కవితా నిర్వచనం – శ్రీ అరవిందుల కవిత్వం – విశిష్ట లక్షణాలు – కళా నిర్వచనం – సౌందర్యశాస్త్రం – శ్రీ అరవిందుల కవిత్వం ఆధ్యాత్మిక మంత్రతుల్యం – భవిష్యత్కవితా లక్షణాలు – శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వం.

**5. స్వాతంత్ర్యానంతర తెలుగు కవులపై శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వ దర్శన ప్రభావం :**

స్వాతంత్ర్యానంతర కవుల విశిష్ట లక్షణాలు – సంప్రదాయ సాహిత్యం – ఆధునిక సాహిత్యం దీని ఆధారంగా స్వాతంత్ర్యానికి పూర్వ సాహిత్యం – స్వాతంత్ర్యానంతర సాహిత్యం – ఇతర భాషా సాహిత్యాల మీద శ్రీ అరవిందుల ప్రభావం – శ్రీ అరవిందుల సాహిత్య కృషిని గుర్తించిన ఆంధ్రజ్యోతి – స్వాతంత్ర్యానంతర తెలుగు కవుల మీద శ్రీ అరవిందుల తత్త్వదర్శన ప్రభావం.

**5.1 ప్రకృతి భావం :**

శ్రీ అరవిందుల ప్రకృతి తత్త్వ దర్శనం – స్వాతంత్ర్యానంతర తెలుగు కవులలో శ్రీ అరవిందుల ప్రకృతి భావం

**5.2 జాతీయ భావం :**

శ్రీ అరవిందుల జాతీయ భావం – జాతీయ విద్యా విధానం – జాతీయ సమైక్యత రవీంద్రనాథ టాగూరు, శ్రీ అరవిందుల జాతీయ భావ సిద్ధాంతంలోని భావ సామ్యం వర్ణాశ్రమ ధర్మాలు – చతుర్విధ పురుషార్థాలు – స్వదేశ విదేశ రాజ్యాంగ పరిపాలన విధానం – జాతీయ – అంతర్జాతీయ భావం – భారతదేశం – భారతమాత – తెలుగు సాహిత్యంలో స్వాతంత్ర్యానంతర కవుల్లో జాతీయ దృక్పథం.

**5.3 సామాజిక భావం :**

సమాజం – సామాజికుడు – వ్యక్తి చైతన్యం – సామాజిక చైతన్యం – హేగెల్, శ్రీ అరవిందుల దృక్పథంలో సమాజం – కవిత్వంలో సమాజం ఎంతవరకు ప్రతిఫలిస్తుంది – సామాజిక భావనను ఎన్ని విధాలుగా

చిత్రించవచ్చు – సమాజ ప్రగతి – సామాజిక భావాలున్న స్వాతంత్ర్యానంతర తెలుగు కవుల మీద శ్రీ అరవిందుల ప్రభావం.

**5.4. భక్తి భావం :**

భగవంతుడు సర్వాంతర్యామి – పరబ్రహ్మ మూలపురుషుడు. మిగిలిన బహుముఖ శక్తులు భగవంతుని ప్రతిరూపాలు. ఆధ్యాత్మిక జీవనం – మోక్షం – విశ్వశక్తులు – స్వాతంత్ర్యానంతర తెలుగు కవి శ్రీ సుప్రసన్నాచార్యుల రచనల మీద శ్రీ అరవిందుల ప్రభావం – నోరి నరసింహ శాస్త్రి, శివశంకర శాస్త్రి, కరుణశ్రీల మీద శ్రీ అరవిందుల ప్రభావం.

**5.5. అధిభౌతిక భావం :**

శ్రీ అరవిందుల అధిభౌతిక భావం – భవిష్యత్కవిత – సృష్టి స్థితి లయ విలాసం శ్రీ అరవిందుల అధిభౌతిక భావం స్వాతంత్ర్యానంతర తెలుగు కవుల్లో ఎంత వరకు ప్రతిబింబిస్తుంది.

**5.6. భవిష్య భావం :**

రాబోయే కాలాన్ని సూచించేది – భవిష్యత్తు ఏ విధంగా పరిణామం చెందాలని సూచిస్తుంది. శ్రీ అరవిందుల భవిష్యత్సూచన – తెలుగు కవుల్లో భవిష్యద్దర్శనం – సిద్ధాంతం.

**6. ముగింపు**

**ఉపయుక్త గ్రంథాలు**

**పారిభాషిక పదకోశం**

– డా. జి.అరుణ కుమారి

# శ్రీ అరవిందులు : సంక్షిప్త పరిచయం

ఈ సృష్టి పరిణామ వికాసాలలో మానవ జాతిని చైతన్యవంతం చేయడానికి ముందు చూపు కలిగి మరో అడుగు ముందుకు వేయడానికి ఎందరో మహానుభావులు అవతరిస్తున్నారు. వారి కృషి వల్ల సామాజిక వ్యవస్థలోనూ, వ్యక్తిగత జీవన సరళిలోనూ ఎంతో మార్పు వస్తున్నది. ఆ కోవకు చెందిన వారే శ్రీ అరవిందులు. వీరి జీవితం అంతర్ముఖమైనందువల్ల వీరి జీవిత చరిత్ర రాయడం అసాధ్యం. అయినప్పటికీ వారి జీవిత చరిత్రను సమగ్రంగా కాకపోయినా సంగ్రహంగా వెల్లడంచడానికి ప్రయత్నిస్తాను.[1]

శ్రీ అరవిందులు విద్యార్థిగా గడించిన ప్రతిభ అసమానం. ఏడేండ్ల ప్రాయంలోనే వీరు ఉన్నతాభ్యాసానికి ఇంగ్లండు వెళ్ళారు. చిరుప్రాయంలోనే పాశ్చాత్య భాషలన్నింటిలోనూ పాండిత్యాన్ని గడించారు. మూల గ్రంథాలైన ఇటాలియన్, జర్మన్ భాషల్లోనే డాంటే, గొథే భావ విశేషాలను, తత్త్వరీతులను చదివి పాండిత్యం గడించారు. తండ్రి ఆదేశానుసారం వారికి సంపూర్ణ సంతృప్తి కలిగే విధంగా చిన్నవయసులోనే అపార పాండిత్యం గడించి, పాశ్చాత్య పద్ధతులను, సంప్రదాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాశ్చాత్య రాజ్యాంగ నిర్మాణ సూత్రాలు, విధానాలు, ఆదేశాల రాజకీయ పరిణామాలు, పరివర్తనలు, మొదలైన విషయాలను అవగాహన చేసుకున్నారు.

మితభాషియైన శ్రీ అరవిందులు పదునాలుగవ ఏటనే ఆంగ్లభాషలో పద్య రచనలు ప్రారంభించారు. ఆంగ్ల కవితాకన్య పసితనంలోనే శ్రీ అరవిందులను వరించినది. ఆ వయస్సులోనే ఆయన ప్రకృతి సౌందర్యాన్ని గురించి పదకవితలల్లడం మొదలుపెట్టారు.[2] శ్రీ అరవిందుల జీవితంలో మనం ప్రధానంగా చెప్పుకోదగిన అంశాలు మూడు. అవి– 1. విప్లవకారుడు, 2. కవి, 3. యోగి. శ్రీ అరవిందులకు విద్యార్థి దశ నుండే రాజనీతి శాస్త్రంలో ప్రవేశముంది. ఆయన భారతదేశ పరాధీనతకు కలత చెందాడు. దాస్య శృంఖలాల నుండి భారతమాత విముక్తి పొందాలన్నదే శ్రీ అరవిందుల లక్ష్యం. " భారతదేశ స్వాతంత్ర్యము రాజకీయ క్రీడాగా కాక భూమిమీద భగవద్ సామ్రాజ్య స్థాపనలో ఒక చర్యగా శ్రీ అరవిందులు భావించారు. పరిపూర్ణ స్వాతంత్ర్యము, పూర్ణ స్వరాజ్ భారత రాజకీయ కార్యకలాపాల ఉద్దేశమని బాహాటంగా వాదించిన మొదటి రాజకీయ వేత్త శ్రీ అరవిందులే."[3]

## విప్లవ కారుడిగా శ్రీ అరవిందులు :

స్వాతంత్ర్య సమరంలో, విప్లవాత్మక భావాలు నెలకొల్పడం కుదరదు. శ్రీ అరవిందులు ఇందు ప్రకాశ్ అనే పత్రికలో ' పాతదీపాలకు కొత్త దీపాలు ' (న్యూ ల్యాంప్స్ ఫర్ ఓల్డ్) అనే పేరుతో అనేక వ్యాసాలు రాశారు. వందేమాతరం పత్రికకు సంపాదకులుగా పనిచేసారు. దేశ విద్రోహచర్యలను ప్రోత్సహిస్తున్నందుకు శ్రీ అరవిందులపై నేరారోపణ చేసి అలిపూర్ జైలులో బంధించారు. జైలులో ఆయనకు కలిగిన అపూర్వానుభవం వీరి జీవితానికి మరోమలుపు. వీరిలోని దైవాంశ అతీత మానవత్వాన్ని దర్శించేందుకు ప్రోత్సహించింది. " స్థిరబ్రహ్మం, చైతన్య

పూరిత బ్రహ్మం, తనలో ఇమిడిన పరమసత్యం ఒకటే. అతిమానసానికి దారితీసే ఉన్నత స్థాయీ చైతన్యం మరొకటి"[4] అని శ్రీ అరవిందులలో కలిగిన పరివర్తనమే రాజకీయ రంగానికి స్వస్తి చెప్పడానికి కారణమయింది. శ్రీ అరవిందుల యోగసాధన అలీపూర్ జైలులో ఆధ్యాత్మిక రంగంలో ఉచ్ఛస్థాయినందుకుంది.

శ్రీ రామకృష్ణ పరమహంస వాగామృతం వల్ల, వివేకానంద స్వామి రచనలు, ఉపన్యాసాల వల్ల శ్రీ అరవిందులకు హైందవ సంబంధమైన తాత్త్విక పరిచయం ఏర్పడింది. వీరిలో అంతర్లీనమైన ఆధ్యాత్మిక భావం అలీపూర్ జైలులో శ్రీకృష్ణ భగవానుని దర్శనంతో వ్యక్తమై నూతన రూపాన్ని పొందింది. తద్వారా నిజమైన సాధుపుంగవులను, తపోధనులను, యోగీశ్వరులను దర్శించి, వారి వల్ల యోగ రహస్యాలను, యోగ మహాత్మ్యాలను తెలిసికొని యోగాభ్యాసం చేయాలనే పిపాస వీరిలో కలిగింది. ఈ విధంగా భారతదేశ స్వాతంత్ర్య పిపాసతో పరితపించిన శ్రీ అరవిందులు భారతదేశంలో ఆధ్యాత్మిక యుగానికి నాంది వచనం పలికిన ప్రయోక్తగా నవయుగాన్ని స్థాపించిన వారిలో ప్రథముడుగా భాసించారు."[5]

## కవిగా శ్రీ అరవిందులు

శ్రీ అరవిందులు ఎక్కువ కాలాన్ని పద్య రచనకే వినియోగించారు. స్పానిష్, లాటిన్, గ్రీకు, ఫ్రెంచ్ భాషలను వీరు చిరుప్రాయంలోనే నేర్చుకున్నారు. బాల్యమంతా ఇంగ్లండులో గడిపిన శ్రీ అరవిందులకు భారతీయ సంస్కృతి గురించి స్వదేశానికి వచ్చిన తర్వాతనే తెలిసింది. బరోడా లో ఉండగా శ్రీ అరవిందులు సంస్కృతం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ భాషలను నేర్చుకున్నారు. వేదోపనిషత్తులను, రామాయణ మహాభారతాదులను, భగవద్గీతను చదివారు. సహజసిద్ధమైన జాతీయాభిమానం వల్ల శ్రీ అరవిందులు భారతీయ సంస్కృతి పట్ల అభిమానం పెంచుకున్నారు.

శ్రీ అరవిందులకు అన్ని రంగాలలో పరిచయముంది. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతీయవాదిగా శ్రీ అరవిందులను భారతీయులు గుర్తించుకుంటారు. బ్రిటీష్ ప్రభుత్వ దాస్య శృంఖలాల నుండి భారతదేశం విముక్తి పొందాలనే భావాన్ని మొట్టమొదట కలిగించిన వ్యక్తి శ్రీ అరవిందులే. ఆయనను తత్త్వవేత్తగా అభిమానిస్తూ గొప్ప యోగిగా గుర్తిస్తారు. ఆయనకు వివిధ రంగాలలో ప్రవేశమున్నప్పటికీ గొప్ప యోగిగానే ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. అతని కమనీయ కావ్య రచనా శక్తి, ప్రజ్ఞావిశేషాలు అపూర్వమైనవి. శ్రీ అరవిందులకు ఆంగ్ల సాహిత్యంలో అత్యుత్తమ స్థానం ఉందనడం అతిశయోక్తి కాదు.

శ్రీ అరవిందులు రచించిన ముప్పై సంపుటాలు వేదోపనిషత్తులవంటివి. వీరు రచనలలో స్వీకరించిన ఇతివృత్తం అపూర్వమైనది. సామాన్య మానవునికి అందుబాటులో లేనటువంటిది. వీరి రచనలు చైతన్యపూరితాలై అంతరంగజ్వాలలను ప్రజ్వలిస్తాయి, దివ్య సత్యాన్ని ప్రకటిస్తాయి. వీరి కవిత్వంలో తాత్త్విక సౌందర్యం గోచరిస్తుంది. శ్రీ అరవిందులకు సాహిత్య జగత్తులో తాత్త్వికునిగానే గుర్తింపు కలిగింది. వేదోపనిషత్తులను అధ్యయనం చేసి, జీవితమంతా యోగమే అని భావించి , తన కాలమంతా ఆధ్యాత్మిక సాధనకి వినియోగించిన వారిని యోగి అని కాక మరేమంటారు?

" మహాభారతము నుండి ఎన్నో ఉపన్యాసములనాంగ్లమున పద్యరూపమున అనువదించారు. ఆంగ్లమున నానాఛందస్సులలో నవ్య వైఖరులలో వచనమల్లిరి. ఆంగ్ల భాషలో వీరికి గల అసాధారణ సారస్వత సంపత్తి అత్యద్భుతము"[6].. పాశ్చాత్య వాఙ్మయంలో వీరుపరిశీలించని సాహిత్యంగాని, శాస్త్రంగానీ, తత్త్వంగాని లేదంటే

సత్యదూరం కాదు. వేదతుల్యమైన రచనలు చేసినా శ్రీ అరవిందులకు కవిగా కాక యోగిగానే గుర్తింపు వచ్చింది. దీనికి కారణం లేకపోలేదు. మతాన్ని మతపరంగాను, రాజకీయాన్ని రాజకీయ దృష్టితోను చూడటం సర్వసాధారణం. కానీ శ్రీ అరవిందులు మత, రాజకీయ, సాంఘిక, సారస్వతాది విషయాలన్నింటిని ఆధ్యాత్మిక దృష్టితో సమన్వయించి వాటి పరమార్థాన్ని వెల్లడించారు. శ్రీ అరవిందులు యోగ సిద్ధికై చేసిక కృషి అసామాన్యం. " జ్ఞానము, ప్రేమ, క్రియాచరణకు భగవంతుని సంసర్గమే యోగము. తనలోను, తన వెలుగు ఉన్న సర్వజ్ఞతతో, సర్వ శక్తి సంపన్నతతో ప్రత్యక్ష సంబంధము నెలకొల్పుకొనువాడు యోగి". [7]

## యోగిగా శ్రీ అరవిందులు

శ్రీ అరవిందులు అపూర్వ దర్శన యోగాలను వెల్లడించిన యోగీశ్వరులు. శ్రీ అరవిందుల యోగ పద్ధతిని 'పూర్ణయోగం' అంటారు. ఇది మిగిలిన యోగ పద్ధతులకన్నా భిన్నమైనది. భగవద్గీతలో భక్తి, కర్మ, జ్ఞాన యోగాలు ముక్తిని పొందే భిన్న మార్గాలుగా వ్యాఖ్యానించబడ్డాయి. జీవితమంతా ఈ కర్మ యోగ సాధన చేయడం వల్ల సిద్ధిని పొందవచ్చు. మహాత్మాగాంధి 'అనాసక్త యోగం'లో దీనిని 'నిష్కామకర్మ' అని పేర్కొన్నారు. స్వార్థరహిత క్రియల వల్ల మానవుడు సిద్ధిని పొందవచ్చు. ఈ ప్రక్రియలో మానవుడు పవిత్రుడవుతాడు. ధార్మిక క్రియ భగవద్గీతలో అంతరంగం వంటిది. ఆధ్యాత్మిక సంప్రదాయ పద్ధతులలో కర్మయోగానికి ఋషిపుంగవులు, తపోధనులు ఒక ప్ర-ముఖ స్థానాన్ని ఇచ్చారు. భగవద్గీతలో భక్తిమార్గం సిద్ధిని పొందే ముఖ్య మార్గంగా పేర్కొనబడింది. భక్తి ఉన్నతమైన సిద్ధిని పొందేందుకు తోడ్పడుతుంది. [8] అన్ని యుగాల్లోని మానవులు భక్తియోగమనే భక్తిమార్గంలో భగవంతుని దర్శిస్తారు.

భారతీయ చింతనలో భక్తి యోగాన్ని పరిపూర్ణ సిద్ధిని కలుగజేసే ముఖ్యమైన మార్గంగా సూచించారు. భక్తి 'యోగ సిద్ధిని' ప్రాప్తింపజేస్తుంది. భగవద్గీత మూడు మార్గాలకు సమ ప్రాధాన్యం ఇచ్చింది. అయితే మూడవ మార్గమైన జ్ఞానయోగాన్నే బలపరచినట్లు కనబడుతుంది. కొందరు కర్మయోగానికి, మరి కొందరు భక్తి యోగానికి ప్రముఖ స్థానమిచ్చారు. ఆధ్యాత్మిక సంప్రదాయ వాదులు ఈ మూడు మార్గాలను గురించి వ్యాఖ్యానించారు. శ్రీ అరవిందుల వ్యాఖ్యానంలో ఈ మార్గాలను సమీక్షించే విధానం భిన్నమైనది. వీరి భావలో యదార్థ కర్మయోగమే నిజమైన భక్తి. నిజమైన భక్తియే సంపూర్ణ జ్ఞానం. ఈ మూడు మార్గాలలో భేదంలేదు. ఇవి సిద్ధి అనే ఉన్నత స్థాయిలో పరస్పరం ముడిపడి ఉన్నాయి. శ్రీ అరవిందుల యోగ సమన్వయంలో అత్యున్నతమైన కర్మను, భక్తిని ఎవరూ వేరు చేయలేరని చెప్పవచ్చు. ఇదే విధంగా యదార్థమైన భక్తినీ, జ్ఞానాన్ని కూడా వేరు చేయలేదు. [9] శ్రీ అరవిందుల అభిప్రాయంలో నిజమైన జ్ఞానమే వాస్తవమైన అనుభవం. వాస్తవమైన అనుభవమే సర్వం. శ్రీ అరవిందులు సమగ్ర తత్త్వ శాస్త్రంలో ఈ మూడింటినీ సమస్వయపరచి పూర్ణయోగమని సమర్థించారు. అన్నిటికీ కలిపి గుచ్చెత్తి శ్రీ అరవిందులు తమ యోగ పద్ధతిని రూపొందించారనుట సమంజసం కాదు. హఠయోగం, రాజయోగం, భక్తి, కర్మ, జ్ఞాన యోగాలు, తాంత్రిక సాధనాలును, వీటి లక్ష్య భేదమును బట్టి , శ్రీ అరవిందుల వినూత్న తత్త్వ దర్శనమునకు అనుగుణమైనది కాదు.అందుకే ఒక సమన్వయమావశ్యకమైనది. 10

శ్రీ అరవిందుల దృష్టిలో వ్యక్తికి ఐదు అవస్థలుంటాయి. అవి 1.భౌతికం, 2. ప్రాణం, 3. బౌద్ధికం, 4. ఆధ్యాత్మికం, 5. మానసికం. సమగ్ర సంపూర్ణం అంటే అన్ని దశలలోను పరిపూర్ణత్వం అన్నమాట. కర్మయోగంలో కర్మద్వారా, భక్తి యోగంలో భక్తి ద్వారా ముక్తిని సాధించవచ్చు. వీటన్నిటిని వారు పాక్షిక ముక్తిగానే పరిగణించేవారు. శ్రీ అరవిందుల పూర్ణయోగం చతుర్విధ ముక్తిని కాంక్షిస్తుంది. " శ్రీ అరవిందులు యోగ సిద్ధికి

నాలుగు అంశాలను ప్రధానంగా స్వీకరించారు. శాస్త్రం, ఉత్సాహం, గురువు, కాలము.[11] స్వయం కృషి మాత్రమే పూర్ణయోగ సిద్ధికి చాలదు. భగవదనుగ్రహం ప్రధానం. ఈశ్వర చేతనతో జీవచేతన సంస్పర్శ పొందడమే పూర్ణయోగం లక్షించే పరమార్థం. శ్రీ అరవిందుల పూర్ణయోగంలో రెండు అంశాలు చెప్పబడ్డాయి. అపర ప్రకృతికి సంబంధించిన దేహ, ప్రాణ, మనస్సులను పరా ప్రకృతికి అనుగుణంగా రూపాంతీకరణమే శ్రీ అరవిందుల పూర్ణయోగ లక్ష్యం. అతి మానసిక సత్యం అవతరించగానే మానవునిలోని చైతన్యం ఆరోహించడం శ్రీ అరవిందుల పూర్ణయోగం లక్షించే పరమార్థం. దేహ, ప్రాణ, మనస్సులకు ఆవలనున్న పరతత్త్వంలో లీనం కావడం ఇతర యోగాల లక్ష్యం. ఆరోహణావరోహణ విధానం అపర యోగాలలో లేదు. పరతత్త్వం కిందికవరోహించి అపర ప్రకృతిని రూపాంతరమొందిచడమే పూర్ణయోగలక్ష్యం. శ్రీ అరవిందులు పూర్ణయోగంలో మానవుని ఆత్మ దివ్యాత్మగా రూపాంతరమొందాలని, సామాన్య జీవనం దివ్య జీవనంగా రూపొందాలని ప్రభోదించారు. దీనినే ప్రపత్తి యోగంగా పేర్కొన్నారు.[12] వీరి పూర్ణయోగం లక్ష్యపరిమితిలో చైతన్యంతో, స్వయంపరిపాలిత క్రమ పరిణామ వికాసంతోను కూడి ఉంటుంది. సంపూర్ణ పరివర్తనమనగా కేవలం ఆత్మయే దివ్యాత్మగా రూపాంతరమొందడమేగాక సత్తలోనే మిగిలిన భాగాలు కూడా రూపాంతరమొందడం అని అర్థం. ఈ యోగంలో మూడు అంశాలున్నాయి. మొదటి స్థాయిలో ఆత్మ అవిద్య నుండి ముక్తి పొంది, దివ్యాత్మతో తదాత్మ్యాన్ని పొందినపుడు 'సాయుధ్య స్థితి' అని అంటారు. ఆత్మ దివ్యాత్మను సమీపించినపుడు అది ప్రేమపూరిత యోగంగా చెప్పబడుతుంది. ఆత్మ దివ్యాత్మతో నివాసం ఏర్పరచుకున్నప్పుడు దీనిని 'సాలోక్య స్థితి' అని, ఆరోహణావరోహణల ద్వారా ఏర్పడిన సంపూర్ణ సమైఖ్య స్థితిని 'సాధర్మ్యం' అని అంటారు. ఇదే పూర్ణయోగ సారం. సమైక్య యోగమే సంపూర్ణయోగం.[13] శ్రీ అరవిందుల అతి మానసిక కవిత్వం నిరంతరమైన దివ్యాన్వేషణలను కొనసాగించే ఆదర్శాత్మకమైన ఉదాహరణగా పేర్కొనవచ్చు.[14] వీరి కవిత్వాన్ని అవగాహన చేసుకోవాలనుకున్న వ్యక్తి తన్ను తాను అతి మానసిక ప్రత్యక్ష స్వరూపానికి అర్పించుకొని సంపూర్ణంగా దాసోహం కావాలి. వీరి కవిత్వాన్ని మానసిక ప్రజ్ఞతో అవగాహన చేసుకోవడానికి వీలులేదు. ఆత్మ సమర్పణ భావ పూర్వకంగా సంపూర్ణ చైతన్యాన్ని కలిగి నిష్కల్మషమైన మనస్సుతో అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఈ చైతన్యమే ఆత్మ దివ్యాత్మతో తాదాత్మ్యాన్ని పొందడానికి తోడ్పడుతుంది.

ప్రతి వ్యక్తిలోనూ ప్రజ్ఞ ఉండటం సర్వ సాధారణం. కానీ అంతర్గతమైన ప్రజ్ఞను వినియోగపరిచే విధానంలోనే వికాసముంది. ప్రజ్ఞ ద్వారా మనం పదార్థ జ్ఞానాన్ని సంపాదించవచ్చు. ఒకే వ్యక్తి వివిధ రంగాలలో సృజనాత్మకతను దర్శించడం అపూర్వం. శ్రీ అరవిందులకు వివిధ రంగాలలో ప్రవేశం ఉంది. శ్రీ అరవిందులను కళాకారుడైన లియోనార్డో డావిన్సీని ఒకే కోణంలో పోల్చి చూస్తే కొంత వరకు ఇద్దరూ సమానమేనని చెప్పవచ్చు. శ్రీ అరవిందుల కవిత్వాన్ని, లియోనార్డో డావిన్సీ చిత్రాలను పరిశీలించి చూస్తే ఒకే విధమైన సౌందర్య భావన, సామరస్యం కనబడుతుంది.

శ్రీ అరవిందుల సాహిత్య కృషి మానవ మాత్రులు చేయడానికి సాధ్యమైనది కాదనిపిస్తుంది. మహాకవి కాళిదాసు, సహజకవి పోతనల వలె శ్రీ అరవిందులను కూడా దైవాంశసంభూతునిగా పరిగణించవచ్చు.

మహాయోగి శ్రీ అరవిందులు ఆధునిక భారతీయ పునరుజ్జీవనానికై పాటుబడి జీవనం, సాహిత్యం, యోగం ఈ మూడింటినీ సమ్మేళన విధానంలో సమన్వయ పరిచారు.[15] శ్రీ అరవిందుల దృష్టిలో సాహిత్యం కేవలం సామాజిక జీవనానికి ప్రతిబింబం మాత్రమే కాక నూతన జీవిత కర్తవ్యం. సాహిత్యం సాధనం వంటిది. జీవితం అస్థిత్వానికి పర్యాయపదం కాదు. ఇది కర్మయోగ పథంలో అనంతంగా కొనసాగిపోయే ఆకాంక్ష వంటిది.

శ్రీ అరవిందులు సమన్వయ యోగంలో జీవితాన్ని, సాహిత్యాన్ని సమన్వయం చేశారు. వీరి యోగ పద్ధతినే పూర్ణయోగమని అంటారు. అంతేకాక భగవత్పరమైన సంపూర్ణ అంతర్లీనం దీని పరమార్థం.[16]

---

## పాద సూచికలు

1. ఈ సంక్షిప్త పరిచయంలో శ్రీ అరవిందుల జీవిత చరిత్రను, కవితా రీతులను వివరించాను. "పూర్ణయోగా"నికి, మూల పురుషుడుగా, మహాయోగిగా, ప్రపంచం గుర్తించినప్పటికీ శ్రీ అరవిందుల ఉన్నత కవితా లక్షణాలను, భారతీయ, తెలుగు కవులపై వాటి ప్రభావాలను పేర్కొనటమే ఈ సిద్ధాంత వ్యాస ముఖ్య లక్ష్యం. వీరి తత్త్వ శాస్త్రానికి యోగం కీలకం. వీరు కవిగా కంటే తాత్త్వికునిగా ఇతర రచయితలపై నెరపిన ప్రభావం అసమాన్యం.

2. K.R. Srinivasa Iyengar, Sri Aurobindo A Biography & History.(Vol.1). Sri Aurobindo International Centre of Education, Pondicherry, Third Edition, 1972, P-41.

3. నవజాత(అను) డా.జె.మంగమ్మ. శ్రీ అరవిందులు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, 1975, పుట 24 & 25

4. ibid పుట. 47

5. K.R. Srinivasa Iyengar, Sri Aurobindo A Biography & History.(Vol.2). Sri Aurobindo International Centre of Education, Pondicherry, March, 1972, Third Edition P-1106.

6,7. అడపా రామకృష్ణారావు, ఆంధ్రసాహిత్యంలో శ్రీ అరవింద దర్శనం, తెలుగు త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక( సంపా)- డా.కొత్తపల్లి వీరభద్రరావు, అక్టోబరు,డిశెంబరు 1972. పుట 36.

8. శ్రీ అరవిందుల పూర్ణయోగ సాధనలో కర్మయోగానికి ప్రముఖ స్థానం ఉంది. కర్మ యోగం ద్వారా ఉపలబ్ధి, స్వార్థ రహిత స్వభావం అనేవి మహాత్మాగాంధి అనాసక్తి యోగ సారాంశం. కానీ శ్రీ అరవిందుల యోగంలో పృథ్వీరూపాంతరం, సర్వ సమర్పణలు ప్రధానమైనవి. ఈ యోగం సంపూర్ణతను సిద్ధింపజేస్తుంది.

9. Sri Aurobindo, The Synthesis of Yoga, (Vol 22) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1971, P- 26 & 320

10. శ్రీ అరవిందులు, యోగసమన్వయం(అను) కమలాకర వెంకటరావు(సంపుటి 1). మున్నుడి. కృష్ణా పబ్లికేషన్స్, పాండిచ్చేరి. ఫిబ్రవరి 21, 1970.

11. కె. భాస్కర రావు, దివ్య దీపిక, విశ్వజనీన ప్రగతి పత్రిక, శ్రీ అరవిందుల దృష్టిలో ఆంధ్రజాతి

12. Sri Aurobindo, The Synthesis of Yoga, (Vol 20) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1971, P – 122.

13. Sri Aurobindo, The Synthesis of Yoga, (Vol 22) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1971, P- 69 & 22

14. అనేక కారణాల వలన శ్రీ అరవిందుల కవిత్వాన్ని అధిమానసిక కవిత్వమని పేర్కొనవచ్చు. వీరి కవిత్వం మానసికానికి సంబంధించినది కాక చైతన్యానికి సంబంధించినది. వీరి ఉన్నత కవిత్వ బుద్ధి తర్కాన్ని అధిగమించి అంతరజ్ఞాన భూమికనందుకుంది. అంతే కాక వీరి అపూర్వమైన కవిత ధ్యాన నిమగ్నుడై సమాధి స్థితిలో నున్న కవి హృదయం నుండి జనించింది.

15. Sri Aurobindo, On Himself , (Vol-26), Birth Centenary Library,Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1972, P – 69& 22.
16. Sri Aurobindo, on Himself , (Vol-26), Birth Centenary Library,Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1972, P – 221 & 423.

శ్రీ అరవిందుల ఆత్మ పరిపూర్ణతా యోగం వీరి అధిమానసిక జీవితాన్ని ప్రభావితం చేసిందని చెప్పవచ్చు. తత్ఫలితంగా వీరి కవిత్వం సమాధి స్థితిలోని కవి హృదయం నుండి జనించిన మంత్ర వాక్కుగా పరిణమించింది. వీరి కవితా ఆకాంక్షకు, యౌగిక సిద్ధికి మధ్య భేదం లేదు.

## 2. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వ దర్శనం

కళను నిర్వచించడం ఎంత కష్టమో తత్త్వ శాస్త్రాన్ని నిర్వచించడం కూడా అంతే కష్టం. తత్త్వ శాస్త్రానికి సమగ్రమైన నిర్వచనాన్ని ఇంత వరకు ఎవరూ చెప్పలేదు. ఈ తత్త్వ శాస్త్ర నిర్వచనం మీద భిన్నాభిప్రాయాలున్నాయి. ఫిలాసఫీ అనే పదానికి శబ్దార్థం ప్రజ్ఞాశక్తి. ఈ మాట రెండు గ్రీకు పదాల సముదాయం. ఈ అభిప్రాయాలు వ్యక్తిగత అవగాహన పద్ధతుల మీద ఆధారపడి ఉంటాయి. తత్త్వ శాస్త్రమంటే ఉన్నత జ్ఞానాన్వేషణమని, విజ్ఞాన శాస్త్రాల సంశ్లేషణమని, వ్యవస్థాత్మక జ్ఞానమని, సార్వత్రిక విజ్ఞాన శాస్త్రమని పలు విధాలుగా తత్త్వశాస్త్రజ్ఞులు నిర్వచించారు.[1]

తత్త్వశాస్త్ర చింతనలోని ముఖ్యాంశాలు మూడు. అవి – 1.సిద్ధాంతం, 2. వివరణం, 3. సమన్వయం. ప్రమాణాలను తెలుసుకోవడం తత్త్వశాస్త్ర లక్షణం. ఆలోచనా ప్రాతినిధ్యం ఉన్న కళగా తత్త్వశాస్త్రాన్ని పరిగణించవచ్చు. తత్త్వవేత్తలు కొందరు దీనిని జీవనకళ అని నిర్వచించారు. తత్త్వ శాస్త్రం జీవితానికి ప్రతిబింబం వంటిది. మానవ జీవిత గమ్యాన్ని నిర్ణయిస్తుంది. ఇది మానవునికి స్థిరమైన ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని సమకూరుస్తుంది. తత్త్వశాస్త్రానికి జీవితానికి గల అవి–నాభావ సంబంధం దృఢమైనదే కాక ఇవి రెండూ ఒకే వర్గానికి సంబంధించిన రెండు పక్షాలు.

జీవ ప్రకృతుల స్వభావాన్ని తెలుసుకొనడానికి చేసే సమాలోచనమే తత్త్వం. ఒక శాస్త్రవేత్త తత్త్వాన్ని, దాని స్వరూప స్వభావాన్ని వర్ణించేందుకు ప్రయత్నిస్తే అది కొన్ని వందల పుటల గ్రంథంగా తయారవుతుంది.

శ్రీ అరవిందుల తత్త్వ శాస్త్రం సమగ్ర తత్త్వ శాస్త్రంగా పేర్కొనబడింది. ఈ సమ గ్ర తత్త్వం సమైక్య తత్త్వం కన్నా భిన్నమైనది. సమైఖ్య తత్త్వం సంశ్లేషణాత్మక తత్త్వంగా పరిగణింపబడింది. కాబట్టి సమగ్ర తత్త్వమనే సముచ్ఛయంలో 'ఉన్నత ఆధ్యాత్మిక తత్త్వశాస్త్రం' అనే భావం ఇమిడి ఉంది. దీనిని శ్రీ అరవిందులు సమర్థించారు. సమగ్ర భావాలు వేదోపనిషత్తులంతా ప్రాచీనమైనవి, కానీ ఆధునిక యుగంలో వీటిని గురించి వ్యాఖ్యానించిన విధానం భిన్నమైనది.[2]

బౌద్ధమతానికి మూలపురుషుడైన బుద్ధుడు ప్రపంచానికి ప్రాముఖ్యాన్నిచ్చే తత్త్వాన్ని నిర్వచించాడు. శంకరాచార్యులు అద్వైతాన్ని బోధించే తత్త్వాన్ని బలపరిచారు. మహనీయులైన ఈ జ్ఞానులిరువురు పదార్థానికి గాని, ఆత్మకు గాని ప్రాముఖ్యమిచ్చారు. ఇద్దరి తత్త్వాలు పాక్షికమైనవే కానీ సంపూర్ణమైనవి కావు.[3] . బుద్ధ భగవానుని, శంకరాచార్యులను అవతార పురుషులుగా పరిగణించారు. శంకరులది అద్వైత వేదాంతం. దీనిలో ముఖ్యంగా బ్రహ్మ సత్యమని, జగం మిథ్య అని, ప్రతిపాదించబడింది. బుద్ధుడు నిర్గుణ సత్తయే సర్వమని, సర్వం క్షణికమని బ్రహ్మను త్రోసి పుచ్చాడు.[4]. వీరి అనుభూతి సత్యంలోని ఒక భాగాన్ని మాత్రమే తెలుపుతుంది. శంకరుడు ఆధ్యాత్మిక మానసం ద్వారా పరమ సత్తాను తెలుసుకోవడం వల్ల జగత్తును గురించి సమగ్రంగా వివరించలేక ఇవి

మాయా జనితాలని, మిథ్యయని వాదించారు. శ్రీ అరవిందులు పురుష ప్రకృతులు రెండూ సత్యమని వాదించారు. శంకరుల అభిప్రాయంలో ముక్తి అన్నది కేవలం బ్రహ్మలో లీనం కావడం. దీనిలో స్వీయముక్తికే ప్రాధాన్యం ఉంది. శ్రీ అరవిందులు వ్యక్తిగత ముక్తికి కాక విశ్వమానవ ముక్తికి ప్రాధాన్యం ఇచ్చారు. సాధనకు ప్రధానమైన మార్గం జ్ఞానయోగమనీ శంకర తత్త్వం తెలుపుతుంది. శ్రీ అరవిందులు భక్తి, కర్మ, జ్ఞాన యోగాలు మూడూ ముక్తికి మార్గాలని, అవి వేరు వేరు మార్గాలు కావని వివరించారు. శ్రీ అరవిందుల దృష్టిలో బ్రహ్మతో సాహచర్యాన్ని, అఖండ తదాత్మ్యాన్ని ఆత్మ పొందుతుంది. ముక్తి అన్నది ప్రధాన లక్ష్యం కాదు. అది కేవలం ఒక ఫలితం మాత్రమే. అతి మానసికత్వమే ఆయన తత్త్వశాస్త్రంలోని ముఖ్య ఆదర్శం. శ్రీ అరవిందులు పూర్ణయోగాన్ని, దివ్య జీవనాన్ని వివరించారు. కాబట్టి వీరి తత్త్వం సమగ్రతత్త్వంగా ప్రసిద్ధి చెందింది.

శ్రీ అరవిందులు తన తత్త్వంలో ఆత్మను, పదార్థాన్ని వేరువేరుగా పేర్కొనలేదు. వీరి సిద్ధాంత రీత్యా ఆత్మ, పరమాత్మలు రెండూ ఒకే సత్యానికి సంబంధించినవి. ఈ సత్య ప్రతిపాదన వల్ల వాద ప్రతివాద పక్షాలకు అవకాశం లేకపోయింది. భౌతిక వాద నిరాకరణను వైరాగ్య తత్త్వ తిరస్కరణలను వీరు సమన్వయ పరిచారు. వేదాంతులు, ఆధ్యాత్మిక వాదులు ప్రాపంచిక తత్త్వాన్ని, ఉనికిని ఉపేక్షించారు. శ్రీ అరవిందులకు పూర్వమున్న భౌతిక వాదులు ఆత్మకు గల ప్రాముఖ్యాన్ని నిరాకరించారు. వీరి వాదోపవాదాల ప్రకారం ప్రపంచమంతా అవిద్యగా గానీ, అధ్యాసగా గానీ ఉండి ఉండాలి. జడ పదార్థానికి ప్రాముఖ్యం ఇవ్వని ప్రపంచం అశాశ్వతమైనదని బుద్ధుడు, ఆత్మ-కు సంబంధించని ప్రపంచం అశాశ్వతమైనదని ఆధ్యాత్మిక వాదులు విశదీకరించారు.

సమగ్ర తత్త్వ శాస్త్రం కేవలం సమగ్ర భావాలను మాత్రమే కాక విశ్వమానవ జాతి సంపూర్ణతను ఆశిస్తుంది. దీనినే 'సర్వముక్తి' అని పేర్కొన్నారు.[5]. ప్రాచీన కాలంలోని వేదాంతులు విశ్వపరిపూర్ణతను గురించి వారివారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. వీరు విశ్వసమగ్రత కోసం సమీక్షించిన పద్ధతులు వేరు. విశ్వ పరిపూర్ణతను విశదీకరించటానికి వేదాంతులు తమవైన ప్రత్యేక అభివాదాలను బలపరిచారు. ఇది వేదాంతంగా పరిణమించింది. కానీ శ్రీ అరవిందులు సమగ్ర తత్తంలో అన్ని భావాలను సంగతత్త్వ సిద్ధాంతంగా సమన్వయించారు. కొన్ని ప్రత్యేకమైన తత్త్వాలు దైవాంశ సూత్రాలను మాత్రమే వివరించి చెప్పేవని శ్రీ అరవిందులు సూచించారు. పాశ్చాత్య తాత్త్విక వేదాంతులు ప్రపంచ సమైఖ్యతకోసం, 'విశ్వభావం' అనే పదం ద్వారా వివరించి చెప్పాలని ప్ర-యత్నించారు. జీవన దృక్పథంలో విశ్వ దృష్టిని సన్నిహితంగా తీసుకురావడమని దీని భావం. భారతీయ చింతనలో సమైక్య భావ వాదాన్ని వివరించారు. సమైక్య భావ వాదం సమగ్ర జ్ఞానాన్ని, సా-ర్వత్రిక సమన్వయాన్ని లక్షిస్తుంది. శ్రీ అరవిందుని సమగ్ర తత్త్వశాస్త్రానికి సంబంధించిన విషయాలు మనోవైజ్ఞానిక పరిపూర్ణత, మానసిక మూర్తిమత్త్వం, మనసుకు సంబంధించిన ఐదు స్థితులు, త్రివిధ రూపాంతరీకరణం పూర్ణయోగం.[6] యదార్థం, శ్రద్ధ, ఆకాంక్ష, భక్తి, ప్రపత్తి అనే ఐదు గుణాలను శ్రీ అరవిందులు మనో వైజ్ఞానిక పరిపూర్ణతగా నిర్దేశించారు.[7].మానసిక మూర్తిమత్త్వం మిగిలిన వాటికన్నా ముఖ్యమైనది. మూర్తిమత్త్వాన్ని ఐదు పరిపూర్ణ గుణాల వల్ల పెంపొందించవచ్చు. మనో వైజ్ఞానిక పరిపూర్ణతను వివరించడానికి ఐదు రేకుల చంపక పుష్పాన్ని ఉదాహరణగా పాండిచ్చేరి మాత పేర్కొన్నారు. సమగ్ర తత్త్వశాస్త్రం ఉన్నత కవిత్వం మానవుడికి సంపూర్ణతను, సంతృప్తిని చేకూరుస్తాయి. సత్య హృదయత శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వశాస్త్రంలో ప్రధాన పూర్వాంశం. మానసిక సంపూర్ణత ఈ పూర్వాంశంపైనే ఆధారపడింది.[8]. యదార్థత లేనిదే ఆధ్యాత్మిక క్షేత్రంలో పురోభివృద్ధి ఉండదు. ఈ విధంగానే శ్రద్ధను కూడా ప్రధాన పూర్వాంశంగా పరిగణించవచ్చు. శ్రద్ధ అనే అంతరంగిక జీవితం బాహ్య జీవితమంత ప్రధానమైనది. శ్రద్ధ బాహిరాకృతిని

తీర్చిదిద్దుతుంది. స్వీయకర్తవ్యం పట్ల గల శ్రద్ధ శ్రీ అరవిందుని తత్త్వశాస్త్రంలో ముఖ్య లక్ష్యం. భక్తి సమర్పణకు మార్గాన్ని చూపుతుంది. సమర్పణ ఆత్మను దివ్యాత్మగా రూపొందింపజేస్తుంది. వీరి సమగ్ర తత్త్వ శాస్త్రంలో సహజ సిద్ధమైన ఆంతరతృష్ణే ఆకాంక్ష. ఆకాంక్ష మూలంగా సిద్ధిని పొందడం జీవిత కర్తవ్యం. శ్రీ అరవిందుల ఉద్దేశంలో ఆకాంక్ష లేనిదే మనో వైజ్ఞానిక సంపూర్ణత సమగ్రం కాదు. వ్యక్తి సంపూర్ణుడుగా రూపొందేందుకు సమర్పణ ప్రధానాంశంగా సూచింపబడింది. మానవుడు తన అహాన్ని సమర్పిస్తేనే గాని మానసిక పరిపూర్ణతని పొందలడు. పైన పేర్కొన్న కారణాల వల్లనే శ్రీ అరవిందుల యోగాన్ని 'ప్రపత్తి యోగ'మని పేర్కొన్నారు.

అమరత్వానికి, దివ్యత్వానికి సమగ్రమైన వ్యక్తిగత సమర్పణ ముఖ్యం. శ్రీ అరవిందుల దృష్టిలో మానవమూర్తిమత్వానికి ఐదు స్థితులున్నాయి. భౌతికం, ప్రాణం, బౌద్ధికం, మానసికం, ఆధ్యాత్మికం. ఈ ఐదు స్థితులను సమకూర్చే తత్త్వశాస్త్రమే సమగ్ర తత్త్వశాస్త్రం. [9]. అప్పుడే మానవ మూర్తిమత్వం సమతుల్యం కాకపోవచ్చు. శ్రీ అరవిందులలుతన కవిత్వంలో మానవ మూర్తిమత్వ అభివృద్ధికున్న ఆవశ్యకతను వివరించారు. ఆకాంక్ష మిగిలిన మూర్తిమత్వస్థితులతో సంబంధం కలిగి ఉంటుంది.

శ్రీ అరవిందుల సమగ్రతత్త్వశాస్త్రం ఐదు మానసిక స్థితులను వివరించింది. అవి మనస్సు, ఉన్నత మనస్సు, తేజోపూరిత మనస్సు, స్వత్రస్ఫురణ మనస్సు, అతి మనస్సు, శ్రీ అరవిందుల కవిత్వాన్ని ఉన్నత కవిత్వం లేక మనోతీత కవిత్వమంటారు. ఎందుకంటే వీరి కవిత్వం అతి మానసిక నిర్గమనం కాబట్టి. [10]

మనస్సుకు మూడు స్థితులున్నాయని మనో వైజ్ఞానిక శాస్త్రం సూచిస్తుంది. అవి చేతనం, అవచేతనం, అచేతనం. కాని ఆధునిక కాలంలో శ్రీ అరవిందులు తన తత్త్వ శాస్త్రంలో మనస్సుకు ఐదు స్థితులున్నాయని సూచించారు. భగవద్గీతలో మానవ మూర్తిమత్వానికి ఐదు లక్షణాలున్నాయని వివరింపబడింది. అవి– ప్రాణమయకోశం, అన్నమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయ కోశం ఆనందమయకోశం. [11]. శ్రీ అరవిందుల కవిత్వంలో పై సత్యం ఇమిడి ఉంది. వీరి కవిత్వం పాత కొత్తల మేలు కలయిక. అతి మానసిక స్థాయిలో వ్యక్తిగత ఆకాంక్ష ఉన్నత చైతన్య అవరోహణ కోసం వేచి ఉంటుంది. మనస్సు అతి మానసిక స్థాయికి చేరుతుంది. అట్టి మనస్సు అతి మానసిక స్థాయికి చేరాలంటే దైవానుగ్రహం పొందాలి. శ్రీ అరవిందుల భవిష్యత్కవితే మానవ జాతికి చెందిన భవిష్యత్కాల మానవుని అతి మానసిక లక్షణాలను ప్రతిబింబింపజేస్తుంది. శ్రీ అరవిందులు మానవుని నూతనదృష్టిని, ఆశను, నూతన దివ్య మానవుని తెలిపారు. దివ్య మానవుడు ఉన్నత స్థితిలో ఉన్న మానవుడు కాదు. ఉన్నత జాతికి చెందినవాడు అసలే కాదు. అతను నూతన వర్గానికి సంబంధించినవాడు. 'నిట్షే' అనే ఆధునిక తత్త్వవేత్త దివ్య మానవ భావాన్ని ప్రవేశపెట్టారు. వీరు 'గోథే'ను ఉదాహరణగా పేర్కొన్నారు. ఉన్నత వివేచనకు, ఉద్వేగానిక లోబడినట్లు చేసినవారు నిట్షే దృష్టిలో దివ్య మానవుడు. [12] ఆత్మ జ్ఞానం కలవాడు ఆధ్యాత్మి మానవడు. [13]

శ్రీ అరవిందుల అభిప్రాయంలో నూతన జాతి దివ్య మానవజాతి. శ్రీ అరవిందుల రచనలలో ముఖ్యంగా కవితల్లో ఈ భావాన్ని స్ఫురింపజేసారు. వీరు అతి మానసిక ప్రక్రియను మూడువిధాలుగా వర్ణించారు. అవి మానవీకరణం, అధిమానవీకరణం, ఆధ్యాత్మీకరణం. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వశాస్త్రంలో త్రివిధ రూపాంతీకరణం ప్రధానమైనది. భౌతిక, ప్రాణ, మనో స్థాయిల రూపాంతీకరణాన్ని త్రివిధ రూపాంతీకరణంగా విశదీకరించారు. శ్రీ అరవిందుల పరిణామ క్రమం ఐదు మహత్తర అమర సత్యాలచేత నిర్వహించబడింది. అవే భగవంతుడు,

తేజస్సు, సిద్ధి, స్వేచ్ఛ, అమరత్వం అనే ఐదు దివ్య సత్యాలు. [14]. ఈ పరిణామాన్ని "అంతర్వలనం" అనే పదం ద్వారా వివరించారు. ప్రక్రియలో ఉన్నత స్థాయిలో నిమ్నస్థాయి ఎంతగా దృగ్గోచరమవుతుందో, నిమ్న స్థాయిలో ఉ చ్ఛస్థాయి అంతగా ఇమిడి ఉంటుంది. ఈ ప్రక్రియనే పరిణామాత్మక ప్రక్రియ అని అంటారు. శ్రీ అరవిందులు దైవానుగ్రహం, సమర్పణ, ఆరోహణావరోహణ ప్రాముఖ్యాన్ని గురించి వివరించారు. వీరి తత్త్వశాస్త్రం వీరి కవిత్వం కన్న భిన్నమైనది కాదు. శ్రీ అరవిందులు స్పష్టవలెగా ప్రపంచ స్వాభావిక రూపాంతీకరణ ప్రాముఖ్యాన్ని విశదీకరించారు. [15].

---

## పాద సూచికలు

1. Sri Aurobindo, The Supramental Manifestation, (Vol 16) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1971, P-36

2. కొన్ని విజ్ఞాన శాస్త్రాలు స్వతస్సిద్ధంగా అమూర్త శాస్త్రాలు. కొన్ని శాస్త్రాలకు సమగ్రమైన నిర్వచనం ఇంతవరకు ఎవరూ చెప్పలేదు. తత్త్వశాస్త్రాన్ని, మరి కొన్ని సాంస్కృతిక కళల్ని గురించి కొంత వరకు అవగాహన చేసుకోగలం కాని వాటి ప్రాముఖ్యతను వివరించలేం. మానవ జీవిత విధానంపై ఇవి నెరపిన అంతర్గత ప్రభావాన్ని మనం గుర్తించలేకున్నాం.

3. Dr. V.N.K. Reddy, Eastern and Western Philosophy, Bharathiya Vidya Prakash, New Delhi, 1980, P.203-211.

4. బుద్ధుడు, శంకరాచార్యులు ప్రపంచ చరిత్రను సృష్టించారు. వీరిరువురు పరమ సత్యాన్ని అన్ని మార్గాల్లో దర్శించారు. బుద్ధుడు భగవంతుని నిరాకరిస్తే శంకరాచార్యులు ప్రపంచం మాయ అని నిరూపించారు. పాక్షికమైన వీరి సిద్ధాంతాలను శ్రీ అరవిందులు తన సత్య దర్శనంలో సమగ్రంగా సమన్వయించారు. ఈ రెండు సత్యాలు ఒకే నాణానికి రెండు పార్శ్వాల వంటివి.

5. Sri Aurobindo, The Life Divine, (Vol.18) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1970, P-6&17.

6. Sri Aurobindo, The Synthesis of Yoga, (Vol.20) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1971, P-43.

7. Sri Aurobindo, The Hour of God, (Vol 17) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, P.61-69.

8. Dr. V.N.K. Reddy, Eastern and Western Philosophy, Bharathiya Vidya Prakash, New Delhi, vide symbols of spirituality, P.203-211.

9. సమగ్ర తత్త్వ శాస్త్రంలో మానసిక పరిపూర్ణతను అయిదు భాగాలుగా పేర్కొన్నారు. వీటిలో అతి ముఖ్యమైనది శ్రద్ధ. మిగిలిన గుణాలు సత్య హృదయం, ఆకాంక్ష, భక్తి సమర్పణలు. కవిత్వంలోని శ్రద్ధ, ధ్యానంలో జనించే కవితకు కారణమవుతుంది.

10. Sri Aurobindo, Letters on Yoga , (Vol 22) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1970, P-347—.

11. Sri Aurobindo's Compilation, A gateway of Sri Aurobindo's thoughts, Sri Aurobindo society, Pondicherry, India, 1967, P-4.

12. Sri Aurobindo, The synthesis of Yoga, (Vol.20) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1971, P-36

13. Sri Aurobindo, The Supramental Manifestation, (Vol 16) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1971, P-275.

14. తత్త్వ శాస్త్రంలో నిట్షె, సాహిత్యంలో బెర్నార్డ్‌షా, పూర్ణయోగంలో శ్రీ అరవిందులు దివ్య మానవుని గురించి చర్చించారు. నిట్షె ఉద్ధేశ్యంలో మనో నిగ్రహం, ఉద్రేకాల ఉదాత్తీకరణం మానవుని దివ్య మానవునిగా రూపొందిస్తాయి. బెర్నార్డ్ షా భావనలో దివ్య మానవుడు మానవజాతి ఆదర్శాలవైపు నడిపిస్తాడు. కాని దివ్య మానవుని గురించి శ్రీ అరవిందులు ఒక నూతనమైన భావాన్ని ప్రవేశ పెట్టారు. శక్తితో సాధన ప్రయత్నం, ఆకాంక్ష, కృప అనేవి మానవునికి దివ్యత్వాన్ని ప్రసాదిస్తాయిశ్రీ అరవిందుల దృష్టిలో విజ్ఞానమయ మానవుడే దివ్య మానవుడు.

15. Sri Aurobindo, Letters on Yoga, (Vol 22) Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, Pondicherry, 1970 , P-320.

16. శ్రీ అరవిందుల పూర్ణయోగ లక్ష్యం పృథ్వి రూపాంతరం, ప్రకృతి పరివర్తనం, భౌతిక, ప్రాణ, మనో రూపాంతీకరణమే పూర్ణయోగంలో త్రివిధ రూపాంతీకరణం. శ్రీ అరవిందులు ఈ భౌతికాన్ని దివ్యంగా మార్చడమే గాక పృథ్వి, ప్రకృతులు కూడా పరివర్తన చెందుతాయని నిర్వచించారు. శ్రీ అరవిందుల ఈ మహోన్నత లక్ష్యం సెయింట్ అగస్టస్ 'దివ్యనగరం' (CITY OF GOD) ను అధిగమించిందని చెప్పవచ్చు.

## 3.శ్రీ అరవిందులు : సాహిత్యం

సృజనాత్మక వాఙ్మయ వ్యాపారమే సాహిత్యం. ఇది సమగ్ర మానవ జీవిత దర్శనం. సమకాలీన పరిస్థితులను, జీవిత విశేషాలను సాహిత్యం అద్దంలా ప్రతిబింబింపజేస్తుంది. సామాజిక స్థితిని సౌందర్యాత్మకంగా, కళాత్మకంగా చూపెడుతుంది. సమాకాలీన పరిస్థితులను తెలియజేసే కవిత్వం సర్వసాధారణంగా పరిమిత లక్ష్యాన్ని కలిగి ఉంటుంది. కాని శ్రీ అరవిందుల కవిత్వం విశ్వ సృష్టి స్థితి లయ రహస్యాలను, అసాధారణ ఆధ్యాత్మిక భావాలను తెలియజేస్తుంది. కాబట్టి వీరి కవితా లక్ష్యం కూడా అపూర్వమైనదేనని చెప్పవచ్చు.

విశ్వమానవ సృష్టి పరిణామ వికాసమే వీరి భవిష్య కవిత లక్ష్యం. సాహిత్యంలో సృజనాత్మకత అధిమానసిక ప్రక్రియవంటిది. అపూర్వ వస్తు నిర్మాణ క్షమాప్రజ్ఞయే ప్రతిభ. కవిత్వంలోని ప్రతిభను గురించి శ్రీ అరవిందులు ఈ విధంగా వివరించారు. సృజనాత్మక జీవశక్తి వల్ల కవిత్వం ఆవిర్భవిస్తుందని, బహిర్ముఖ మనస్సు కవిత్వ బాహ్య ఆకృతికి తోడ్పడుతుందని తెలిపారు. సాహిత్య విమర్శకుడు వాద ప్రతివాదాలను సమన్వయం చేయగల నేర్పు కలిగి ఉండాలని అన్నారు.

కవిత్వం శ్రీ అరవిందులకు సహజమైనది. కళను ఏవిధంగా నిర్వచించలేమో ఆ విధంగానే కవిత్వాన్ని కూడా నిర్వచించలేమని, కవిత్వం కవి హృదయం నుండి జనించే భావాభివ్యక్తీకరణమని శ్రీ అరవిందులు తెలిపారు. వీరు కవిత్వం దివ్య మంత్రం వంటిదని నిర్దేశించారు.[1]
ప్రతి వ్యక్తిలోను భావనామయమైన భావాలుండటం సహజం. కాని కొందరికి దానిని ఉపయోగించుకునే విధానం, అన్వయక్రమం తెలియకపోవచ్చు.

శ్రీ అరవిందుల అభిప్రాయంలో కవిత్వం కేవలం దేవుని ఆలయంలో యాంత్రికంగా ఉచ్చరించే మంత్రం కావుద. వీరు కవిత్వాన్ని నాలుగు భాగాలుగా విభజించారు. అవి 1.ప్రముఖ ప్రాణం, 2. భావాభివ్యక్తీకరణం, 3. భావస్ఫోరకం, 4. అంతరజ్ఞానం[2]. ప్రముఖ ప్రాణ కవిత్వం జీవితంలోని బాహ్య ప్రేరణలకు సంబంధించినది. భావకవిత్వం మానవ హృదయోద్వేగాలకు సంబంధించినది. అంతర జ్ఞానానికి సంబంధించిన కవిత ఆత్మానందాన్ని ప్రసాదిస్తుంది. భావ స్ఫోరక కవిత్వం అంతరజ్ఞాన ప్రవృత్తిలో నిలిచి జీవిత సంపూర్ణ సిద్ధికి ప్రధాన సాధనంగా తోడ్పడుతుంది. భగవంతుడు, ప్రకృతి, మానవాళిని గురించిన విశాల దృష్టిని కవిత్వం ప్రసాదిస్తుందని శ్రీ అరవిందుల అభిప్రాయం. అంతేకాక కవిత్వం ఇంతకంటే మహోన్నతమైన భావాల్లో మానవుని, ప్రకృతిని, భగవంతుని గురించి వివరిస్తుంది.

సర్వ సాధారణంగా కళాకారుని భావన అసత్యమని, అవాస్తమని, కల్పితమని భావిస్తారు. కానీ శ్రీ అరవిందుల దృష్టిలో కళాకారుని భావన యధార్థమైనది, సృజనాత్మకమైనది. వీరి భావన వస్తుగతమైన దివ్య సత్యాన్ని దర్శిస్తుంది. కవి, తత్త్వవేత్త, శాస్త్రజ్ఞుల సామాన్య, అసామాన్య గుణాలను శ్రీ అరవిందులు ఈ విధంగా వివరించారు. కవికి అంతర దృష్టియే ప్రత్యేక లక్షణం; తత్త్వవేత్త–కు వివేచనతో కూడిన చింతనయే విలక్షణమైన ప్రతిభ; శాస్త్రజ్ఞునకు విశ్లేషణాత్మక పరిశీలనయే సహజ గుణం అని శ్రీ అరవిందులు పేర్కొన్నారు. కాని విశ్వజనీనమైన దృష్టిలో ముగ్గురికి సారూ–ప్యముంది.[3]. ఈ ముగ్గురూ సర్వమానవాళికి చెందినవారు. అందుచేత వారు మానవ సంక్షేమాన్ని కోరి దాని కోసం కృసి చేస్తారు. ఆధునిక కవితా రీతులను విమర్శిస్తూ ఆధునిక స్మృతి పథంలో చింతనకే అధిక ప్రాధాన్యమిచ్చి అయుక్తాలోచనకు లోనయ్యారని శ్రీ అరవిందులు తెలిపారు. కవిత్వంలో భావనామయమైన అంతర

జ్ఞానానికి ఉన్నంత ప్రాముఖ్యం చింతనకు లేదు. భావనామయమైన అంతర జ్ఞానానికి ఉన్నత ప్రాముఖ్యం చింతనకు లేదు. భావనామయమైన అంతరజ్ఞానం కవికి సహజసిద్ధమైన అపూర్వ ప్రజ్ఞా విశేషం. మానవ సత్తకు చెందిన తేజోమయమైన సామరస్యమే కవితా లక్ష్యం. మానవునిలో ఇప్పుడిప్పుడే వికసిస్తున్న అంతరజ్ఞానం అంతరాత్మను అంతరంగిక విధానంలో చూసేట్లుగా ప్రేరేపిస్తుంది. శ్రీ అరవిందుల దృష్టిలో అంతరాత్మ నుండి వెలువడే సత్య వాక్కే మంత్రం.[4]. తత్త్వ విచారంలో కవిత్వానికి మూడు దశలున్నాయి. అవి వస్త్వాశ్రయ, ఆత్మాశ్రయ, ఆధ్యాత్మిక దశలు. వస్త్వాశ్రయ స్థాయిలో కవిత్వం బాహిర సత్యానికి సంబంధించినది. ఆత్మాశ్రయ స్థాయిలో కవిత్వం భావోద్వేగాలకు సంబంధించినది. ఆధ్యాత్మిక స్థాయిలో ఇది అంతర జ్ఞాన స్థాయిని చేరుతుంది.

శ్రీ అరవిందులు కవిత్వంలోను, కళలలోను ఐదు దివ్య జ్యోతులున్నాయని తెలిపి, ఈ ఐదు శాశ్వత శక్తుల విశిష్ట సామరస్యాన్ని వివరించారు. మానవుని ఆత్మను పరిపూర్ణత వైపు కొనసాగే మహాప్రస్థానంగా భావించవచ్చు. మానవుని సామరస్య పూర్వకమైన జ్ఞానం, ప్రకాశవంతమైన సంపూర్ణత్వమే కవితా లక్ష్యం. సత్యం, సౌందర్యం, ఆనందం, జీవనం, ఆత్మలను ఐదు శక్తులుగా పరిగణించవచ్చు.[5]. వీటి మధ్యగల సామరస్యమే నిజమైన కవిత్వంగా ప్రతిఫలిస్తుంది. శ్రీ అరవిందులు ఈ ఐదు శాశ్వత శక్తులను సాంకేతికంగా సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, శక్తియని; సూర్యునికి చెందిన ఐదు ఉపగ్రహాల ఉనికికి కూడ వివరించారు. అవి– చిత్, కారణ, మాయ, సూక్ష్మ, స్థూల, జ్ఞానం. కవిత్వంలో ఈ ఐదింటిని దివ్యశక్తులుగా పరిగణించారు. కవిత్వంలో కళాత్మక క్రియాశీలతను గురించి శ్రీ అరవిందులు ఈ విధంగా వివరించారు. కళాత్మక క్రియాశీలత లేని కవిత్వం కవిత్వం కాదు. ఉ దాహరణకు అంత:ప్రేరణ, అనుకరణం, భావవ్యక్తీకరణం, దృఢసంకల్పం కవిత్వంలో ప్రధాన పాత్రలు వహిస్తాయి. శ్రీ అరవిందులు కవిత్వాన్ని ఆధ్యాత్మిక మంత్రమని, ఇది ఐదు దివ్య జ్యోతుల చేత, ఐదు ఉపగ్రహాల చేత నిర్వహింపబడుతుందని విశదీకరించారు. ఈ ఐదు శక్తులు 'క్రియాశీలత' అనే సాధనం ద్వారా నిర్వహింపబడుతున్నప్పుడు మనకు ఇంకా నూతనాంశంగా గోచరిస్తుంది. దీన్ని ఆధారంగా చేసుకొని వీరి సౌందర్యావబోధను నూతన సౌందర్యానుబోధయని, వీరు ప్రతిపాదించిన సమన్వయాన్ని మానవ వ్యాఖ్యానమని చెప్పవచ్చు. అంతేకాక కవిత్వంలో ప్రతీకాత్మక కళకు సంబంధించిన ఐదు విశిష్ట గుణాలున్నాయి. కవిత్వంలో ధ్వని, రసం, భావం, అలంకారం, ఔచిత్యం అనేవి ప్రధాన కవితా రీతులు. కవిత్వంపై శ్రీ అరవిందుల దృష్టి సంప్రదాయబద్ధమైనది.[6] పై అంశాన్ని వివరించే సందర్భంలో శ్రీ అరవిందులు ఆధునిక కవిత్వాన్ని అనేక విధాలుగా విమర్శించారు. ఈ కవిత్వమంతా మానసికం, ప్రాణకోశాలకు సంబంధించినదని వివరించారు. ఆధునిక కవిత్వంలో భావ ప్రకటనలో చైత్య పురుషకు చెందిన ఆధ్యాత్మిక ఛాయలు కనిపిస్తాయి. కాని ఇవన్నీ ఉన్నత కవితారీతుల దృష్ట్యా అసంపూర్ణమైనది. మేధస్సుకు సంబంధించిన భావాలతో కవితా కల్పన చేయరాదని శ్రీ అరవిందులు సూచించారు. ఆంతరంగిక హృదయభావోద్రేకం, ఆంతరదృష్టి కవితకు మూలమని వీరి అభిప్రాయం. వీరి దృష్టిలో కవి, కవిత్వం సర్వాతీత స్థాయికి చెందినది. ఇది భౌతికం. మార్మికం, సౌందర్యావబోధాత్మకమైనవని వివరించారు. శ్రీ అరవిందుల కవితా దర్శనం అంతరజ్ఞానోపలబ్ధి, ఆధ్యాత్మిక సిద్ధి వంటిది. శ్రీ అరవిందులు కవితా పరిపూర్ణత చైతన్యాత్మక దృష్టి వల్లగాని, విశ్వ సందర్శనం వల్లగాని లభిస్తుంది. ఈ విధమైన దృష్టిగల కవులు 'సమాధి' లేక 'స్వప్నసమాధి' స్థితిని పొందగలుగుతున్నారు.[7].కవిత్వంలో స్వభావ సిద్ధమైన పాత్ర చిత్రణ, వ్యక్తిలో అనుభూతిని రేకెత్తించడం వంటి గుణాల వలె పర్యాప్తం, ప్రభావితమన్నవి కూడా ముఖ్యమైనవి. అంతేకాక భాషాలంకారం కూడా ప్రధానమైనదే. శ్రీ అరవిందులు పైన పేర్కొన్న గుణాలన్నింటిని బలపరిచారు.

శ్రీ అరవిందుల భవిష్య కవిత్వాన్ని పూర్వ సంకల్పంగా భావింపవచ్చు. వీరి కవిత్వం అతి మానసిక సౌందర్య ప్రక్రియతో కూడి ఉంటుంది. కొన్ని సందర్భాలలో వీరి కవిత్వాన్ని మంత్రతుల్యమైన ఆధ్యాత్మిక మంత్రంగా భావింపవచ్చు. వీరి కవిత్వంలోని పదాలు ఛందోబద్ధమై; ఒక వైపు కవి హృదయం నుండి, మరొక వైపు సత్య క్షేత్రం నుండి ఉత్పన్నమైనవిగా గోచరిస్తాయి. శ్రీ అరవిందులు The Future Poetry (భవిష్య కవిత్వం) అనే గ్రంథంలో అతి మానసిక కవిత్వం భవిష్యత్తులో లక్షణ కవిత్వంగా కాక అతి సామాన్యమైన కవిత్వంగా రూపొందించవచ్చునని సూచించారు. నిజమైన కవిత్వంలో పదగుంభన రీతి మంత్ర తుల్యమైనది. కవిత్వం భావకవి చైతన్యాశయమే కాక అది వారి దృఢమైన కృషి కూడ. శ్రీ అరవిందుల దృష్టిలో కవిత్వం పునీతమై భగవత్సాన్నిధ్యానికి తీసుకుపోయే సాధనంగా భావించవచ్చు.

శ్రీ అరవిందులకు కవితా ప్రపంచం శాశ్వతత్వానికి సంకేతంగా గోచరిస్తుంది. యదార్థ కవిత్వం ఆధ్యాత్మకు చెందిన నిర్గతాంశ. భవిష్యకవితలోని పదాల వెనకనున్న ఆత్మ సంకల్ప దృష్టిని స్పష్టంగా నిరూపించవచ్చు . వ్యధితాత్ముడైన కవి హృదయం నుండి వెలువడే బాధే కవిత్వంగా పరిణమిస్తుంది. కవి ప్రయోగించే పదాలు శాశ్వతమైన మహాసముద్రంలోకి ప్రవహించే తరంగాలవంటివి. అతి మానసిక కవిత్వం భగవంతుని నుండి మానవునికి సంప్రాప్తమైన దివ్య సందేశం వంటిది. అంతేకాక కొన్ని సమయాలలో ఇది మానవుడు భగవంతునికి నివేదించే విన్నపం వంటిది

శ్రీ అరవిందులు తన భవిష్య కవితలో ఉదాత్త కవితా రచనకు సంబంధించిన, ఆంతరంగిక జ్ఞానానికి చెందిన కొన్ని ముఖ్యమైన విషయాలను సూచించారు. సంప్రదాయ సాంఖ్య దర్శనంలో జ్ఞానేంద్రియాలు, తన్మాత్రాలు, వీటికి సంబంధించిన విషయం మనకు తెలిసిందే.[8]. జ్ఞాన అంగాలే జ్ఞానేంద్రియాలు. జ్ఞానేంద్రియాల సారమే తన్మాత్రులు. జ్ఞానేంద్రియాలు క్రమంగా, స్వచ్ఛంగా ఉన్నంత మాత్రాన అవి కవితాలంకార సౌందర్యారాధనకు పర్యాప్తం కాదు. జ్ఞానేంద్రియాల యదార్థ సారమైన తన్మాత్రాలు అతి ముఖ్యమైనవి. శ్రీ అరవిందులు తన్మాత్రాల అంతర జ్ఞానాన్ని గురించి వివరించటాన్ని తన భవిష్యత్కవితలో 'శృతిలోపల అంత:శృతి'యని 'నేత్రంలో అంతరనే–త్ర'మని తెలిపారు. ఇవి కొరవడినప్పుడు ఒక వ్యక్తికి లలిత కళలను – వాస్తు, శిల్పం, సంగీతం, కవిత్వం, చిత్రకళ మొదలైన కళాజగత్తును చేరాలని ప్రయత్నిస్తే, అతడు ఆయా కళలకు న్యాయం చేకూర్చలేకపోవచ్చు.

శ్రీ అరవిందుల కవిత్వంలో సత్యవాక్కు శక్తిని, ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది. ఈ పదాలన్నింటిని ఉత్తేజ భావాలుగా భావించవచ్చు. శ్రీ అరవిందుల అభిప్రాయంలో కవి కేవలం చింతనా పరుడు, పద్య పాదాలను, వాక్యాలను అమర్చడంలో సిద్ధహస్తుడు కాదు. అంతరాత్మలోని జీవిత తత్త్వాన్ని దర్శించిన వాడు కవి.[9] ఛందోబద్ధ నియమాలను, ప్రాసనియమాలను వర్గీకరించిన విధంగానే భవిష్య కవితలో శ్రీ అరవిందులు కవితా పదాలను, నిఘంటు పదాలను, భిన్న పదాలను గుర్తించారు. కవితా పదాలు స్వత:సిద్ధ రూపాలు, నిఘంటు పదాలు వ్యవస్థాపిత అక్షరాలతోను అర్థాలతోనూ సమకూర్చబడినవి. కవి ఆత్మకు సంబంధించిన లయ కావ్యాత్మ లయగా ప్రవహి–హిస్తుంది. శ్రీ అరవిందుల ఉదాత్త కవితానుసారం రెండు అంశాలకు సమ ప్రాధాన్యం ఇచ్చారని తెలుస్తుంది. కవి దృక్పథం, ఆ కాలపు యుగధర్మం, దాని చింతనా స్థాయిని, అనుభూతిని, వీటన్నిటికీ మించి ఆధ్యాత్మిక సిద్ధికి సంబంధించిన అంతరంగిక స్థాయి మొదలైన వాటిని ముఖ్య లక్షణాలుగా పేర్కొన్నారు.

అధిమానసిక కవిత్వానికి ఆధారాలు కవి ప్రతిభ, యుగధర్మం. కవి ఎంత గొప్పవాడైనా సమకాలీన యుగ ధర్మానికి కట్టుబడి ఉంటాడు. [10] మహాకవి కూడా తన సమకాలీన పరిస్థితులకు కట్టుబడి ఉండవలసిన వాడే. ఇదే

విధంగా మహాకవి భవిష్యత్తులో సంభవించే పరిణామాలకు వారసుడు కావచ్చు. దీనిని బట్టి కవి ప్రస్తుత మాహాత్మ్యాలకు, భవిష్యత్సంభవాలకు మూల పురుషుడని గ్రహించవచ్చు.

శ్రీ అరవిందులు కవి లక్షణాలను విశదీకరించే సందర్భంలో వాస్త్రజ్ఞుని, తాత్త్వికుని లక్షణాలను కూడా నిర్దేశించారు. కవి జన్మతోనే వరప్రసాదంగా సిద్ధించిన సహజసిద్ధమైన దృష్టి కలవాడు; విశ్లేషణాత్మక పరిశీలనా దృష్టి కలవాడు శాస్త్రజ్ఞుడు; విచక్షణా జ్ఞానం కలవాడు తత్త్వవేత్త. శ్రీ అరవిందులు అతి మానసిక సౌందర్యావబోధ ప్రక్రియలో కవిలో సహజమైన దృష్టి తాత్త్వికునిలో విచక్షణ జ్ఞానం, శాస్త్రజ్ఞునిలో విశ్లేషణాత్మక దృష్టి అన్నవి విభిన్న గుణాలని భావించరాదు. ఇవన్నీ ఆధ్యాత్మిక మంత్రాల నుండి ఆవిర్భవించిననే. మన పూర్వీకుల దృష్టిలో కవులు, ఋషులు సత్యాన్ని ప్రతిపాదించేవారు. ఈ భావాన్ని అనుసరించి శ్రీ అరవిందులు సత్యాన్ని సాక్షాత్కరింపజేసిన మహాకవి అని చెప్పవచ్చు. వీరు సత్యాన్ని ప్రతిపాదించి ప్రపంచాన్ని రూపాంతరమొందించడానికి కృషి చేసారు.

శ్రీ అరవిందుల కవితా సిద్ధాంతం ప్రకారం అంతరజ్ఞాన దృష్టితో ప్రకృతిని, మానవుని జీవనాన్ని దర్శించేవాడే కవి. దైవ, ప్రకృతి, మానవులకు మధ్యగల సంబంధాలను గురించిన అన్వేషణయే వీరి కవిత్వ పరమార్థం. వస్తువులలో అంతర్గతమై ఉన్న తత్వాన్ని తెలుసుకునే వ్యక్తి ఆత్మ దృష్టియే కవిత్వమని వీరి అభిప్రాయం. వేద ఋషులు దీనిని 'ఆత్మాని ఆత్మనాం, ఆత్మాన: అని పేర్కొన్నారు. (13–25 గీత). ఇదే శ్రీ అరవిందుల కవిత్వంలో స్వయం ప్రకాశిత దృష్టిగా భావింపబడింది. ఈ దృష్టితోనే సమస్త విషయాలకు సంబంధించిన సత్యాన్ని అవగాహన చేసుకోవచ్చు. ఈ వేద రహస్యమే శ్రీ అరవిందుల భవిష్యకవితా రహస్యంగా పరిణమించింది.

శ్రీ అరవిందులు ఆత్మకు సంబంధించిన ఐదు దివ్య జ్యోతులను, భవిష్య కవితకు సంబరాధించిన ఐదు జ్యోతులను గురించి చర్చించినపుడే సత్యం, సౌందర్యం, ఆనందం, జీవనం, ఆత్మలతో స్థిరమై ఉన్న భవిష్య కవితా సామరస్యాన్ని సూచిస్తుంది. అతని తత్త్వంలో వివరించిన అన్నమయ కోశం, ప్రాణమయ మనోమయ ఆనందమయ కోశం, జ్ఞానమయ కోశమనే పంచ కోశాలు శ్రీ అరవిందుల అధిమానసిక సౌందర్య ప్రక్రియలో ఇమిడి ఉన్నాయి. [11]. వీరి అభిప్రాయానుసారం ఆనందమయస్థాయిలో రస, భోగ, ఆనందమనే త్రిగుణ శక్తులు మనకు గోచరమవుతాయి. కొన్ని సమయాలలో దీన్ని సౌందర్యం, ప్రేమ, ఆనందమని వర్ణించారు.

ఆధునిక భారతీయ పునరుజ్జీవనానికి అధినేతయైన శ్రీ అరవింద మహాయోగి తన సమగ్రతత్త్వశాస్త్రంలో ప్రపంచానికొక నూతన సందేశమిచ్చారు. వీరి కవిత్వం విశ్వసత్యాలకు ప్రతిబింబం.'ది రోస్ ఆఫ్ గాడ్', 'ఫ్లేమ్ ఆఫ్ ట్రూత్' 'ఇలియస్' మొదలైన వీరి కవితలు ఒక ప్రత్యేక చింతనకు చెందినవిగా గోచరిస్తాయి. వీరి అధిమానసిక సౌందర్య ప్రక్రియలో మానవుల మధ్యగల సంబంధం, ఏకత్వం ప్రతిబింబిస్తుంది. వీరి గేయ కావ్యాలు సంఖ్యలో తక్కువైనప్పటికీ, వీరి కావ్యంలో చైతన్య పురుషకు సంబంధించిన ప్రతిస్పందనలు, అనుభూతులు స్పష్టంగా కనుక్కోవచ్చు. అధిమానసిక సౌందర్య ప్రశంసకు, అంతర జ్ఞానేంద్రియాలకు వీరు ప్రాముఖ్యమిచ్చారు. మానవుని ఆత్మ దృష్టిని ప్రక్షేపించారు. దీనిని గత పురాణగాథ, భవిష్య సంకేతం, ప్రతీకయైన 'సావిత్రి' అనే అమర కావ్యంలో సమగ్రమైన ఆధ్యాత్మిక ఉపలబ్ధిగా వర్ణించారు. భవిష్య సూచనయే వీరి అధిమానసిక లక్షణం. వీరి భవిష్యత్కవితా దర్శనంలో భవిష్య వాణిని గురించిన స్పష్టమైన నిర్గతాంశను గమనిస్తాం. ఈ కారణాల వల్ల శ్రీ అరవిందులను అఖండమైన యౌగిక ప్రతిభావంతుడుగా, మహా కవిగా నిరూపించవచ్చు.[12]

××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××××

## పాద సూచికలు

1. శ్రీ అరవిందుల కవితా నిర్వచనం ఇతర నిర్వచనాలకన్నా భిన్నమైనది. వీరి దృష్టిలో కవిత్వ మన్నది అవ్యక్తమైన భావప్రకటన గాని, వాస్తవ జీవిత సత్యాలను ప్రతిబింబించేదిగాని కాదు. కవిత అంతరాత్మకు సంబంధించిన నిర్గతాంశ. దివ్య సంకల్పంతో కవి సాధించే మహాకార్యం.

2. V.K. Gokak, An Integral View of Poetry, Abhinav Publications, New Delhi, 1975, p.20.

3. Sri Aurobindo, The Future Poetry, (Volume 9), Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, p.213.

4. S.K. Prasad, The Literary Criticism of Sri Aurobindo, Bharathi Bhavan, Patna, 1974, p. 142&181.

5. Sri Aurobindo, The Future Poetry, Volume 9, Sri Aurobindo Ashram Trust, 1972, p.209.

6. V.K. Gokak, An Integral View of Poetry, Abhinav Publications, New Delhi, 1975, p.99

7. V.K. Gokak, Sri Aurobindo Seer and Poet, Abhinav Publications, 1973, p.129.

8. Sri Aurobindo, The Future Poetry, Volume 9, Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, p.517 & 520.

9. శ్రీ అరవిందుల కవితా భావ అంతర్లోకాలను దర్శింపజేస్తుంది. భారతీయ చింతనలో దీనిని అంతరంగిక దృష్టిగా వ్యాఖ్యానించారు. జ్ఞానేంద్రియాల ఆధారంగా కవి భవిష్యత్తును దర్శిస్తాడు. తన్మాత్రాలకు సంబంధించిన సూక్ష్మజ్ఞానం ఈ జ్ఞానాన్ని అధిగమిస్తుంది. ఆత్మ అనే సాధన వల్ల గాని, చైతన్య పురుష ఆవిర్భావం వలనగాని ఈ జ్ఞానం కలుగుతుంది.

10. Sri Aurobindo, The Future Poetry, Volume 9, Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, p.517 & 520.

12. శ్రీ అరవిందుల మూర్తిమత్వం కవిగా కాక ఋషిగా భాసిస్తుంది. ఋషి కవి లక్షణాలను కలిగి యుండవచ్చును కాని, కవి ఋషి లక్షణాలను కలిగి ఉంటాడని చెప్పలేం. అధిమానసిక కవితా స్రష్టగా శ్రీ అరవిందులు కవికుండవలసిన సామాన్య లక్షణాలను అధిగమించారు. ఈ సందర్భంలో మనకు రవీంద్రనాథ్ టాగూరు చెప్పిన " A torrential stream is independent of its bank" అనే మాట గుర్తుకు వస్తుంది.

Sri Aurobindo, The Future Poetry, Volume 9, Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, p.517 & 520.

**********

# 4. శ్రీ అరవిందుల సాహిత్యం విశిష్ట లక్షణాలు

సౌందర్యావబోధ సౌందర్యానికి, కళకు సంబంధించిన శాస్త్రం. శ్రీ అరవిందుల కవితలో సౌందర్యారాధనే ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. శ్రీ అరవిందుల అభిప్రాయంలో మహాకవికి, సామాన్య కవికి ఎంతో భేదముంది. సామాన్య కవి రచనలు కాల పరిమితికి చెందినవి. సామాన్య కవికి ఉన్నతమైన దివ్య ప్రేరణ కలిగినపుడు మాత్రమే ప్రజలను ఉత్తేజితులను చేయగలడు. సామాన్య కవులకు లేని ఒకానొక దివ్యశక్తి కలవాడే మహాకవి. అందుకే కవిత్వం దేవతానుగ్రహ సంపాద్యమని అంటారు. దర్శన శక్తి, సృజనశక్తి కలిగి వర్తమానాన్నే కాక గతాన్ని, భవిష్యత్తుని దర్శించే నేర్పు కలవాడే మహాకవి.

ఈ సందర్భంలో మనం పరిశీలించి చూస్తే శ్రీ అరవిందులు ఒక మహాకావ్యాన్ని నిర్వచించేందుకు అవతరించారనడంలో సందేహం లేదు. వీరి భావాలను, కవిత్వాభివ్యంజనాలను సామన్య మానవులకు వారి మాతృభాషల ద్వారా అందజేస్తే ఈ భూమినే స్వర్గ సామ్రాజ్యంగా రూపొందించవచ్చు. జీవిత సమస్యలకు సంబధించిన విషయాలన్నింటినీ తన రచనల్లో విశదీకరించారు. తన రచనలలో స్పృశించని అంశమంటూ ఏదీ లేదు. వీరి కవితలోని అతి సూక్ష్మమైన సత్యాలే వీరి కవిత్వంలోని కవితా వస్తువు. శ్రీ అరవిందుని దృక్పథంలో అంతరంగ జీవితమే బాహ్య జీవితానికి ఆధారం.[1].

కవి భావనను, నిర్వహించవలసిన దానిని వీరి సౌందర్యాత్మక విమర్శ సూచిస్తుంది. బాహ్య జీవిత విషయాలను విశదీకరిస్తుంది. విమర్శ వస్తువులో అంతర ఉద్దేశాన్ని సూచించదని, అది ఈనాటి అభ్యుదయ కవులలో కనిపించడం లేదని వీరి అభిప్రాయం. శ్రీ అరవిందులు కవిత్వంలోని ఆత్మాశ్రయ కల్పనకు గల ప్రాధాన్యాన్ని చర్చించారు. మానసిక ఉద్వేగపూరితమైన రస భావాలను, ఆలోచనలను ఆత్మాశ్రయ కల్పన నిర్దేశిస్తుంది. వీరు ఆత్మాశ్రయ కల్పనకే ప్రముఖ స్థానమిచ్చారు. ఇది మానసిక ప్రేరణకు భూమిక వంటిది. పరాశ్రయ కల్పన, బాహ్య జీవిత విధానాలను సూచిస్తుంది. బాహిర జీవిత విధానాల కంటే మానసికానుభూతికి ఉన్నత స్థానమిచ్చారు. వీరు ఆత్మాశ్రయ, పరాశ్రయ కల్పనలను సమన్వయించి, ఈ రెండింటికీ భేదాన్ని చాటారు. వీరి భావనలో ఆత్మాశ్రయ, పరాశ్రయ కల్పనలు పరస్పర పూరకాలు. ఈ కారణం వల్ల శ్రీ అరవిందుల సౌందర్యశాస్ర సిద్ధాంతం సమగ్రమైన సిద్ధాంతంగా భాసిస్తుంది.[2].

శ్రీ అరవిందుల అభిప్రాయంలో సౌందర్య కళాబోధ కళాకారుని సహజలక్షణం. కవి కూడా కళాకారుడే. వీరి ఉద్దేశానుసారం సౌందర్యశాస్త్ర ప్రక్రియలో కొన్ని అంశాలున్నాయి. రసం, ఆనందం, భోగం–ఈ మూడు కవిత్వంలోని సౌందర్యశాస్త్ర ప్రక్రియలో ముఖ్య లక్షణాలు. శ్రీ అరవిందుల సౌందర్యశాస్త్ర మిగిలిన సౌందర్య శాస్త్ర ప్రక్రియల కంటే భిన్నమైనది. వీరు సౌందర్యాన్ని సంవేదనా సౌందర్యం, భావనా సౌందర్యం, వాస్తు శిల్ప సౌందర్యం, శాశ్వత సౌందర్యమని తెలిపారు.[3]. సర్వ సాధారణంగా ప్రకృతి సంబంధమైన కవితలో పైన పేర్కొన్న నాలుగు విధాలైన సౌందర్య వర్ణనలు కనిపిస్తాయి. కాళిదాసు కవిత్వంలో ఈ నాలుగు విధాలైన సౌందర్య వర్ణనలను చూడగలం. శ్రీ అరవిందుల అధిమానసిక కవిత్వంలోని అధిమానసిక చైతన్యం ఆనందాన్నిస్తుంది.

కవిత్వమన్నది లయబద్ధమైన వాస్తవ దివ్య సత్యమని శ్రీ అరవిందులు పేర్కొన్నారు. దీని భావం అతి మానసిక కవిత్వం అంతేగాని విమర్శనాత్మక కవిత్వమని కాదు. కవులు కవితా రీతులను గురించి భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచారు. కవిత్వమంటే విమర్శ అని ఆర్నాల్డ్; కవితా ప్రక్రియ అంత:ప్రేరణ వల్ల జరుగుతుందని బ్లేక్;

కవిత్వం అనుకరణ వంటిదని అరిస్టాటిల్ విశదీకరించారు. మరి కొందరు ముఖ్యంగా క్రోచే కవిత్వం భావాభివ్యక్తీకరణ అని, టాల్‌స్టాయ్ అది దివ్య సందేశమని, బెర్నార్డ్‌షా కవిత్వం అంతరంగిక విశ్వాసమని భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. శ్రీ అరవిందుల అభిప్రాయంలో కవిత్వం అతిమానసిక చైతన్యం లేదా సంపూర్ణ చైతన్యం వంటిది. ఈ మానసిక చైతన్యమే కవితా సౌందర్యశాస్త్ర ప్రక్రియకు ప్రధాన భూమిక. అతి మానసిక కవిత్వానికి ఉదాహరణగా హోమర్, షేక్స్పియర్, వ్యాస, వాల్మీకుల కవిత్వాన్ని పేర్కొనవచ్చు. శ్రీ అరవిందులు వీరి కవితా రీతులను దార్శనిక భూమికగా నిర్ధేశించారు.[4].

శ్రీ అరవిందుల కవితలోని అంతరజ్ఞానానికి రెండు లక్షణాలు ఉన్నాయి. వస్తువుల సారంతోను, మూల రూపంతోను అంతర జ్ఞానం తాదాత్మ్యాన్ని పొందుతుంది. అనంత సత్యంలో ఇది తాద్మాన్ని పొందడం మరొక లక్షణం. కవితావిర్భావాన్ని ఆరు దేవతల్లోని అంతర జ్ఞాన దేవత సరస్సుతో పోల్చబడింది. ఈ దేవత కవి చైతన్యంలో నివసించేది. శ్రీ అరవిందుల కవితా విశ్వసృష్టి ఇతర దేవతలైన ఇల, ఉష, దక్షిణ, భారతి, సూర్య, సావిత్రి, సరస్వతి మొదలైన వారిని గురించి నిర్దేశించింది. శ్రీ అరవిందుల భవిష్య కవిత్వం ఉన్నతమైన కవిత్వంగా గోచరిస్తుంది. వీరి భవిష్య కవితా దర్శనం పూర్వ భావాలైన అతి మానసిక రూపాంతీకరణ తత్త్వంలో సంసర్గం పొందుతుంది.

మహా పరిణామ అధినేత శ్రీ అరవిందుల కవిత్వంలో భారతీయ సాంస్కృతిక పునాదిని ఆధారంగా చేసుకొని ప్రాక్పశ్చిమ చింతనా సమన్వయం సూచించబడింది. సాహిత్య దృక్పథంలోనూ, వస్తు విస్తారంలోను, వైవిధ్యంలోను శ్రీ అరవిందులు భారతీయ – ఆంగ్ల కవిగా మనకు వ్యక్తమవుతాడు. వీరిపై రెండు విధాలైన ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తాయి. అవి – 1. ఆంగ్ల కాల్పనిక కవుల ప్రభావం, 2. భారతీయ పునర్వికాసం. శ్రీ అరవిందుల కవిత్వంలో , వాక్యాలలో ఆలంకారిక దృష్టాంతం గంభీరంగా సాగిపోతాయి. ఆయన పూర్ణయోగంలో సూచించిన నాలుగు సిద్ధులను అనుభవించారు. వీరు బరోడాలో ఉండగా స్తబ్ధాత్మసిద్ధిని, అలిపూర్ జైలులో గతిశీల ఆత్మసిద్ధిని, పాండిచ్చేరిలో పురుషోత్తమ చైతన్య దివ్య సిద్ధిని, చివరి రోజుల్లో అతి మానసికానికి కొనిపోయే ఉన్నత పథ సిద్ధిని పొందారు. ఈ జీవితానుభూతులే వీరి కవితా రచనలకు ఆధార భూతమయ్యాయి.

శ్రీ అరవిందులకు పూర్వం వాస్తవమైన అభ్యుదయ ధోరణుండేవి కావు. ఆ కాలంలో ప్రాచీన ఆధునిక సంప్రదాయ మిళితమైన నీతిని బోధించే కవిత్వమే ఉండేది. సంప్రదాయ కవి–త్వం విశ్వజనీనంగా ప్రజాదరణ పొందక పోవడానికి కారణం లేకపోలేదు. సంప్రదాయ సాహితీ వేత్తలు అలంకార భూయిష్టమైన రచనలు చేశారు. అంతేకాక పండితామోదాన్ని పొందడమే కావ్య పరమార్థంగా భావించారు. ఆధునిక కవులు అలంకార ఛందోనియమాలను అతిక్రమించి ప్రజాదరణ పొందడమే ముఖ్య లక్ష్యంగా భావించారు. వీరు కవిత్వంలో సామాజిక విలువలను సమస్యలను ప్రతిబింబింపజేసారు. ఈ కారణంగా సాహితీ వేత్తలు పద్య, వచన కవితలల్లినా వారి కవితా వైశిష్ట్యం రవీంద్రనాథ టాగూరు కవితలా రాణించలేదు.

శ్రీ అరవిందుల ప్రభావం సమకాలీన భారతీయ కవులపై ఉందనే విషయం అందరికీ తెలిసిందే. వీరి సాహిత్య ప్రభావం ముఖ్యంగా నళినీకాంత గుప్త, సుమిత్రానందన్ పంత్‌లపై ఉంది. వీరి రచనలు ఆంగ్ల, బెంగాలీ భాషల్లో వెలువడ్డాయి. శ్రీ అరవిందుల ఆశ్రమంలో స్థిరనివామేర్పరచుకున్న ప్రపంచ ప్రఖ్యాత కవి నళినీకాంత గుప్త. ఆయన శ్రీ అరవిందుని అనుచరుల్లో ప్రముఖుడు.[5]. భారతీయ కవులపై శ్రీ అరవిందుల ప్రభావం అసాధారణమైనది. స్వాతంత్ర్య సమరం సలిపిన రోజుల్లో వీరి విప్లవాత్మక అభినివేశం, జాతీయాభిమానం, దివ్య శక్తి ఆయన అనుచరుల పైన, సమకాలీన బారతీయ కవులపైన పడిందనడంలో అతిశయోక్తి లేదు. 'ఉత్తర పార'

ఉపన్యాస సంగ్రహ విషయం జాతీయ స్థాయిలోను, దేశ భాషల స్థాయిలోను గల భారతీయ కవులను ప్రభావితం చేసిందని చెప్పవచ్చు.

ఆధ్యాత్మికతను గురించి శ్రీ అరవిందులు చేసిన వ్యాఖ్యానం సమగ్రమైనది. ఇది అనుకూల రూపాంతీకరణకు సంబంధించినది. ఈ రూపాంతరం కేవలం జాతీయ స్థాయి వరకే పరిమితం కాక విశ్వజనీనంగా ఉండాలన్నదే వీరి ఆశయం. సామూహిక పరిపూర్ణతకు వ్యక్తిగత పరిపూర్ణత మూలమన్నది భాషా సాహిత్యంలో సుస్పష్టం. చారిత్రాత్మకంగా బుద్ధుడు జీవాత్మను ఉపేక్షించినట్లే, శంకరాచార్యులు పదార్థానికి ప్రాముఖ్యం లేదని ప్రబోధించారు. కాని శ్రీ అరవిందుల తాత్త్విక దర్శనంలో భౌతిక పదార్థానికి జీవాత్మకు ప్రముఖ స్థానమివ్వబడింది. వీరు శంకరాచార్యునిలా విశ్వం శూన్యమని, ప్రపంచం అధ్యాస అని ఏనాడు ప్రవచించలేదు. బుద్ధునిలా ఆద్యంత రహితమైన సమస్యలను గురించి, శాశ్వత సమస్యలను గురించి, భగవంతుని గురించి ప్రశ్నించవద్దని చెప్పలేదు. వీరి తత్త్వదర్శనం సర్వ సమస్యలకు పరిష్కారం వంటిది. కాబట్టి శ్రీ అరవిందుల తత్త్వం సమ గ్రమైన దర్శనమని పేర్కొన్నారు. వీరికి పూర్వం సమగ్రమైన తత్త్వ సిద్ధాంతం మన భారతీయ సాహిత్యంలో ప్రతిపాదించబడలేదని చెప్పలేం. కాని వీరు చెప్పినంత విపులంగా సంప్రదాయ బద్ధమైన సాహిత్యంలో అంతవరకు ప్రతిపాదింపబడలేదని చెప్పవచ్చు.

శ్రీ అరవిందుల కవిత్వం ఒక ప్రత్యేక సంప్రదాయానికి చెందినదని చెప్పలేం. వీరికి పూర్వమున్న కవిత్వాన్ని కాల్పనిక కవిత్వమని, శాస్త్రీయ కవిత్వమని అనేక రచయితలు, సాహితీ విమర్శకులు వర్గీకరించారు. కాని వీరి కవిత్వం శాస్త్రీయ కాల్పనిక కవిత్వాలన్నింటిని అధిగమించినదని చెప్పవచ్చు. శ్రీ అరవిందుల కవిత్వం ప్రత్యక్ష యదార్థ మార్మికానుభవం నుండి ఉత్పన్నమయినటువంటిది. ఆంతర ప్రేరణను, జ్ఞానాన్ని కలిగించే వీరి కవిత్వం అంత:కరణ ప్రవృత్తికి సంబంధించింది. వీరి కవిత్వం తాత్త్విక సౌందర్యం కలిగి మంత్ర శబ్ద తుల్యంగా భాసిస్తోంది. శ్రీ అరవిందుల కవిత్వం అనవసర భావోద్రేక పూరిత పద ప్రవాహాన్ని, శబ్దాడంబరాన్ని పరిహరిస్తుంది. సామాన్య మానవుడికి వీరి కవిత్వం అర్థ రహితంగా స్ఫురించవచ్చు. కాని వీరి కవిత్వం అవగాహన చేసుకోవడానికి అంతర్బుద్ధి అవసరం, ఆధ్యాత్మిక చింతన కూడా కలిగి ఉండాలి. కాల్‌రిడ్జ్ ఉద్దేశంలో కవి తత్త్వ వేత్తగా ఉండాలి. ఇది శ్రీ అరవిందుల విషయంలో నిజమయినది. మానవుడు దివ్య మానవుడిగా రూపొందాలనే ఆకాంక్ష, ధృఢ విశ్వాసం వీరిలో జీర్ణించుకుపోయాయి. ఈ భావన వీరి కవితా రచనలకు ఊపిరి. మానవుడి భవిష్యత్తును గురించి సమర్థించారు, కాబట్టి వీరి కవిత్వాన్ని భవిష్య కవితగా పరిగణించారు. సంప్రదాయ బద్ధమైన సాహిత్యంలో నూతన భావాలు ఇమిడి ఉండకపోవచ్చు. శ్రీ అరవిందుల అభిప్రాయంలో సాహిత్యంలోని నూతన కవితారీతులకు సంప్రదాయ కవితా రీతులు మార్గదర్శిగా ఉండాలి.

'జీవన్ముక్తి' పద్యంలో శ్రీ అరవిందులు జీవన్ముక్త చైతన్యానికి నాలుగు అంశాలు ముఖ్యమైనవని, ఆధారభూతమని వివరించారు. అవి సౌమ్యం, తేజస్సు, శక్తి, ఆనందం.[6]. 'నిర్వాణ'మనే మరొక పద్యంలో శ్రీ అరవిందులు బాధలను తుడిచివేసే పద్ధతిని నిర్దేశించారు. వీరి కావ్య పఠనం అవ్యక్తమైన ఆనందాన్ని కలుగజేస్తుంది. శ్రీ అరవిందులు భవిష్య కవితా ప్రాముఖ్యాన్ని వివరించే సందర్భంలో పరిమిత, అపరిమిత అర్థాలనే కాక అంతకు మించిన విషయాలను వివరించారు.

మానవుడు జంతు కోటి నుండి పరిణమించాడు. జడంలోనికి ప్రాణమవతరించగా జీవం; మనస్సవతరించగా మానవుడు రూపొందాడు. మనస్సుకు ఆవల ఉన్న విజ్ఞానం మానవున్ని దివ్య మానవుడుగా ఇంకా భవిష్యత్తులో

రూపొందించాల్సి ఉంది. ఆధ్యాత్మిక సాధన వల్ల మానవుని నుండి దివ్య మానవుడు అవతరించే అవకాశం ఉంది. మానవునికి జంతువు సజీవ ప్రయోగశాల వంటిది. ఈ ప్రక్రియ పై ప్రకృతి నేపథ్యంగా నిలిచింది. ఈ విధంగానే మానవుడు దివ్య మానవ సృష్టికి జీవం గల ప్రయోగశాలగా ఎంచబడ్డాడు.[7]. మానవుని ఆకాంక్షతో, సహకారంతో ప్రకృతి దివ్య మానవుడిని రూపొందించగలడు. ఈ పరిణామమేర్పడటానికి గల అవకాశాన్ని శ్రీ అరవిందులు 'దివ్య జీవనం' అనే గ్రంథంలో వివరించారు. ఈ భావనలన్నీ 'దివ్య మానవుడు' అనే కవితలో కూడా వ్యక్తమవుతాయి. జీవితంలో దివ్య సిద్ధిని పొందాలంటే మానవత్వమే దీనికి పరమావధి అని మానవుడు దివ్య మానవుడిగా రూపొందడానికి అవకాశం ఉందని, శ్రీ అరవిందులు తన కవిత్వ మంతటా భవిష్యత్ కాల మానవుని ఆవిర్భావానికి గల అవకాశాన్ని గురించి వివరించారు. అందువల్ల శ్రీ అరవిందులను ద్రష్ట అని, వీరి కవిత్వాన్ని అతిమానసిక కవిత్వమని పేర్కొన్నారు.

యూరోపియన్ కవి 'రెల్కె'ను భారతీయ ద్రష్ట శ్రీ అరవిందులను పోల్చి చూడవచ్చు. రెల్కె 'ఆర్ఫస్' ను, శ్రీ అరవిందుల 'సావిత్రి'ని పోల్చి చూడవచ్చు. యూరోపియన్ కవుల వలె శ్రీ అరవిందుల భావకవితలల్లటంలో సుప్రసిద్ధులు. వీరు అసాధారణమైన వ్యాఖ్యానాలు చేయటం వల్ల వీటి అవగాహన అంత సులభమైనది కాదు. ప్రొఫెసర్ కె. శ్రీనివాస అయ్యంగార్ శ్రీ అరవిందుల కవిత్వాన్ని పరిశీలించి వీరిని మొదటి వర్గానికి చెందిన హెూమర్, షేక్స్పియర్, వాల్మీకి మహా కవులలో చేర్చారు. [8]. మహాకవికి ఉండవలసిన విశిష్ట లక్షణాలు శ్రీ అరవిందునిలో ఉన్నప్పటికీ వీరు కవిగా గుర్తించబడకపోవడానికి కారణం లేకపోలేదు. వీరు మహాయోగిగా పేరు పొందటం వల్ల వీరిలోని ఇతర లక్షణాలు స్పష్టంగా కనబడలేదు. కావ్య లక్షణానుసారం శ్రీ అరవిందులను ప్రపంచ ప్రఖ్యాత కవులలో ఒక మహాకవిగా నిశ్చయించారు. ప్రపంచ మహాకవులలో భగవద్దర్శనం పొందిన వారిలో శ్రీ అరవిందులు ఒకరు.

యూరోపియన్ కవి అయిన బ్లేక్‌ను శ్రీ అరవిందులతో పోల్చి చూస్తే, ఇద్దరు అతి మానసిక కవిత్వాన్ని రాసిన వారే, జీవితంలో దివ్య దర్శనాన్ని పొందిన వారే. బ్లేక్ తన చిన్న తనంలో ఒక వృక్షం సమీపంలో దేవతలను దర్శిస్తే, శ్రీ అరవిందులు అలిపూర్ జైలులో శ్రీకృష్ణభగవానుని దర్శించారు. దీని కారణం అసమర్థనీయమని ఈ కవులిద్దరూ సమ్మతించారు. బ్లేక్ కేవలం ద్రష్టయే కాక ఆదర్శ ప్రాయుడు. బ్లేక్ తాను తలచిన దానిని, చూచిన దానిని వర్ణించారని శ్రీ అరవిందులు వ్యాఖ్యానించారు.[9]. శ్రీ అరవిందులు తన కవితా వస్తువును శాస్త్రీయ ప్రమాణాల నుండి గ్రహించి వ్యాఖ్యానించారు.

శ్రీ అరవిందుల దృష్టిలో కళ ముక్తి ప్రదాయిని. దీని ద్వారా మోక్షాన్ని సాధించవచ్చు. కొన్ని సందర్భాలలో వీరి కవిత్వంలో కళను 'చిత్తవిస్తారం' అని కూడా వ్యాఖ్యానించారు. పైన వివరింపబడిన కళా నిర్వచనానికి అర్థం 'రసేనతృప్త:' కళ అనేది అర్థవంతమైనది. సంతృప్తి నిచ్చేది. కనుకనే శ్రీ అరవిందుల కవిత్వాన్ని ఉదాత్త కవిత్వంగా పేర్కొన్నారు. సమాధి స్థితిలోనుండి రాయబడిన శ్రీ అరవిందుల కవిత్వం సౌందర్య పూరితం. భారతీయ చింతనలో సౌందర్య శాస్త్రానికి కొంత చరిత్ర ఉంది. భారతీయ చింతనలో నాట్య పదం ఉదాత్త కళగా పరిగణింపబడింది. బ్రహ్మ వేదశాస్త్ర సారాన్ని గ్రహించి నాట్య వేదాన్ని రూపొందించాడని చెప్తారు.పదాలను ఋగ్వేదం నుండి, భావ సూచనలను యజుర్వేదం నుండి, రసాన్ని అధర్వణ వేదం నుండి, గానాన్ని సామవేదం నుండి గ్రహించారు. ఈ నాలుగు వేదాల్లోని భాగాలకు భారతీయ సౌందర్య శాస్త్రంలో ప్రాముఖ్యం కలదు.

మానవుని భవితవ్యాన్ని తీర్చి దిద్దేందుకు భారతీయ సౌందర్యశాస్త్రానికి నిర్ణీత స్థానం ఉంది. భారతదేశంలో సౌందర్యశాస్త్రం అంటే కేవలం సౌందర్య శాస్త్రం మాత్రమే కాదు. ఉన్నత పరిణామానికి, సిద్ధికి ఇది సాధనం వంటిది. ప్రాచీన భారతదేశంలో ఈ సాంస్కృతిక కళలు ముఖ్యంగా కవిత్వం సౌందర్యశాస్త్రం నుండి ఆవిర్భవించినవే. బ్రహ్మ మొట్టమొదట భరతునికి అంతః ప్రేరణ వల్ల తెలియ జేశాడు. దీనినే 'గాంధర్వవేదం' అంటారు. కవిత్వం, సంగీతం, చిత్రకళ, వాస్తు శిల్ప కళ, నృత్యం మొదలైన కళల లాగే భారతదేశంలో సౌందర్య శాస్త్రం కూడా అభివృద్ధి చెందింది. సంప్రదాయవాది అయిన హేమచంద్ర అనే రచయిత 'కారానుశాసన'లో సౌందర్య శాస్త్ర సారాన్ని గురించి వ్యాఖ్యానించారు. ప్రాఖ్య, ఉపాఖ్యలకు గల భేదాన్ని వివరించాడు. ఉపాఖ్య కళకు మూలం ప్రాఖ్య వీరు సృజనాత్మక భావనను కారయిత్రి ప్రతిభ, భావయిత్రి ప్రతిభ అని రెండు విధాలుగా వివరించారు. ఆలోచనా శీలమైనది భావయిత్రి ప్రతిభ. శ్రీ అరవిందులలో ఆలోచనా శీలమైన భావనను మనం గమనించవచ్చు. వీరి కవిత్వం అతి మానసిక కవిత్వానికి సంబంధించినది.[10]. శ్రీ అరవిందులకు పూర్వం అనేక కవులు అలంకార శాస్త్ర ఆవశ్యకతను గుర్తించారు. ఈ సందర్భంలో యాజ్ఞవల్క్యుడు, వ్యాస వాల్మీకులను పేర్కొనవచ్చును.

శ్రీ అరవిందుల ఆధ్యాత్మిక, మార్మిక కవిత్వంలో అనేక విషయాలు అంతర్గతమై ఉన్నాయి. వీరి కవిత్వం సృజన సమ్మతం. దీనిలో కావ్యానుశాసన విలువలు, మంత్ర తుల్యమైన శబ్ద లయలు, ఛందోరీతులు మొదలైన విశిష్ట లక్షణాలున్నాయి. అతి మానసికం, ఆకాంక్ష వంటి గుణాలతో వీరి కవిత్వం రూపొందింది. మంత్ర తుల్యమైన లయను విమర్శకులు శృతి లోపల అంతర శృతి అని పేర్కొన్నారు. 'శ్రోత్రస్య శ్రోత్రః'[11]. శ్రీ అరవిందుల అభిప్రాయంలో కవిత్వం దేవలోకం నుండి సృజనాత్మకమైన ప్రముఖ ప్రాణం నుండి జనిస్తుంది. మహా కవిత్వం భావోద్రేకం, ప్రముఖ ప్రాణశక్తికి సంబంధించిన సృజనాత్మక సౌందర్యంపైనా, వీటన్నిటినీ మించి కవి స్వయం ప్రకాశిత ప్రతిభ, చైతన్యంపైనా ఆధారపడి ఉంటుంది. పైన పేర్కొన్న గుణాలు కవిత్వావిర్భావానికి కారకాలు. శ్రీ అరవిందుల కవిత్వం ఆధ్యాత్మిక మంత్రతుల్యమైన కవిత్వానికి సంబంధించినది. ఉత్తమ కవి సర్వ సాధారణంగా అపూర్వమైన భావనాశక్తి గల ప్రతిభా శాలియై ఉంటాడు. శ్రీ అరవిందుల వంటి మహా కవులు ఉత్తమ శ్రేణికి చెందిన కవుల వర్గానికి చెందుతారు. మొదటి వర్గంలో వాల్మీకి, హోమర్, షేక్స్పియర్‌లను, రెండవ వర్గంలో ప్రపంచ ప్రఖ్యాత కవి గేథేను చేర్చారు.[12]. ఈ కవులందరిని కావ్యాలంకార లక్షణ గ్రంథకర్తలుగా పరిగణించవచ్చు. శ్రీ అరవిందుల కవిత్వంలో సృజనాత్మక ప్రతిభ, కల్పనాశక్తి, వీటన్నిటిని మించి చైతన్య పరివర్తన ప్రస్ఫుటిస్తుంది

శ్రీ అరవిందులు కవిత్వం సమకాలీన కవులనే గాక ఆధునిక కవులను కూడా ప్రభావితం చేసింది. శ్రీ అరవిందుల కవిత్వం రెండు విధాలుగా ప్రభావితం చేసింది. సమాధి అవస్థలో నుండి ఉత్పన్నమైన వీరి సమగ్ర కవిత్వం ఇతర కవుల రచనలను ప్రభావితం చేసింది. బహుముఖ ప్రజ్ఞగల వీరి కవిత్వం ఉదాత్త కవితా లక్షణాలను కలిగి ఇతర కవులపై ప్రభావాన్ని చూపింది. భవిష్యకవితకు సంబంధించిన వీరి కవిత్వంలోని విశిష్ట లక్షణం అంతరజ్ఞాన దివ్య దర్శనం. శ్రీ అరవిందులు సత్యం, సౌందర్యం, ఆనందం, జీవితం, ఆత్మ అనే ఐదు దివ్య శక్తులను సమ్మేళనం చేసి, వీటికి తన కవిత్వంలో అత్యుత్తమ భావనలతో ప్రాబల్యాన్ని కల్పించారు. ఈ భావనలో భిన్న రీతులను పేర్కొనవచ్చు. ఉదాహరణకు కవిత్వంలో ఆత్మాశ్రయ భావన కన్నా వస్త్వాశ్రయ భావన భిన్నమైనది. ఈ విధంగానే సౌందర్య కల్పన మిగిలిన వాటికన్న భిన్నమైనది. శ్రీ అరవిందుల కవిత్వం అభ్యుదయ భావాలను, సమగ్ర ఆధునిక భావాలను కలిగి ఉంది. ఋగ్వేదంలో శాశ్వత సత్యాల ఆస్తిత్వాన్ని మనం గమనించ వచ్చు. ఇది సాంకేతిక అభివ్యంజనం. జీవితాన్ని గురించిన చింతనలోని తేజో పూరిత జ్ఞానశక్తి అనంత సత్య

ప్రవాహంపై ఆధారపడి ఉంటుంది. ఈ దివ్య సత్యం సౌందర్యం, ఆనందం, ఆత్మల ఆధ్వర్యంలో ప్రపంచ సృష్టికి శివతాండవానంద పారవశ్య స్థితిని కల్పిస్తుంది. శ్రీ అరవిందుల తత్త్వ శాస్త్రంలో ఈ స్థితిని సమగ్ర సౌందర్య శాస్త్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుంది[13].

శ్రీ అరవిందులు కవిగా అతి మానసిక చైతన్య స్థాయితో ఈ అద్భుతమైన సత్యాన్ని దర్శించారు. ఈ స్థితిలో వీరు ఒక నూతన దర్శనాన్ని , నూతన జాతిని ప్రపంచంలో ప్రవేశపెట్టడానికి జీవితాంతమూ కృషి చేశారు. వీరు కవిత్వంలో విశ్వసృష్టి– స్థితి – లయల అర్థాన్ని ; మానవ జీవనం, దాని స్వరూప స్వభావాదుల చిత్రణం, ఆధ్యాత్మిక సత్యాలను గురించి వివరించారు. వీరి కవిత్వం ఆధ్యాత్మిక విజ్ఞాన దివ్య జ్యోతిలా ప్రజ్వలించి, భూత, వర్తమాన, భవిష్యత్ యుగాలకు సేతువును నిర్మించింది.

శ్రీ అరవిందుల అతి మానసిక కవిత్వం భవిష్యత్కాల కవితా పథాన్ని గురించి వివరించింది. వీరి కవిత్వం ప్రకృతి, ఆత్మల మధ్య గల సన్నిహిత సంబంధాన్ని ; నూతన భావనల గంభీరతను వర్ణించింది. వీరి కవిత్వ ప్రగతిలో కొన్ని దశలను ఇంతకు మునుపే గమనించాం. వీరి కవిత్వ పూర్వభాగమైన ప్రకృతి కవిత్వం మనకు భిన్న ప్రకృతి వర్ణనలను చిత్రించి ఆనందాన్ని చేకూరుస్తుంది. శ్రీ అరవిందుల కవిత్వంలోని రెండవ శాఖను స్వాతంత్ర్య ప్రగతి కావ్యంగా నిరూపించవచ్చు. దీనిలో జాతీయ భావవాదం, దేశభక్తి గీతాలు, విప్లవ కవిత్వం గోచరిస్తాయి. శ్రీ అరవిందుల మూడవ కవిత్వ శాఖను ఆధ్యాత్మిక కవిత్వమని భావించవచ్చు[14]. ఈ కవిత్వం విశ్వరూపానికి, అతనికి గల ఆంతరంగిక సంబంధాన్ని వ్యక్తపరుస్తుంది. అందుచే వీరి కవిత్వాన్ని ప్రగతిశీల పథంలో కొన్ని భాగాలుగా వర్గీకరించడం తగదు. వీరి కవిత్వం సంప్రదాయ విరుద్ధమైన సత్య ప్రవాహం. ఇది యదార్థానికి సంబంధించిన లయబద్ధమైన దివ్య దర్శనం.

శ్రీ అరవిందుల కవిత్వాన్ని 'ఆత్మకవిత్వ'మని పేర్కొనవచ్చు. ఏ కవిత్వమైతే ప్రభావాన్ని కలిగించి, గౌరవాన్ని పెంపొందింప జేస్తుందో అదే యదార్థం మాటునున్న వాస్తవాన్ని వెల్లడించే కవిత్వం. ఇదే శ్రీ అరవిందుల కవితా విశిష్ట లక్షణం. వీరి సమగ్ర కవిత్వంలోని వైశిష్ట్యాన్ని వివరించాలంటే 'అంతరజ్ఞాన సాక్షాత్కారం' అనే పదం సరియైనది కాకపోవచ్చు. వీరి కవిత్వంలోని విశిష్టలక్షణం 'భావస్థిరాని'. స్థిరమైన భావాలతో కూడిన కవిత్వమని దీని భావం. ఈ విషయంలో శ్రీ అరవిందులు ప్రతిభా శాలియైన ఆదికవి కాళిదాసును అధిగమించారనడంలో సందేహం లేదు. వీరి కవిత్వం పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షాలను బలపరుస్తుంది. వీరి సమగ్ర కవిత్వం విభావానుభావాలను, చింతన, అనుభూతి, సంకల్పాలను సమన్వయ పరచింది. భరతుడు తన నాట్య శాస్త్రంలో నవరస భరితాన్ని గురించి నిర్దేశించాడు. నవరసగుణాలు ఆదర్శ కవిత్వానికి మూలం. ఈ నవరస గుణాలు సామాన్య కవుల భావనల కన్న భిన్నమైనవి. దీనిని వ్యభిచారి భావమంటారు. శ్రీ అరవిందులు ఋషి–కవి కాబట్టి వీరి కవిత్వం సాధారణ కవిత్వ లక్షణాలను అధిగమించి ఆధునిక కవితా క్షేత్రంలో ఆదర్శ ప్రాయమయింది. వీరి కవితలో పదగుంఫన, రీతి, ధ్వని, శబ్దార్థ అలంకార ప్రయోగాలు పాటింపబడ్డాయి. శ్రీ అరవిందులు కవితా లక్షణాలను గురించి వివరిస్తూ, 'కవిత్వం ఆత్మనుండి అప్రయత్నంగా ఆదిర్భవించిన భావాభివ్యక్తీకరణ అని, అది సమాధి స్థితిలో నుండి జనించే మంత్రమని' వ్యాఖ్యానించారు[15]. శ్రీ అరవిందులు అతి భౌతిక, మార్మిక కవి అయినందు వల్ల తన కవితా రచనలలో కొన్ని సమయాల్లో ధీరశాంత నాయకులవైపు ; మరికొన్ని సందర్భాలలో ధీరోదాత్త నాయకులవైపు ఉన్ముఖులయ్యారని చెప్పవచ్చు[16]. వీరి కవిత్వం లయబద్ధమైన, అర్థవంతమైన ఆకృతితో కూడి ఉంటుంది. కొన్ని సందర్భాలలో అర్థవంతమైన వీరి కవితా కృతులు భాషాకృతులను అధిగమించామని

చెప్పవచ్చు. చమత్కారం, అత్యుక్తి వికటకవిత్వాలను భాషాకృతిలోను ; అలంకారం, ఉపమానం, భావోపదేశం ప్రతీకాత్మకవాదం, వ్యక్తిత్వారోపణ, విషాదాభాసలను లయబద్ధమైన ఆకృతిలో గమనించవచ్చు. వీరి కవితారీతుల విశిష్ట లక్షణాను సారం శ్రీ అరవిందులను ఆధునిక కవిత్వంలో ఒక నూతన ప్రగతిశీల ప్రభోదకునిగా నిరూపించవచ్చు.

---

## పాద సూచికలు

1. శ్రీఅరవిందుల సమగ్ర తత్త్వశాస్త్రం మానవుని బాహ్య, ఆంతరంగిక జీవిత విధానాలను గురించి చర్చిస్తుంది. శ్రీ అరవిందుల ఆంతరింగిక జీవితం బాహిర జీవితానికి ఆధారం. సత్య హృదయం, శ్రద్ధ, ఆకాంక్ష, భక్తి, సమర్పణలే ఆంతర జీవితానికి అర్థం.
2. V.K. Gokak, Sri Aurobindo Seer and Poet, Abhinav Publications, New Delhi 1973, p.107.
3. Sri Aurobindo, Savitri, Birth Centenary Library(Volume29), Sri Aurobindo Ashram Trust, Pondichery, 1970, p.743-44
4. శ్రీ అరవిందుల కవిత్వాన్ని ఛందోబద్ధమైన కవితగా భావించరాదు. వీరి కవిత్వం అధిమనస్సుకు సంబంధించినది. అది ఆకాంక్ష, రూపాంతరానికి మూలమైనది వీరి భవిష్య కవిత దివ్య మంత్రం వంటిది.
5. V.K. Gokak, Sri Aurobindo Seer and poet, Abhinav Publications, New Delhi, 1973, p.157.
6. Sri Aurobindo, The Future Poetry, Volume 9, Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, p.435.
7. భవిష్య మానవుడే దివ్య మానవుడని శ్రీ అరవిందుల భావం. ప్రస్తుత మానవుని పరిణామానికి జంతువు ఏ విధంగా సజీవ ప్రయోగశాలగా ఉపయోగపడిందో అదే విధంగా దివ్య మానవుని పరిణామానికి మానవుడు సజీవ ప్రయోగశాలగా పరిగణింపబడుతున్నాడు. భవిష్యత్తులో రాబోయే నూతన జాతిని సూచించే పరిణామ లక్ష్యం ఇదే.
8. Sri Aurobindo, The Future Poetry, Volume 9, Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, p.454.
9. Sri Aurobindo, Savitri, Birth Centenary Library(Volume29), Sri Aurobindo Ashram Trust, 1970, p.743.
10. Sri Aurobindo, Savitri, Birth Centenary Library(Volume29), Sri Aurobindo Ashram Trust, Pondichery, 1970, p.743.
11. Sri Aurobindo, Upanishads, Birth Centenary Library(Volume12), Vide Ken Upanishads, Sri Aurobindo Ashram Trust, 1972, p.145.& (Kena 1.2)
12. Sri Aurobindo, The Future Poetry, Birth Centenary Library,(Vol.9), Sri Aurobindo Ashram Trust, 1972, p.521. Vide Classification of Poets.
13. Sri Aurobindo, The Future Poetry, Volume 9, Sri Auronindo Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust, 1972, p.366-370.
14. Sri Aurobindo, Collected poems, (Volume 5), Birth Centenary Library, Sri Aurobindo Ashram Trust 1972, Vide the phases.

15. రవీంద్రనాథ టాగూరు, కాళిదాసుల ప్రకృతి కవిత్వానికి శ్రీ అరవిందుల అధిమానసిక కవిత్వానికి కొంత భేదముంది. కాళిదాసు విశ్వ శక్తులకు, ప్రకృతి సౌందర్యానికి పరవశుడై కవిత్వం రాస్తే శ్రీ అరవిందులు అనంత దివ్య సత్యాల చేత, విశ్వజ్ఞానం చేత ప్రభావితుడై కవిత్వం రాశాడు. శ్రీ అరవిందుల కవిత్వం ధ్యానంలో జనించిన కవిత్వం. ఆత్మ సందేశాల రహస్య అంతర్వాణియే వీరి కవిత. మానవతావాదియైన టాగూరు విశ్వ జనీన సత్య సాధనంగా నిలిచి మానవుని గురించి కవిత్వం రాశాడు.
16. V.K. Gokak, An Integral View of Poetry, Abhinav Publications, New Delhi 1975. p.99 & 206.

# 5. స్వాతంత్ర్యానంతర తెలుగు కవులపై
# శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వ దర్శన ప్రభావం

## స్వాతంత్ర్యానంతర కవుల విశిష్ట లక్షణాలు :

ఆధునికత ఈ యుగ ధర్మం. నవ్యత వ్యక్తినిష్ఠం. ఆధునికతలో నవ్యత అంతర్భాగం. ఆధునికత ఒకటే అయినా అందులో అనేక విధాలైన నవ్యమార్గాలుండవచ్చు. ప్రతిభావంతుడైన వ్యక్తి తన పూర్వులు నడచిన బాటలో నడవక తన రచనల్లో ఏదో ఒక నవ్యతను చూపిస్తాడు. వ్యాస, వాల్మీకి, కాళిదాసు, జయదేవుడు మున్నగు ప్రాచీన కవులు ; శంకరుడు, రామానుజుడు, వివేకానందుడు, శ్రీ అరవిందులు మొదలగు తాత్త్వికులు వారి వారి రంగాల్లో కొన్ని సంప్రదాయాలను ప్రతిష్టించారు.

ఒక దేవుడు ఒకే తీరైన సృష్టి క్రమం, మాయ, కర్మ, పునర్జన్మ, పుణ్యం, పాపం, ఇత్యాది విశ్వాసాలతోనూ; కట్టుబాట్లున్న సామాజిక వ్యవస్థతోను, బ్రహ్మచర్య గార్హస్థ్యాది జీవిత దశలతోను ; రాజు, రాజభక్తి, రాజనీతి ఇత్యాది విషయాలు గల రాజకీయ వ్యవస్థతోను ; వీటన్నిటిని కలిపి మొత్తం అంతటిని పడుగు పేకలుగా అల్లిన సర్వంకషమైన ధర్మంతోను ఉన్న ఒక స్వయం సంపూర్ణమైన ప్రపంచం ప్రాచీన సాహిత్యంలోని ప్రపంచం. సందేహాలకు నియమితామైన సమాధానాలున్న ఈ సుస్థిర వ్యవస్థలో ప్రవర్తిల్లేది సంప్రదాయక సాహిత్యం. ఇంద్రియాల ద్వారా, బుద్ధి ద్వారా గ్రహించగలదే జ్ఞానం అయి ; దానికి బుద్ధి కల్పించిన హేతుబద్ధత ఒకటే ఋజువయి, వ్యక్తికి అస్తిత్వం స్వయం సిద్ధములు. ఆ అస్థిత్వానికి సార్థకత వ్యక్తి తాను స్వేచ్ఛ వల్ల కల్పించుకున్నదే అయి, మనుష్య సమాజాల భవితవ్యం, చారిత్రక శక్తుల అనివార్య గమనం వల్లనే ఏర్పడుతూ, నీతికి, న్యాయానికి, ధర్మానికి, ప్రేమాభిమానాలకు ఉపాధి భౌతికమే అయిన ప్రపంచం ఆధునిక సాహిత్యంలోని ప్రపంచం. ఈ వ్యవస్థలో అత్యంత వాస్తవికత గురించి ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు సమాధానములు వెతికే ప్రయత్నంలో భిన్న మార్గాలను అన్వేషిస్తుంది ఆధునిక సాహిత్యం[1].

తెలుగు సాహిత్యంలో సంప్రదాయ సాహిత్యం, ఆధునిక సాహిత్యం ఈ రెండింటికి తేడా నిక్కచ్చిగా ఒక చోట విడిపోయి కనిపించదు. కాని సంప్రదాయం ఒక యదార్థ దర్శనంగా ఎక్కడ దెబ్బతిన్నదో అక్కడ ఆధునికత మొదలయిందని నిర్ణయించాలి. ఆధునిక సాహిత్యానికి, సంప్రదాయ సాహిత్యానికి మధ్య నిర్దిష్టమైన భేదసాదృశ్యాలను మనం చెప్పలేం.

గీతా సూక్తులు, రసమయ ఋక్కులు, ఆత్మతత్త్వం, కర్మయోగం, జ్ఞానయోగం, భక్తియోగం, పరమాత్మ స్వరూపం, చతుర్విధ పురుషార్థాలకు సంప్రదాయ సాహిత్య వేత్తలు ప్రాధాన్యమిచ్చి అమూల్యమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఆధునిక సాహిత్యం ఎక్కువగా నేటి సామాజిక వ్యవస్థను ప్రతిఫలింపజేస్తుంది. సంప్రదాయ సాహిత్యంలోని పురాణాలు, ఇతిహాసాలు వస్తు ప్రధానమయినవి. ప్రబంధాలు రచనా ప్రధానమయినవి. ఆధునిక సాహిత్యం భావప్రాధాన్యం గలదని చెప్పవచ్చు. భావం మారినప్పుడల్లా కవితారూపం మారింది. కొత్తరూపానికి అనుగుణంగా భావం మలుపు తిరిగింది కూడా. ప్రతి కవితా రూపం ఒక నిర్దిష్ట కాలానికీ, ఒక ప్రత్యేక సామాజిక దశకీ పరిమితమయినది.

ఆధునిక సాహిత్యానికి రస సిద్ధాంతం వర్తింపజేయడం సాధ్యం కాదని విభావాది సామాగ్రి పుష్కలంగా లేదని లాక్షణికులు కొందరు ప్రతిపాదించారు. పండితామోదాన్ని పొంది కావ్య గౌరవాన్ని పెంపొందింపజేయడమే సంప్రదాయ సాహిత్య లక్షణం. ఆధునిక సాహిత్యాల్లో సమష్టి దృష్టి ప్రజల కోసం రూపొందింపబడిందని చెప్పవచ్చు. ఆధునిక కవిత్వంలో ముఖ్యమయినది స్వేచ్ఛ, ఆత్మానుభూతి ప్రకటనమే కవిత్వంలో ప్రధానమనే సిద్ధాంతం వీరిది. అలంకార శాస్త్ర నియమాలను ఉల్లంఘించడం ఈ సిద్ధాంతానికి బహిఃప్రకటనం. సంప్రదాయ సాహిత్యంలో నియ–మాలు గౌరవార్హమైన విషయం. ఛందస్సుని పాటించడం, వ్యాకరణ శాస్త్ర విషయాలను అంగీకరించడం పూర్వ కవిత్వ పద్ధతులు. అప్పుడు స్వేచ్ఛ అనేది దోషంగా భావించబడిన లక్షణం.

సమాజంలో వర్ణాశ్రమ ధర్మ బాహిరమైన జీవితం గౌరవార్హం కానట్లే కవిత్వంలో అలంకార శాస్త్రబద్ధంకాని, వ్యాకరణ శాస్త్ర విహితం కాని రచన గౌరవార్హం కాదు. ఆనాడు కవి త్వానికి నియమ, రక్షణ కాని ఈనాడు నియమం శృంఖలం. ఆధునిక కవిత్వంలో పద్య ఛందస్సులు అనుసరించిన వారు లేకపోలేదు. ఆధునిక సాహిత్యంలో ముఖ్యకవులైన రాయప్రోలు, అబ్బూరి, దేవులపల్లి పద్య ఛందస్సులు అనుసరించారు.

సంప్రదాయ సాహిత్యంలో ఆనందం కావ్య పరమార్థం. ఆధునిక సాహిత్యంలో ముఖ్యంగా అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వంలో ఇది లోపిస్తుందని కొందరి అభిప్రాయం. సంప్రదాయసాహిత్యంలో సంస్కృత పదాలను తెలుగులో వాడే పద్ధతిని నిర్ణయించి, సంస్కృత వృత్తాలను గ్ర హించి, ఆనాటికి కన్నడ వాఙ్మయంలోని ప్రశస్త లక్షణాలను సేకరించి తెలుగులో కావ్య రచనా మార్గాన్ని తీర్చిదిద్దారు.

కావ్య ప్రక్రియలను బట్టి, మార్గదర్శకులైన మహాకవులను బట్టి తెలుగు సాహిత్యాన్ని ఆంధ్ర సాహిత్య చరిత్రకారులు పలు విధాలుగా విభజన చేశారు. సాహిత్య సిద్ధాంత ప్రతిపాదనకు గ్రహించిన విషయాలను ఆధారంగా చేసుకొని స్వాతంత్ర్యానికి పూర్వమున్న కవులని, స్వాతంత్ర్యానంతర కవులని విభజన చేయవలసి వచ్చింది. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటి అంటే, మొదటి వర్గీకరణ మీద రెండో వర్గీకరణ ప్రభావమున్నంతగా రెండో దాని మీద మొదటిదాని ప్రభావం కానరాదు. మొదటిది దేశీయమైన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాల మీది అభిమానం నుండి పుట్టింది. రెండోది సోషలిస్టు విప్లవోద్యమాల శక్తి నుండి పుట్టింది. మొదటిది సంప్రదాయమార్గం. రెండోది అభ్యుదయ మార్గం. ఎంతటి ప్రయోగానికైనా సంప్రదాయవాసన ఉండక తప్పదు. ప్రతి నూత్న మార్గం కొన్నాళ్ళకు సంప్రదాయమైపోతుంది. స్వాతంత్ర్యానంతర కవులపై ప్రాచీన కవులపై ప్రాచీన కవులు నాటిన కొన్ని సంప్రదాయాలు చెక్కు చెదరకుండా ఉన్నాయి. బహిరాకృతిలో కొంత మార్పు కలిగినా వాటి ఆత్మలో వ్యత్యాసం లేదు.

సాహిత్య రంగంలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గాని ఇతర భాషల ప్రభావానికి లోనుగాని భాషంటూ లేదు. శ్రీ అరవిందుల కవిత్వంలోని తాత్త్విక దర్శనం స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వం మీద ఏ విధంగా పనిచేసిందో ఆత్మదిఙ్మాత్రంగా చూపించడమే నా ఆశయం.

శ్రీ అరవిందుల పేరు వినగానే సర్వ సాధారణంగా ఋషి అనే తలంపు కలుగుతుంది. కేవలం ఋషి కవి ఎట్లు కాగలడని సందేహం కలగటం సహజం. పూర్వకాలంలో వైదిక ఋషులే కవులు. 'నానృషిఃకురుతే కావ్యమ్', 'కవయః క్రాంతదర్శనః' అనే మాటల్లో కవి శబ్దం ఋషి పరంగా వాడబడింది కదా!

శ్రీ అరవిందులు తత్త్వవేత్త మాత్రమే కాదు. భూత, వర్తమాన, భవిష్యత్తులు దర్శించగల ప్రజ్ఞాచక్షువు గల కవి. శ్రీ అరవిందుల కవిత్వంలో తాత్త్విక దృష్టి భారతీయ కవులను ప్రభావితం చేసిందని చెప్పవచ్చు. శ్రీ అరవిందుల

తత్త్వ దర్శన ప్రభావం కన్నడ, తెలుగు, బెంగాలీ, హిందీ, తమిళ సాహిత్యాల్లో ఉందనడంలో సందేహం లేదు. భారతదేశంలోని సమస్త భాషా సాహిత్యాలపై ఇతర భాషల ప్రభావముందని చెప్పవచ్చు. ఒక్క తమిళ భాష మీద మాత్రం కొంచెం తక్కువగా ఉందని చెప్పవచ్చు. అటువంటి తమిళ సాహిత్యంలో మహాకవి సుబ్రమణ్య భారతిపై శ్రీ అరవిందుల తాత్త్విక దర్శన ప్రభావముందని కొందరి అభిప్రాయం. "Bharathi was a prodigous writer in English language and his writings like 'Agni and other essays' are comparable to those of Sri Aurobindo in literary standards and depth of ideas"[2]. రంగరాజన్ అన్నారు.

శ్రీ అరవిందుల తత్త్వదర్శన ప్రభావం కన్నడ సాహిత్యంలో వి.కే.గోకాక్ రచనల్లో ప్రతిబింబిస్తుంది. కన్నడ కవి డి.ఆర్.బేంద్రె రచనల్లో శ్రీ అరవిందుల తాత్త్విక దృష్టి విశిష్టంగా ఉందని వి.కె.గోకాక్ అభిప్రాయం[3]. బేంద్రె శ్రీ అరవిందుల రచనలను కన్నడ భాషలోకి అనువదించారు. శ్రీ అరవిందులల సావిత్రిలోని కొన్ని వెలుగులను గ్రహించి కన్నడ భాషలో రూపొందించారు. శ్రీ అరవిందుల సావిత్రి ఆత్మ తేజో దర్శనానికి మూల ప్రతీక. శ్రీ అరవిందుల లేఖలను, శ్రీ మాత ప్రార్థన, ధ్యానం మొదలైన వాటి గురించి వి.కె.గోకాక్ కన్నడ భాషలో రూపొందించారు. శ్రీ అరవిందుల రచనలను 'సమర్పణ' అనే కన్నడ పత్రికలో వెలువరించారు. కె.ఆర్.శ్రీనివాస్ అయ్యంగారు, సంగీత విద్యాంసుడు దిలీప్‌కుమార్ రాయ్‌లు శ్రీ అరవిందుల అనుచరులే. శ్రీ అరవిందుల రచనలు కన్నడ కవులను ప్రభావితం చేసినపుడు మన తెలుగు కవుల మీద కూడ వీరి ప్రభావం అంతో ఇంతో ఉండకపోదు. "వీరు తన అసంఖ్యాక రచనల్లో మానవులకు మహోజ్వల భవితవ్యమున్నదని, ఈ మహీతలమే ఒకనాటికి స్వర్గసీమగా మారనున్నదని చాటి చెప్పాడు. మొదట ఆయన జాతీయోద్యమంలో ప్రముఖ భూమికను నిర్వహించిన వాడూ, తరువాత ఆధ్యాత్మిక క్షేత్రంలో అవిరామ కృషి సాగించినవాడూ, ఆయన సందేశం భారతదేశంలో అన్య ప్రాంతీయులను వలెనె తెలుగువారిని కూడ ఉత్తేజితం చేసింది. ఆయన భావన తెలుగు సాహిత్యాన్ని కూడ కొంత ప్రభావితం చేసింది[4].క్రమంగా శ్రీ అరవిందుల రచనలకు అనువాదాలు తెలుగులో ప్రకటితం కావడం ప్రారంభమయింది. ఈ అనువాదాల వల్ల శ్రీ అరవిందుని భావనను తెలుగు ప్రజలు తెలుసుకోవడమే కాక, తరువాత తెలుగులో ఆ తత్త్వ ప్రభావంతో స్వతంత్రంగా సృజనాత్మక రచనలు వెలువడడం కూడా సాధ్యమయింది. అయితే ఈ అనువాద రచనలను ఆధారంగా తీసికొని శ్రీ అరవిందుల ప్రభావం వీరిపై ఉందని చెప్పడానికి వీలులేదు. శ్రీ అరవిందుల కవిత్వంలోని తత్త్వాన్ని, భావాలను అవగాహన చేసికొని వారి రచనల్లో ఆ భావాలను ప్రతిబింబింప చేసినపుడు ఆ రచనలు ప్రభావితం చేయబడినవని చెప్పవచ్చు. ప్రభావమన్నది ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఉండవచ్చు. ఒకే కాలంలో గాని, భిన్న కాలాలలో గాని ఇద్దరు కవులు ఒకే భావాలను కలిగి యుండవచ్చు.

శ్రీ అరవిందుల మహోన్నత కృషిని తొలుత గుర్తించిన ఘనత ఆంధ్ర జాతిది. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు శ్రీ అరవిందులకు నేషనల్ అవార్డును సమర్పించారు[5]. వీరి తత్త్వాన్ని గ్రహించి తెలుగు కవితా రంగంలో అది ఎంతవరకు ప్రతిబింబిస్తుందో పరిశీలిద్దాం.

## 5.1. ప్రకృతి భావం

శ్రీ అరవిందుల ప్రకృతి తత్త్వ దర్శనం ప్రకృతి సిద్ధాంతం కంటే భిన్నమయినదని చెప్పవచ్చు. ప్రకృతి సిద్ధాంతమన్నది ప్రకృతి వర్ణనగా, ప్రకృతి ప్రతిబింబంగా భావింపబడుతుంది. ప్రకృతి శక్తి స్వరూపిణి. ప్రకృతి దర్శనం వల్ల కవి హృదయంలో కొన్ని అనుభూతులు ఏర్పడుతాయి. ఆ అనుభూతులను తన రచనల ద్వారా ఎదుటి వ్యక్తి మనస్సులో ముద్ర వేసుకున్నట్టుగా వివరించే శక్తి గలవాడే కవి. సామాన్య మానవుని దృష్టికి, కవి దృష్టికి ఎంతో వ్యత్యాసముంది. సామాన్యునికి ప్రకృతి యథాస్థితిలోనే కనిపిస్తుంది. కానీ కవి కది అపూర్వ సౌందర్య రాశిగా భాసిస్తుంది.

ఇంద్రియాత్మకమైన బాహ్య సౌందర్య వర్ణనే ప్రకృతి సిద్ధాంత లక్షణం. మానవుని జీవితం చుట్టూ ఉన్న ప్రకృతికి సంబంధించిన దిగ్విషయాలే శ్రీ అరవిందుల కవిత్వంలోని కవితా వస్తువు. భావావేశమే ఈ విధమయిన కవితా రచనకు తోడ్పడింది. శ్రీ అరవిందుల ప్రకృతి తత్త్వ దర్శనం విస్తృతార్థం గలది. ప్రకృతి సిద్ధాంతానికి సంబంధించిన కొన్ని సామాన్య భావాలు కూడ వీరి కవిత్వంలో స్పష్టంగా కనిపిస్తాయి. కొన్ని సమయాల్లో వీరి కవిత్వం ప్రకృతికి, ఆత్మకి మధ్య గల సన్నిహిత సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. వీటన్నిటికీ మించి వీరి ప్రకృతి కవిత్వం మానవుడికి, విశ్వజనీనానికి మధ్య ఆంతరంగిక సందేశాన్ని పెంపొందిస్తుంది. విశ్వాత్మకు మానవాత్మకు ప్రకృతియే స్వర్ణ సేతువని విశ్వసించారు. వీరి ప్రకృతి కవిత్వంలోని వర్ణనలు, భావనలు కేవలం ఆనందాన్ని మాత్రమే కాకుండా సిద్ధిని, ఉపశమనాన్ని కలుగజేస్తాయి.

మొదటి దశలో శ్రీ అరవిందుల ప్రకృతి కవిత్వంలో ప్రకృతి ప్రపంచానికి చెందని ప్రాణశక్తితో ; రెండవ దశలో వీరి ప్రకృతి కవిత్వంలో మేధస్సుకు సంబంధించిన భావాలతో సౌందర్య భావాలు ; మూడవ దశలో ప్రకృతి కవిత్వంలో ఆధ్యాత్మిక, అధిమానసిక గుణాలతో వ్యక్తమవుతుంది. సిద్ధి, సంపూర్ణత, సాక్షాత్కారమే ఈ కవితా లక్షణాలు. సమాధి స్థితిలో నుండి జనించిన కవిత్వం ఆధ్యాత్మిక నివేదన వంటిది. ప్రకృతి క్రమ పరిణామ వికాసాన్ని శ్రీ అరవిందులు ఈ విధంగా వివరించారు. ప్రకృతి నిశ్చలమైనదీ, నిర్వికారమైనదీ కాదు. ప్రకృతి గతిశీలమయినది, నిరంతర గమనం, మార్పు, పున:సృష్టి, అభివృద్ధి కలది. వీరి దృష్టిలో భౌతిక పదార్థం నిర్జీవమైనది కాదు. అది విశ్వాత్మకు ప్రతీక వంటిది. జడ పదార్థం నుండి జీవం పరిణమించగా, జీవం నుండి మనస్సు వికసించింది. ఆ జీవమే వృక్ష, జంతు, మానవ కోటిగా పరిణమించింది. శ్రీ అరవిందులు విశ్వసించిన పరిణామ భావనలోని ఆరోహణ క్రమం ఇదే. ఈ పరిణామం చైతన్య ప్రగతికి, జీవ కోటి వికాసానికి తోడ్పడుతుంది. అన్నిటినీ మించి చైతన్యవంతమయిన మనస్సు వికాసం పొందడమే ప్రకృతి క్రమ పరిణామ లక్ష్యం. శ్రీ అరవిందుల ప్రకృతి దర్శనం ప్రకృతి పరిణామాన్ని మాత్రమే కాక భౌతిక పదార్థ పరిణామాన్ని కూడా ఆశిస్తుంది. పదార్థంలో ప్రాణం, మనస్సు నిగూఢంగా దాగి ఉన్నాయని వీరు విశ్వసించారు. శ్రీ అరవిందులకు అంతర్వలనం లోను, పరిణామ మార్గంలోను విశ్వాసముంది. పరిణామ సిద్ధాంతంతో బాటు దాని ప్రతి రూపమయిన అంతర్వలన సిద్ధాంతం లేకపోయినట్లయితే అది పాక్షికమయిన భావనగా పరిగణించబడుతుంది. దీనినే శ్రీ అరవిందులు క్రమ పరిణామ వికాస సమగ్ర సిద్ధాంతంగా తెలిపారు. ఈ పరిణామ సిద్ధాంతమే వీరి ప్రకృతి భావనకు ఉన్నతిని సమకూర్చింది.

ప్రకృతి ప్రశాంతమయినది, నిర్మలమయినది. ఆధునిక సమాజంలో కార్య నిమగ్నుడయి, చంచలమయిన మనసున్న మానవుడు ప్రకృతి సౌందర్యాన్ని తిలకించలేకున్నాడు. వెర్రెత్తించే ఈ అధునిక నాగరిక

సామాజానికి దూరంగా పోయినప్పుడే మానవుడు ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించి ఆనందించగలడు. సృజనాత్మక కార్యకలాపాలన్నిటికీ ప్రకృతియే మూలం. మానవుని స్వభావాదుల మీద ప్రకృతి ప్రభావం ఉండి తీరుతుంది. శ్రీ అరవిందులలో ప్రకృతికి సంబంధించిన రెండు భావనలు కనిపిస్తాయి. మానవుడికి భయాందోళనను కలుగజేసే ప్రకృతి ఒకటి, ఉపశమనాన్ని కలుగజేసే ప్రకృతి మరొకటి. సర్వ సాధారణంగా కవిత్వంలో అరణ్య ప్రకృతిని భీకర ప్రకృతిగా చిత్రిస్తారు. పూర్వ కాలంలో దీన్నే రాక్షస ప్రకృతిగా వర్ణించారు. ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగించే ప్రకృతి ఎల్లప్పుడూ ఆకర్షణీయంగా ఆహ్వానిస్తుంది. మొదటి దశకు చెందిన కవితా రచనల్లో శ్రీ అరవిందులు ఈ ప్రకృతి భావాలను వర్ణించారు[6].

శ్రీ అరవిందుల ప్రకృతి కవిత్వానికి తార్కాణంగా ఈ కవితలను పేర్కొనవచ్చు.

1.Night by the sea, 2. The spring child, 3. Nightingale, 4. The sea at Night,
5. Evening, 6. On the mountains, 7. Seasons, 8. A Tree, 9. O coil, Coil, 10. Urvasi,

శ్రీ అరవిందుల ప్రకృతి కవిత్వానికి సంబంధించి కవితలను, స్వాతంత్ర్యానంతరం తెలుగు కవిత్వంలోని ప్రకృతి కవిత్వాన్ని తులనాత్మకంగా వివేచించి భావసామ్యమెంతవరకుందో తెలుసుకుందాం.

మొదట శ్రీ అరవిందుల ఊర్వశిని పరిశీలిద్దాం. షేక్స్పియర్ మాటల్లో చెప్పాలంటే, కవి, ప్రేమికుడు, పిచ్చివాడు ముగ్గురు ఊహల్లోనూ, భావాల్లోనూ జీవిస్తారు. కవి ఊహల్లో తేలి, భావాలతో రూపుదిద్ది, తన భావనకి జీవం పోస్తాడు. ప్రేమికుడు గత స్మృతులను స్మరించి తన ప్రేమ ఆదర్శ ప్రేమగా రూపొందాలని భావిస్తాడు. పిచ్చివాడికి తనదే లోకం. ఈ విధంగా ముగ్గురు భావ జగత్తులో తేలిపోతారు. ఈ సందర్భంలో 'Man in the moon' అనే గోల్డ్ స్మిత్ మాట గుర్తుకు వస్తుంది. కవి ప్రేమికుల భావరూప సృష్టియే ఊర్వశి. వేదకాలం నుండి ఆధునిక కాలం వరకు ఊర్వశి భావన కొందరు కవులను తన్మయులను చేసింది. ఆదర్శాత్మక సౌందర్యాన్ని కవి ఊర్వశి అంటాడు. ఈ ప్రసక్తి ఋగ్వేదంలోను, యజుర్వేదంలోని శతపథ బ్రాహ్మణంలోను కనిపిస్తుంది. ఊర్వశి పురూరవుల మధ్య జరిగే సంభాషణ ఋగ్వేదంలో కావ్య రూపంగా చిత్రించబడింది. పురూరవుడు చంద్రుని వంశానికి చెందినవాడు. నాయిక అప్సరస, ఊర్వశి. వేదాల్లో నాయికా నాయకుల కలయిక, ప్రేమ, వివాహం, వియోగం, పునస్సమాగం ముఖ్యమైన అంశాలు. వేదాల్లోనిఈ ఇతివృత్తాన్ని ఆధారంగా తీసుకొని మహాకవి కాళిదాసు విక్రమోర్వశీయ నాటకాన్ని చిత్రించాడు.ఈ నాటకంలోని పాత్రలు దేవతలు, మానవులు; స్వర్గ మర్త్య లోకాలే నాటక రంగాలు. ఊర్వశి పురూరవుని విక్రమాన్ని చూసి ప్రేమించింది. ఊర్వశి వియోగాన్ని భరించలేక పురూరవుడు చెట్లు, చేమలు, నదీ నదాల్ని, పక్షులను ఊర్వశి ఉనికిని తెలపమని ప్రాధేయపడ్డాడు. ఈ సందర్భంలో మనకు అభిజ్ఞాన శాకుంతలంలోని శకుంతల వియోగ ఘట్టం, సీతా పరిత్యాగ ఘట్టంలో సీతారాముల వియోగం గుర్తుకొస్తాయి. కాళిదాసుని ప్రకృతి వర్ణన అపూర్వమయినది.

మహాకవి రవీంద్రనాథ టాగూరు ఊర్వశికి విలక్షణమైన రూపురేఖలు తీర్చిదిద్దారు. వీరి అభిప్రాయంలో ఊర్వశి కేవలం స్వర్గలోకాత్మలను రంజింపచేసేందుకు పుట్టిన స్త్రీ. వీరి ఉద్దేశాను సారం ఊర్వశి తల్లికాదు, భార్యకాదు, కన్నెపడచు అసలే కాదు.

డాక్టర్ సి. నారాయణరెడ్డి 'ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు; ప్రయోగములు' అనే పరిశోధన గ్రంథంలో ఊర్వశిని గురించి ఈ విధంగా చెప్పారు. "ఊర్వశి అవస్థా భేదమును బట్టి వధువుగా, భార్యగా, తల్లిగా రూపొందుట దీనిలో రహస్యము. ఈ భావమునే గ్రహించి రవీంద్రుడు గానము చేసెను[7]. రవీంద్రనాథ్

ఠాగూర్ ఊర్వశిని అవస్థా భేదాన్ని బట్టి తల్లిగా, వధువుగా, భార్యగా చిత్రించలేదు. ఆమె కేవలం స్త్రీ యని వివరించి, గృహిణికి – ఊర్వశికి, కన్నె పడుచుకి – ఊర్వశికి మధ్య గల తారతమ్మాన్ని స్పష్టంగా చిత్రించారు.

ఊర్వశి కవుల ఊహల్లో రూపు దిద్దుకున్న లావణ్యవతి, నిత్య యౌవన సరసి. మానవ భావనా మందిరంలోని ఆదర్శ ఊహకల్పన ఊర్వశి. నవ వసంతంలో సాగర తరంగాల నుండి ఉద్భవించి ఒక చేతిలో విషపాత్రను, మరొక చేతిలో అమృత పాత్రను పట్టుకొని ప్రత్యక్ష మయింది. అమృత విష పాత్రలకు అంతర్భాగం సుఖదు:ఖాలు. ఒక చేతిలోని విషపాత్ర దు:ఖానికి మూల హేతువై నాశనాన్ని కలిగిస్తుంది. ఊర్వశిని అలౌకిక సౌందర్యానికి ప్రతీకగా టాగూరు చిత్రించారు. ఈ విధంగానే మన తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే, ఊర్వశి రూప లావణ్యాలనూహించి తన్మయులైన వారు రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి కృష్ణమాచార్యులు, బెజవాడ గోపాలరెడ్డి. రాయప్రోలు వారి ఊర్వశి రవీంద్రనాథ టాగూరు ఊర్వశికి భావానుకృతి.

"కన్న తల్లివా ? కావు –
కన్నె పడుచువా ? కావు –
కులీన కళత్రామవా ? కావు – కావు
శుద్ధ సుందరివి,
శుచిమ దవిద్ధ శోభా నందనవు"
"………ఒక చేత అమృత భాండము
…………….ఒర కరమున విషపాత్రము"[8]    ….ఊర్వశి…….

ఈ భావస్వామ్యమే దాశరథి ఊర్వశిలో స్పష్టమవుతుంది. వీరి ఊర్వశి కూడా రవీంద్రుని రచనకు అనుసరణ.

"అపర సంధ్యా ప్రశాంత సూర్యతాపమ్ము
శాద్వలమ్ముల కాంచనాంచలము విసర
గృహిణివై పయ్యెద బిగించి హృదయనాథు
నింట సందియదివ్వె వెల్గించలేదు"
"విష పాత్రమ్మొకచే, సుధాకలశమున్ వేరొక్కచే బూని"
"నీ అరుణాంబుజాత కమనీయ పదమ్ముల మ్రోయు మత్తభృం
గయిత శింజి నీ ధ్వని ప్రియంబొనరించె కవీంద్రకోటికిన్"[9].

….. ఊర్వశి……….

శ్రీ అరవిందులు 'ఊర్వశి' కావ్యాన్ని నాలుగు భాగాలుగా విభజించారు. ఈ కావ్యం శృంగార, కరుణ రస ప్రధానమయింది. మొదటి భాగంలో పురూరవుడు ఊర్వశిని రాక్షసుని బారి నుండి రక్షించిన విధం ; రెండవ భాగంలో స్వర్గలోక వర్ణన, అప్సరసల నృత్య భంగిమలు, భరతుని కోపం వర్ణించబడ్డాయి. మూడవభాగంలో పురూరవుడు ఊర్వశితో సంయోగమొందడం, నాల్గవ భాగంలో ప్రకృతి వర్ణన, అశాశ్వతమయిన ఆనందం కోసం కష్టాలను కొని తెచ్చుకున్నట్లు పురూరవుడు ఊర్వశిని పొందడానికి ప్రజలను, రాజ్యాన్ని నిర్లక్ష్య పరచిన విధం వర్ణించబడినది. విక్రమోర్వశీయంలో పురూరవుడు రాజుగా నిర్వర్తించవలసిన కార్యాలను నిర్లక్ష్య పరచడం వల్ల ఎంతటి అపకీర్తి కలుగుతుంది అనే విషయాన్ని నారద మహాముని ద్వారా వివరించారు. శ్రీ అరవిందులు కూడ ఈ భావాన్నే నాల్గవ భాగంలో వ్యక్త పరచారు. శ్రీ అరవిందులు తన కవితలో నారద మహామునికి బదులుగా విశ్వమాతను

ప్రవేశపెట్టి పురూరవుడు రాజుగా నిర్వహించవలసని కార్యాలను వివరించారు. వీరు కూడా భూలోకానికే ప్రాధాన్యాన్నిచ్చారు.

"From youth of the immortal Ocean born,
They youthful and immortal, and the waves
Were in their feet and in their voices fresh
As foam, and Ocean in their souls was love"[10].
(Urvasie – Canto, 1. p.190)

క్షీరసాగర మథనం తరువాత అప్సరసలందరితో ఊర్వశి జన్మించిందని శ్రీ అరవిందులు వివరించారు. ఊర్వశి అలౌకిక సౌందర్యాన్ని ఈ విధంగా వివరించారు.

"O river, from thee she moved towards the glade
Breathing and wet and fresh as if a flower
All bare from rain, And thou, great holy glade"[11]
(Urvasie – Canto, IV. p.219)

"O once she was the luminour soul of these,
And in her body lived the summer and spring……."[12]
(Urvasie – Canto, IV. p.220)

కృష్ణశాస్త్రి ఊర్వశిలోని లక్షణాల్ని పరిశీలిద్దాం. ఊర్వశి భావన కాళిదాసు, రవీంద్రుడు, అరవిందులను తన్మయులను చేసినట్లే కృష్ణశాస్త్రిని కూడ తన్మయుడ్ని చేసింది. ఊర్వశి కావ్యావతరణంతో అంతవరకు అతని హృదయంలో జరిగిన కల్లోలానికి ఫలితంగా అమృత భాండముదయించింది. అతన్ని ఆనందింపజేసే ప్రేమ, సౌందర్యం, ఈ లోకంలో లేవని తెలుసుకున్నారు. ఊర్వశి సంయోగం స్వప్నావస్థలో లభించినట్లుగా చిత్రీకరించారు. 'రంభ సౌందర్యం లౌకికమని, ఊర్వశి సౌందర్యం అలౌకికమని శాస్త్రిగారు అభిప్రాయపడినారు. [13]. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వంలో లౌకికం – అలౌకికం, వ్యావహారికం – పారమార్థికం, మానవ, దైవ సంకల్పాలు, భిన్నమయినవి కావు. ఊర్వశి ప్రియునితో–

" హాలా హలానలమె అమృత శీతల రసమె
తోడబుట్టులు నాకు! తోడు నీడలు నాకు ! "[14] ….ఊర్వశి….

అన్నప్పుడు అమృత విష పాత్రల ప్రసక్తి స్ఫురిస్తుంది. సంయోగ వియోగాలు, సుఖదు:ఖాలు తనను విడిపోవని దీని భావం. కృష్ణశాస్త్రి ఊర్వశి ఇతర కవుల ఊర్వశి కంటే విలక్షణమయింది. కృష్ణశా–స్త్రి 'ఊర్వశి'లో వారి ప్రేయసి ఊర్వశికి, కవికి ఉన్న అనుబంధం వ్యక్తమవుతుంది.

తొలి వియోగిని నేనే !
"తొలి ప్రేయసిని నేనే !
ఆనాటికీ నాటికేను నీ దాననే! [15] …..ఊర్వశి……….

వాస్తవ జీవితంలో ఊర్వశి సంయోగం కుదరదన్న సత్యాన్ని గ్రహించి కృష్ణశాస్త్రిగారు తన బాధను ఈ విధంగా వ్యక్తం చేశారు.

"తారకా పూర్ణ చంద్ర మార్తాండ బింబ
మండితమ్ము మహాకాశ మంటపమ్ము
నందే కాదె పాణి గ్రహణమ్ము దొరకు
పతిత వెట్లౌదు ? నేనెట్లు పక్షినౌదు?" [16] …..ఊర్వశి……..

ఊర్వశి భూలోకానికి దిగడం, తాను స్వర్గలోకానికి పోవడం అసాధ్యమని తెలిసికొని నిస్పృహతో పరమేశ్వర పాదసాన్నిధ్యాన్ని చేరి శివైక్యాన్ని ఆశించాడు.

వేదాల్లో ఊర్వశి పురూరవుని భూలోకంలో కలిసి అతని శాశ్వత సాహచర్యాన్ని పొందుతుంది. కాని శ్రీ అరవిందుల ఊర్వశిలో పురూరవుడు మానవ స్థితినతిక్రమించి దివ్యుడయి ప్రేయసి ఊర్వశిని పొందాడు. ఈ విధంగానే కృష్ణశాస్త్రి ఊర్వశిలో ప్రేమికుడు స్వప్నావస్థలోనే ఊర్వశి సంయోగం సాధ్యమన్న సత్యాన్ని గ్రహించి పరమేశ్వర పాదసన్నిధిలో శివైక్యం చెందాలనుకుంటాడు. రక్తి నుండి భక్తి వైపు జరిగే క్రమ ప్రస్తానం ఇందులో ధ్వనిస్తుంది. భక్తి మార్గం వల్ల ఊర్వశిని పొందవచ్చుననే తపన ఈయనలో ఉన్నట్లు కనిపిస్తుంది. శ్రీ అరవిందుల ఊర్వశికి, కృష్ణశాస్త్రి ఊర్వశికి మధ్య ఉన్న భావసామ్యమిదే. శ్రీ అరవిందుల ఊర్వశిలో భూలోకవాసి అయిన పురూరవుడు మానవుడు దివ్య మానవుడుగా పరివర్తన చెందవచ్చుననే రూపాంతర మార్గం వల్ల ఊర్వశిని పొందాలని ప్రయత్నిస్తే, కృష్ణశాస్త్రి గారి ఊర్వశిలో ప్రేమికుడు భక్తి మార్గం వల్ల దైవత్వాన్ని పొంది ఊర్వశిని అలౌకిక సౌందర్య రాశిని చేరుకోవాలని ప్రయత్నిస్తాడు. భక్తి మార్గం రూపాంతర మార్గంలోని భాగమే. శ్రీ అరవిందుల ఊర్వశిలోని ప్రేమికుడు కృష్ణశాస్త్రిలోని ప్రేమికుడు చేపట్టిన మార్గం ఒకటే, చేరాలనుకున్న గమ్యం ఒకటే.

శ్రీ అరవిందుల ప్రకృతి భావాన్ని, రాయప్రోలు సుబ్బారావు కవిత్వంలోని ప్రకృతి భావాన్ని పోల్చి చూడవచ్చు. కంటికి కనిపించని నిర్గుణ బ్రహ్మ కంటే ప్రత్యక్ష ప్రమాణమయిన ప్రకృతిని ఆరాధించవచ్చునని, పరతత్త్వం కంటే ప్రకృత్యుపాసన గొప్పదని సుబ్బారావు అభిప్రాయం. పరతత్త్వారాధన కంటే ప్రకృతి పూజ గొప్పదని శ్రీ అరవిందులు భావించలేదు. ప్రకృతిని భగవత్ సాక్షాత్కారంగా స్వీకరించారు. ప్రకృతికి మూలం భగవంతుడు. భగవంతుని ప్రతి రూపమే ప్రకృతి. కాబట్టి ప్రకృతి శక్తి స్వరూపిణి. దివ్య శక్తిని దర్శించేందుకు ప్రకృతి దర్పణం వంటిది. ప్రకృతిలోని పంచభూతాలే ప్రత్యక్ష ప్రమాణాలయినవి. 'అన్నం బ్రహ్మన్" అనేది ఉపనిషత్సారం.

రాయప్రోలు సుబ్బారావు ప్రకృత్యారాధన దృష్టిని కొంత పరిశీలిద్దాం.

"కానబడ కనుమాన ప్రమాణమునకె
అంది యందని పరతత్త్వమవల నుంచి,
పంచభూత దృశ్యంబైన ప్రకృతి యొకటే
సన్నిహిత లక్ష్యమనియే వచస్వినేడు"

" అందు నీ విలక్షణ జీవయాత్రకయిన
పృథివినే నవ్యులు సమాశ్రయింత్రు భక్తి
తల్లిగా, ధాత్రిగా, దేవతామ తల్లి
గా సమస్త పరాపర కావ్యములకు" [17].

దృశ్యమానమయిన, స్థావరజంగమాత్మకమయిన జగత్తంతా ప్రకృతి. ప్రపంచానికి మూలకారణం ప్రకృతి. మానవుడు తన భావనా బలంతో ప్రకృతిని తిలకించి ప్రేమిస్తాడని శ్రీ అరవిందులు ప్రకృత్యారాధన తత్త్వంతో తాదాత్మ్యాన్ని పొందుతాడు. ప్రకృతిని పరమాత్మకి చెందిన విరాట్ స్వరూపంగా భావించారు. ప్రకృతి ఆరాధనే దేవతారాధనగా శ్రీ అరవిందులు విశ్వసించారు. దీని వల్ల మానసిక చైతన్యం వికసిస్తుందని ఈ విధంగా వివరించారు.

'If you deeply feel the beauty of Nature and commune with her, that can help in widening the consciousness'. [18]

శ్రీ అరవిందులు ప్రకృతి తత్త్వ దర్శనంలో ప్రకృతిని దేవతగా, స్త్రీగా, తల్లిగా భావించినట్లే మన తెలుగు సాహిత్యంలో రాయప్రోలు సుబ్బారావు తమ కవిత్వంలోని ప్రకృత్యారాధనలో ప్రకృతిని తల్లిగా, దేవతగా, శక్తి స్వరూపిణిగా భావించారు. సమస్త సౌకర్యాలను సమకూరుస్తున్న ఈ పృథివీ దేవిని, తల్లిని పూజించవచ్చునన్న భావాన్ని ఈ విధంగా వ్యక్తం చేసారు.

"ప్రాణులకు సరసాన్నముల్ వ్యాధులకు మ
హౌషధుల్ సుఖ సాధన పోషణలకు
దివ్య ఫలపుష్ప ఋతుకళాదృశ్యములు స
మృద్ధిగ నిచ్చు తల్లి నర్చింపరాదే ? [19]

శ్రీ అరవిందులు ప్రకృతి తత్త్వదర్శనంలో కేవలం ప్రకృత్యారాధన గురించి మాత్రమే కాక వీటన్నిటికీ అతీతమయిన రూపాంతర యోగ మార్గాన్ని కూడ వివరించారు. రూపాంతర పరిణామ క్రమంలో ఈ ప్రకృతి, భూమి కూడ పరిణామానికి లోనవుతుందని వివరించారు. ప్రకృతి పురుషోత్తముని గురించి అన్వేషించే విశ్వజనీన శక్తి వంటిది. ప్రపంచంలో దివ్యాత్మ ఆవిష్కరణయే ప్రకృతి. ప్రకృతిని భగవత్ సాక్షాత్కారంగా భావించారు. ఈ ప్రకృతి సౌందర్యాన్ని తిలకించడం వల్ల మానవుడు తన మూర్తిమత్వాన్ని పెంపొందించుకునే అవకాశముంది. విశ్వప్రకృతి జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య జరిగే చర్చ వంటిది. ప్రకృతి ఇహలోక సంబంధమయిన పరిణామాత్మక ప్రక్రియ. ఇది మహాశక్తి స్వరూపిణి అని చెప్పవచ్చు. ఆధ్మాత్మిక పరిణామానికి సంబంధించిన బాహ్య అంతర రూపమే ప్రకృతి. ప్రకృతి భగవంతుని లీల, దృశ్యమానమయిన భౌతిక ప్రకృతి గౌణగుణాలు కలది. భూలోక సంబంధమయిన ప్రకృతి ఉన్నత పథానికి కొనిపోయే పరిణామాత్మక గమ్యం కలది. ప్రకృతికి మూడు ముఖ్య లక్షణాలున్నాయి[20]. 1.ప్రకృతి శక్తుల సహాయం వలన ప్రస్తుత స్థాయి కంటే ఉన్నత స్థాయికి ఎదగడం. 2. ప్రకృతి సారూప్యాన్ని పెంపొందించడం. 3. ప్రకృతి శక్తుల కలయిక

ప్రకృతి పరిణామ వికాసం మానవుని సృష్టితో పరాకాష్టనందుకుంది. ఈ మానవుడే తరువాత సాధన వల్ల దేహ, ప్రాణ, మానసిక, ఆధ్యాత్మికమనే మూర్తిమత్త్వ లక్షణాలను పొందగలుగుతాడు. ఈ పరిణామ క్రమంలో మానవుని మనస్సు అనేక మానసిక దశలలో పరిణామం చెందుతుంది. మనస్సు, ఉన్నత మనస్సు, తేజో పూరిత మనస్సు, అంతర్బుద్ధి మనస్సు, అతి మనస్సు, అధిమనస్సు అనేవి మానసిక దశలు. ఈ కారణంగా ప్రకృతి విద్య అవిద్యగా, శక్తి స్వరూపిణిగా, దివ్యాత్మగా, రూపాంతరీకరణంగా, అతీతమయినదిగా వ్యక్తమవుతుంది[21].

## 5.2 జాతీయ భావం :

శ్రీ అరవిందులు జాతీయతను గురించి, జాతీయ విద్యా విధానాలను గురించి తన రచనల్లో వ్యక్తపరచారు. ప్రజలు ఐక్యతా భావంతో మెలగటమే జాతీయ భావం. ఈ భావమే జాతిలో సమైక్య భావాన్ని సాధించడానికి తోడ్పడింది. జాతీయ భావసిద్ధాంతాలు వట్టి మూఢ విశ్వాసాలు కావు. వ్యక్తిగత చైతన్యమే జాతి చైతన్యంగా రూపొందుతుంది. జాతీయ విద్యా విధానమంటే జాతీయ విద్యా ప్రయోజనాన్ని సాధించే విద్యా ప్రయోగం. స్వార్థ రాహిత్యం, జాతి ఉద్ధరణకు అంకితం కావడం, సామూహిక చైతన్యం, సమష్టి భావం ఇవన్నీ జాతీయ భావంలోని ముఖ్యమయిన అంశాలు. ఇటువంటి ఆదర్శాలను ప్రోత్సహించే విద్యా విధానమే నిజమయిన జాతీయ విద్యా

విధానం. ప్రజల్లో జాతీయ చైతన్యంగా రూపొందించిన భావాల్లో జాతీయ విశ్వవిద్యాలయ దృక్పథం రవీంద్రనాథ్ టాగూర్ ప్రాచ్య విశ్వవిద్యాలయానిన గురించి తెలిపిన భావాలకు సన్నిహితంగా ఉంటుంది. దేశంలో విరాట్ పురుష సాక్షాత్కారమే నిజమయిన జాతీయ భావ సిద్ధాంతం.[22]

జాతి ప్రతిరూపాన్ని నిర్మించే జాతీయ వాద లక్షణాలను శ్రీ అరవిందులు స్పష్టంగా వివరించారు. దేశ సౌభాగ్యాన్ని, పురోగతిని ఆశించేవాడే నిజమైన జాతీయవాది. జాతీయవాది దేశానికి ద్రోహం తలపెట్టేవారిని ఏ మాత్రం సహించలేడు. నిజమయిన జాతీయవాది దేశం కోసం జీవించి, దేశ సంపూర్ణతకి, అనుకున్న దాన్ని సాధించేందుకు కృషి చేస్తాడు. ధనిక, శ్రామిక వర్గం అనే భేదం లేని వర్గరహిత సమసమాజాన్ని ఆశించాడు. వ్యక్తికి భౌతిక కళాతత్త్వం శరీరం, జీవం, సంకల్పం, సౌందర్యావబోధతో కూడిన జీవితం ఉన్నట్లే దేశానికి, రాష్ట్రానికి కూడా ఉంటుందని శ్రీ అరవిందుల అభిప్రాయం. ఈ విషయంలో శ్రీ అరవిందులకు, జర్మనీ కేవల వాది అయిన జార్జ్  హేగల్ కు మధ్య పోలికలున్నాయని చెప్పవచ్చు. వీరిద్దరూ దేశం నిశ్చలమయినది కాదని, అది నిరంతర గమనం కలదని విశ్వసించారు. శ్రీ అరవిందులు జాతీయ విద్యా విధానాన్ని, స్వదేశీయ భావాన్ని ఆదర్శ భావంగా పేర్కొన్నారు. మనం కావాలనుకున్న సమాజాన్ని స్థాపించలేం. అది దానంతట అదే ప్రాణశక్తి వల్ల స్వత సిద్ధంగా కాలక్రమేణ వృద్ధి చెందుతుంది. ఆంతరంగిక చిత్తవృత్తికి సంబంధించిన బాహ్య భావాభివ్యక్తీకరణమే సమాజం. శ్రీ అరవిందులు తన రచనల్లో జాతీయ సంస్థను గురించి వివరించారు. శ్రీ అరవిందుల ఉద్ధేశ్యంలో దేశ ప్రగతికి రెండు దశలున్నాయి. దేశ పురోగమనమే మొదటి దశ. రెండో దశలో దేశం సంపూర్ణ ఆకృతిని పొందుతుంది. అప్పుడు అంత-ర్జాతీయ భావంలో జాతీయ భావం ఇమిడి ఉండవచ్చు. కాని జాతీయ భావంలో అంతర్జాతీయ భావం ఇమిడి ఉండవచ్చు, ఉండకపోవచ్చు.

శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వశాస్త్రంలో జాతి వ్యవస్థ, సామాజిక వ్యవస్థ, రాష్ట్రవ్యవస్థ, దేశ వ్యవస్థ అనేవి భిన్నమయినవి కావు. ఇవన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయి. సామాజిక స్థిరత్వమే దేశ ప్రగతికి మూలం. వ్యక్తిగత చైతన్యం, సామాజిక చైతన్యం, జాతీయ, అంతర్జాతీయ ఆదర్శ భావాలకు నిదర్శనాలు. సమాజంలోని విభాగాలే వర్ణ వ్యవస్థ. శ్రీ అరవిందుల అభిప్రాయంలో చాతుర్వర్ణాశ్రమ ధర్మాలు మానవుని జీవితానికి అత్యవసరం. “There is no national life perfect or sound without the caturvarnya”[23]. వర్ణ వ్యవస్థ లేనిదే మానవుని జీవితానికి సంపూర్ణత చేకూరదు. చతుర్విధ పురుషార్థాలు, వర్ణాశ్రమ ధర్మాలు, సమాజంలోని విభాగాలు, వృత్తుల విభాగాలను ఆధారంగా చేసుకొని వర్ణవ్యవస్థ ఏర్పడింది. శ్రీ అరవిందులు తన కవితల్లో ఆశ్రమ ధర్మాలను కూడ సూచించారు. ఆశ్రమ ధర్మాలు మానవునని జీవితంలో భిన్నావస్థలు . ఆయా వ్యవస్థలను అనుసరించి మానవుడు ఆదర్శప్రాయుడు కావడానికి ముందడుగు వేస్తాడు. ప్రాచీన భారతీయ చింతనలో ఈ అంశమే ప్రధానాంశంగా భావింపబడుతుంది. ప్రాచీన భారతీయ సంస్కృతిలో ఈ వర్ణ వ్యవస్థ సమర్థింపబడింది. వర్ణాశ్రమ ధర్మాల్లో మానవుని జీవితానికి సంబంధించిన నాలుగు అవస్థలను మనం గమనించవచ్చు. అవి

1. బ్రహ్మచర్యం - వేద విద్యాభ్యాస కాలం
2. గృహస్థాశ్రమం - యజ్ఞాలు నిర్వహించే కాలం
3. వానప్రస్థం - గృహస్థాశ్రమాన్ని అనుభవించిన తర్వాత వనవాసం
4. సన్యాసం - సర్వ సంఘ పరిత్యాగం

సాధారణ జీవితాన్ని గడుపుతున్న వ్యక్తి అసాధారణమయిన ప్రయత్నాలకు, ఒత్తిడికి చలించక ఉండాలన్నదే ఈ దశల వెనుకనున్న పరమార్థం. అందువల్ల భారతీయ చింతనలో వర్ణాశ్రమ ధర్మాలు, ఒక ప్రముఖ స్థానాన్ని పొందాయని చెప్పవచ్చు. మానవుడు తన జీవితంలో వర్ణాశ్రమ ధర్మాలను ఆధారంగా చేసుకొని అనుసరించడమే జీవిత పరమార్థమని భావించకూడదు. మానవుని ఉద్దేశాలు, ఆదర్శాలు ఇంతటితో ఆగిపోవు. మానవుడు తన జీవితంలో ఉన్నత ఆశయాలను, ఆదర్శాలను పెంపొందించుకోవాలి. అప్పుడే ధర్మార్థ కామ మోక్షాల సారాంశాన్ని గ్రహించిన వాడవుతాడు. ఇవి మానవుని పరిణామానికి తోడ్పడుతాయి.

శ్రీ అరవిందులు స్వదేశ, విదేశ రాజ్యాంగ పరిపాలనా విధానాలను, ప్రాచ్య పాశ్చాత్య విద్యా విధానాల వైవిధ్యాన్ని వివరించారు. వీరి అభిప్రాయంలో స్వదేశ పరిపాలన, జాతీయ విధానం పరస్పరం విడదీసేందుకు వీలు కాని భావాలు, విద్యా విధానంలో భారతదేశం తన స్వరూప స్వభావాదులను రూపు దిద్దుకోవాలి. అప్పుడే భారతదేశం స్వతంత్ర జీవితాన్ని గడపగలదు. ఈ సందర్భంలో శ్రీ అరవిందులు జాతీయ భావాన్ని పెంపొందింపజేయమన్నాడే గాని జాతీయ అహంకార మన్నది సామూహిక స్వార్థం వంటిది. దేశం తన సంప్రదాయ విధానానికి గర్విస్తే మెచ్చుకోతగ్గదే, కానీ ఆ గర్వం అధికమయితే హర్షించదగినది మాత్రం కాదు. ఇది అనేక జాతీయ పాక్షికాభిప్రాయాలకు దారి తీస్తుంది. శ్రీ అరవిందులు జాతీయ, అంతర్జాతీయ భావాలను బోధించేటప్పుడు సంకుచిత దేశభక్తిని సహించలేకపోయారు. విద్యా విధానంలో చేతి వృత్తులయిన చిత్రకళను, శిల్ప కళను ప్రోత్సహించారు. ఈ సందర్భంలో మనం శ్రీ అరవిందుల జాతీయ శిక్షా విధానాలను, రవీంద్రనాథ టాగూర్ శాంతినికేతన్ ఆదర్శాలను పోల్చి చూడవచ్చు. వీరిద్దరూ చేతి పరిశ్రమలను ప్రోత్సహించారు. టాగూరు కళాత్మకమయిన మానవ చైతన్యాన్ని, ఆధ్యాత్మిక శక్తిని బలపరిచారు. ఉన్నత పురుషార్థం వీరిరువురి పరమార్థం.

స్వాతంత్ర్య సమరోద్యమంలో శ్రీ అరవిందుల కృషి అందరికి తెలిసిందే. ఈ సమయంలో శ్రీ అరవిందులు నాయకుడుగా, రచయితగా ఆనాటి ప్రజలను ఎంత ప్రోత్సహించారో అన్న విషయం అందరికీ తెలిసిందే. స్వాతంత్ర్య సంపాదనకు పూర్వం శ్రీ అరవిందులు 'వందేమాతరం' పత్రికకు 'కర్మయోగిన్' అనే ఆంగ్ల పత్రికకు, 'ధర్మ' అనే బెంగాలీ వార పత్రికకు సంపాదకులుగా పని చేశారు. ఉన్నత జాతీయ భావాలున్న జాతీయ నాయకుడుగా వీరు దేశానికి చేసిన సేవ ప్రశంసనీయం. వీరు కొంత కాలం బెంగాల్ జాతీయ కళాశాలకు ప్రధానాధికారిగా నియమింపబడ్డారు. వీరిలోని జాతీయ భావాలు సమృద్ధిగా ఉండటం వలన ప్రస్తుతం పదవికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. స్వదేశీ ఉద్యమానికి శ్రీ అరవిందులు ప్రధాన నాయకుడని చెప్పవచ్చు. వీరిలోని జాతీయ భావాలకు 'ఇందుప్రకాశ్', 'యుగంధర్' అనే పత్రికలే నిదర్శనాలు. వీరు భారత పునరుజ్జీవనానికి, స్వాతంత్ర్యోద్యమానికి కంకణం కట్టుకున్నారు. హిందూస్థాన్‌స్టాండర్డ్(ఆగస్టు 14, 1938)లో 'జాతీయవాది' అనే పదం మితవాదులు ప్రయోగించిన నూతన పద ప్రయోగమని సూచించారు[24]. జాతీయ వాది అంటే దేశ రక్షణే తన లక్ష్యంగా భావించేవాడు, జాతిని ప్రోత్సహించేవాడు, దేశ ప్రగతికి కృషి చేసే వాడు అని అర్థం. శ్రీ అరవిందులు నూతన పద ప్రయోగానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల 19వ శతాబ్దిలోనే శ్రీ అరవిందులు బూర్జువాల ఆదర్శాలకు వ్యతిరేక భావాలున్నవారని చెప్పవచ్చు.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో కవులు దేశప్రగతి కోసం జాతీయ ఆదర్శాలను ఆధారంగా చేసికొని చాలా వరకు రచనలు కొనసాగించారని చెప్పవచ్చు. జాతీయతకు దేశం పునాది. జాతీయత ఒక ఉద్యమం నుండి ఉద్భవించింది. ఆ ఉద్యమం నిరంకుశత్వానికి, బానిసత్వానికి ఎదురు నిలిచి పోరాడింది. శ్రీ అరవిందుల

అభిప్రాయంలో జాతీయత మతం కాదు. అది జాతికి ఆత్మ వంటిది. ''జాతీయతకు దేశము పునాది...దేశమెప్పుడొక్కటియో, తల్లి ఒక్కతెయో, ఎప్పుడో ఒక నాదైక్యము కలుగనే కలుగును... సంప్రదాయములందలి భేదములు భాతృభావమునందును మాతృప్రేమ యందును లీనమైపోవును" [25]. శ్రీ అరవిందులు తమ కవిత్వంలోను, రచనల్లోను జాతీయ భావాలను స్పష్టంగా విశదీకరించారు.

వీరి భావాలు హిందీ, బెంగాలీ, తమిళం, కన్నడ, తెలుగు సాహిత్యాలను ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రభావితం చేశాయని చెప్పవచ్చు.

శ్రీ అరవిందుల జాతీయతను వ్యక్తపరిచే కవితలు: 1.Bankim Chandra Chatterji, 2. Baji Prabhu, 3. Madhusudhan Dutt, 4. The Dwarf Nepoleon, 5. The Iron Dictators

మానవ సంఘానికి సంబంధించిన ఒక శక్తివంతమయిన ఐక్యతా రూపమే 'జాతి'. జాతి భావమే జాతీయత. జాతీయత అనేది ఒక ఐక్యతా భావం. జాతీయ భావాలున్న కవులు మన తెలుగు సాహిత్యంలో అనేకులున్నారు. తెలుగు సాహిత్యాన్ని ఒక మారు పరిశీలిస్తే, మనకు విశిష్టమయిన ప్రత్యేకతలు గోచరిస్తాయి. భారత స్వాతంత్ర్యోద్యమ ప్రభావం అన్ని దేశ భాషల సారస్వతాల మీద స్పష్టంగా కనిపిస్తుంది. శ్రీ అరవిందులు, మహాత్మాగాంధీ వంటి నాయకులు తమ రచనల మూలంగా ప్రజలను ఉత్తేజ పరచి స్వాతంత్ర్య సమర రంగానికి, దేశ దాస్య విమోచనానికి వెన్నెముకగా నిలిచారు. జాతీయ భావ పూరితులయిన సాహితీ వేత్తలను స్వాతంత్ర్య సమరయోధులుగా పరిగణించడం మన విధి.

ఆధునిక సాహిత్యంలో 'వందేమాతరం' మహాకావ్యం. దీనిలో శ్రీ అరవిందులు భారతోద్యమానికి చేసిన కృషిని ముదిగొండ వీరభద్రమూర్తి స్పష్టంగా వివరించారు. స్వరాజ్య లక్ష్యసాధనకు స్వదేశ ఆత్మను పునరుజ్జీవింప చేసుకోవాలని భారతీయ సంస్కృతి వైపు జాతి దృష్టిని మళ్ళించిన ద్రష్ట శ్రీ అరవిందులు అని ఆయన తెలిపారు. అంతేకాక అరవిందులు భారతీయ సంస్కృతితో తాదాత్మ్యం పొంది భారతీయుడుగా జాతి ప్రతిష్టను ఇనుమడింపచేశారు. తత్త్వశాస్త్రం, సమాజం వేరు కావని, రెండూ ఒకటేనని ప్రభోదించారు. ఈ భావాన్నే ముదిగొండ వీరభద్రమూర్తి 'అరవింద ఖండము'లో వివరించారు.

"ఎవడు యోగాశ్రమమున నుండి భువిని పడెనొ
వాడ యితడరవిందుడై వఱలినాడు"[26]

'భవానీ మందిర ఖండము'లో దేశమాత శృంఖలాల విమోచనం కోసం అరవిందులు దేశ హితైక బోధనలను వివరించారు.

"భారతి భవాని భారతాంబ యన నొకరె
యాయమ శక్తి, ప్రకృతి రమ్యగిరి హృదయ
మందు నిర్మింపవలె నొక మందిరమ్ము" [27]

"ఈజగంబను చక్రము నెవరు త్రిప్పు
దురు? భవాని, యా యమ్మయదుర్గకాళి
సృష్టికర్త్రి, భ్రమణమ్మును దృష్టయామె
యొక్కొక్కప్పుడీ జగతి నొక్కొక్క కళగ" [28]

శ్రీ అరవిందులు దేశాన్ని భవానిగా, భారతాంబగా, శక్తిగా, సృష్టికర్త్రిగా పేర్కొన్నారు.

స్వాతంత్ర్యోద్యమానికి తెలుగు సాహిత్యంలో కొత్త బాటలు వేసిన వైతాళికుడు గురజాడ అప్పారావు. ఆవేశం ప్రధానం కాదు, కార్యాచరణ ప్రధానమని దేశభక్తి గేయంలో ఈ విధంగా వివరించారు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్న,
వట్టి మాటలు కట్టిపెట్టోయ్,
గట్టిమేల్ తలపెట్టవోయ్" దేశభక్తి

చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, గరిమెళ్ళ సత్యనారాయణ మొదలయిన వారు మనుష్యుల సమష్టిని, ఐక్యతను దృష్టిలో పెట్టుకుని రచనలు చేశారు. " శ్రీ అరవిందులు 'భవానీ మందిర్'లో అన్న మాటలు భారతీయుల మీద, నాయకుల మీద అమిత ప్రభావాన్ని వేశాయి. ఆయన "For what is a nation? What is our mother-country? It is not a piece of earth,…..' అని అన్నాడు. దేశాన్ని గురించి, జాతిని గురించి ఈ అవగాహనతోనే రచయితలు రచనలు చేశారు. రాయప్రోలు – ఇత్యాది కవులు మొత్తం దేశాన్ని జాతిని దృష్టిలో పెట్టుకొనే ఐక్యతా ప్రబోధం చేశారు"[29].

ఆధునిక తెలుగు సాహిత్యంలో రాయప్రోలు సుబ్బారావు తమ కవిత్వంలో జాతీయ భావాలను ప్రతిబింబింపజేశారు. శ్రీ అరవిందులు భారత దేశాన్ని మాతృదేవతగా భావించి, పూజించి, తల్లివలె గౌరవిస్తానని పలికారు. శ్రీ అరవిందులలోని ఈ భావనే మన తెలుగు సాహిత్యంలో రాయప్రోలు సుబ్బారావులో వ్యక్తమయింది. రాయప్రోలు సుబ్బారావు 'జన్మభూమి' గేయంలో భారత భూమిని తల్లిగా భావించి గౌరవించారు. జాతీయ కవిత్వానికి రాయప్రోలు వారి 'ఆంధ్రావళి'లోని 'జన్మభూమి' గేయంలో భారత భూమిని తల్లిగా భావించి గౌరవించారు. జాతీయ కవిత్వానికి రాయప్రోలు వారి 'ఆంధ్రావళి' లోని 'జన్మభూమి' గేయం శిరో భూషణం వంటిది.

" ఏదేశమేగినా, ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా, యెవ్వరేమనినా
పొగడరా, నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము" [30]

ఈ గేయంలో జాతీయాభిమానం పొంగి పొర్లింది. జాతి గౌరవాన్ని నిలపమన్నారు. జాతీయ భావం ప్రబోధ రూపంగా పరుగులెత్తింది.

" లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరులింకెందు
మన భూమి వంటి చల్లని భూమి లేదు"[31]

రాయప్రోలు సుబ్బారావు కవిత్వానికి దేశభక్తి ఒక విశిష్ట స్థానాన్ని కల్పించింది. కాల్పనిక కవుల ప్రభావం రాయప్రోలు వారిపై ఉంది. ఆధునిక తెలుగు కవులపై ఆంగ్ల కవుల ప్రభావం ఎంత అధికంగా ఉన్నా వారి జీవలక్షణం మాత్రం భారతీయమే. వారు అనుసరించే విధానం పాశ్చాత్యులదే అయినా విషయం దేశీయమే.

శ్రీ అరవిందులకు బెంగాలీ సాహిత్యంలో ప్రవేశముంది. రవీంద్రనాథ్ టాగూరు అంతటి మహాకవి శ్రీ అరవిందులను దర్శించి 'వేదవాణి' యని ప్రశంసించారు. రాయప్రోలు సుబ్బారావు శాంతినికేతన్‌లో రవీంద్రనాథటాగూర్ దగ్గర శిష్యత్వం నెరపడం వల్ల వీరి భావన కొత్త మెరుగులు దిద్దుకోవడమే కాక బెంగాలీ

కవిత్వ సౌరభాలు వీరి మనస్సులో నాటుకున్నాయని చెప్పవచ్చు. ఈ కారణంగా రాయప్రోలు సుబ్బారావుపై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో శ్రీ అరవిందుల ప్రభావం ఉందని చెప్పవచ్చు.

రాయప్రోలు సుబ్బారావుకు శ్రీ అరవిందుల గురించి అవగాహన ఉందని చెప్పవచ్చు. రాయప్రోలు సుబ్బారావు శ్రీ అరవిందులను గురించి 'మహాయోగి' అనే వ్యాసంలో ఈ విధంగా పేర్కొన్నారు. " అరవిందుడు ఒక అవతారము. సృష్టి యందు ఉన్న జీవకోటిలో మానవుడై పుట్టుట, పురుషుడగుట, పిదప వైదోక్తములయిన విధి నిషేధములెరిగిన నైష్ఠికుడగుట – ఈ మూడును ఒకదాని కంటెను ఒకటి ఉత్తమోత్తములు. నూఱుకోట్ల జన్మములలో చేసిన పుణ్యపరిపాకము చేత తప్ప ఇవి సంభవింపవంటాడు. ఇంకా మేథావి, విద్వాంసుడు, ఊహానూహావిచక్షణుడూ అయితే కానీ బ్రహ్మతత్త్వ విచారమునకు లక్షణములని చెప్పెను. మఱిన్ని, మోక్షమే పరమావధిగా నిర్ణయించెను[32].

శ్రీ అరవిందులు, రవీంద్రనాథ టాగూరు సమకాలీన కవులు. వీరిద్దరి రచనల్లో భారత పునరుజ్జీవన భావాలు, విద్య జాతీయ విద్యగా రూపొందాలనే భావాలు వ్యక్తమవుతాయి. వీరి భావాల్లో, తత్త్వంలో మనకి అడుగడుగునా భావసామ్యం కనిపిస్తుంది. ఈ సందర్భంలో శ్రీ అరవిందుల ప్రభావం రవీంద్రనాథ టాగూరు మీద పడిందంటే ఆశ్చర్యపోవడం సహజం. శ్రీ అరవిందుల మహాయోగి లక్షణాలను రవీంద్రనాథ టాగూర్ ఆరాధించాడు. ఆధ్యాత్మిక చింతనకి సంబంధించిన విషయాలను శ్రీ అరవిందులతో సంప్రదించేవారు టాగూరు. అరవిందుల పట్ల వారికున్న గౌరవాన్ని ఈ విధంగా వ్యక్తపరిచారు. " We have the word and we are waiting to accept it from you . India will speak through your voice to the world"[33].

'రవీంద్రనాథ టాగూరు సామాన్య కవి కాదు. ఋషి కవిగా పేరు పొందాలన్నదే వారి ధ్యేయమని' శ్రీ అరవిందులు 'కర్మయోగిన్' అనే పత్రిక (14-08-1909)లో వివరించారు. శ్రీ అరవిందులు, రవీంద్రనాథ టాగూరు బెంగాలీ కవులుగా బెంగాలీ సాహిత్యాన్ని ప్రభావితం చేశారు. వీరు తమ జాతీయ భావాలతో సామాన్య మానవులను ఉత్తేజపరచారు. శ్రీ అరవిందుల కవిత్వం అంతగా ప్రజాదరణ పొందకపోవడానికి కారణం వీరి కవిత్వం మార్మిక, అధిభౌతిక, అతి మానసిక భావాలతో కూడి ఉండడమే. వీరి తొలి రచనలు బెంగాలీ సాహిత్యాన్ని మాత్రమే కాక కన్నడ, తెలుగు సాహిత్యాలను కూడ ప్రభావితం చేశాయి. స్వదేశ, జాతీయ ఆదర్శాలకు ప్రతీకగా నిలిచిన శ్రీ అరవిందులు, రవీంద్రనాథ టాగూరు తమ ప్రబోధ కవితల మూలంగా వారి కాలం నాటి సాహిత్యంలో చరిత్రను సృష్టించారు.

## 5.3 సామాజిక భావం :

సామాజిక తాత్త్విక చింతన శ్రీ అరవిందుల రచనల్లో వ్యక్తమవుతాయి. శ్రీ అరవిందుల ఉద్దేశంలో వ్యక్తికి సమాజానికి మధ్య సన్నిహిత సంబంధముంది. సామాజిక చింతనలో సర్వ సాధారణంగా వ్యక్తికి, సమాజానికి మధ్యనున్న సంబంధాన్ని మూడు విధాలుగా పేర్కొన్నారు. మొదటిస్థానంలో ఈ రెండింటికి గల సంబంధం అంగాంగి సంబంధంగా పేర్కొనబడింది. అంగం,శరీరం ఈ రెండింటినీ ఏ విధంగా విడదీయలేమో అదే విధంగా సమాజాన్ని సామాజికుణ్ణి విడదీయలేం.సమాజం శరీరమయితే సామాజికుడు దాని అంగం వంటి వాడు. సమాజానికి ప్రాణం పోసేవాడు. రెండవ దశలో వీటి అస్థిత్వాన్ని గమనించవచ్చు. సమాజం సామాజికుని మీద, సామాజికుడు సమాజం మీద పరస్పరం ఆధారపడి ఉంటారు. దీన్నే పరస్పరాధార సిద్ధాంతమని పేర్కొన్నారు. మూడవ దశలో

వ్యక్తి సమాజంలో ఉండడం, వ్యక్తిలో సామాజిక వ్యవస్థ ప్రతిబింబించడం– ఇవి ఒక దానిలో ఒకటి అంతర్గతమయి ఉన్నాయి. ఈ మూడవ సిద్ధాంతమే శ్రీ అరవిందుల సామాజిక తాత్త్విక సిద్ధాంతానికి దగ్గరగా ఉంది. కొన్ని సమయాల్లో ఈ సిద్ధాంతాన్నే విశ్వాత్మ సిద్ధాంతంగా పేర్కొన్నారు. శ్రీ అరవిందుల దృష్టిలో సమాజానికి, సామాజికుడికి ఉన్న సంబంధం మానవుడికి ప్రపంచానికున్న సంబంధం వంటిది. వీరి అభిప్రాయంలో మానవుడు పవిత్రుడు, సమాజం దివ్య సమాజంగా రూపొందుతుంది. సామాజికుడు దివ్యాత్మకు ప్రత్యక్ష సాక్షి. సమాజం సామూహిక జీవశక్తికి నిదర్శనం[34].

జర్మనీ దేశస్థుడైన హెగెల్ తన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతంలో మానవుడు, సమాజం,దాని స్థితిగతులు, కళ, తత్త్వశాస్త్రం, ఇవన్నీ ఆత్మపరమైన ప్రదర్శనలని విశ్వసించారు. సమాజాన్ని జీవ పదార్థంగా భావించారు. సామాజిక భావనలో శ్రీ అరవిందులు సమాజానికి వ్యక్తిలాగే ఆకృతి, ప్రాణం, సౌందర్య భావాలుంటాయని వ్యక్తపరిచారు. సమాజానికి, సామాజికునికి మధ్య నున్న సంబంధాన్ని గురించి రెండు విధాలయిన వ్యాఖ్యానాలున్నాయి. మొదటిది సామాజికుని కన్న సమాజానికి అధిక ప్రాధాన్యమిచ్చేది. రెండవది సమాజం కన్నా వ్యక్తికే ప్రాధాన్యమిచ్చేది. వ్యక్తి లేనిదే సమాజ కట్టుకథ. శ్రీ అరవిందుల దృష్టిలో సమాజం సామాజికుని మీద ఆధార పడి ఉంటుంది. వ్యక్తి మానసికంగా ఎదిగినప్పుడే అంతరంగ ప్రగతి, క్రమవికాసాలు సాధ్యమవుతాయి. వీరు సామాజిక పరిణామ మొదటి దశలో భౌతిక, ప్రాణ చైతన్య ప్రగతికి ప్రాధాన్యం ఇచ్చారు. ఇదే మానవుని నాగరికతలో దివ్య విచక్షణా స్థాయి. రెండవ దశలో మానసిక చైతన్యం, దాని పురోభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. సామాజిక పరిణామ మూడవ దశలో ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రాధాన్యమిచ్చారు. ఇదే మానవుని నాగరికతలో దివ్య విచక్షణా స్థాయి. శ్రీ అరవిందులు మానవ ప్రగతికి మూడు స్థితులున్నాయని పేర్కొన్నారు[35]. శ్రీ అరవిందులు నాగరికతాభివృద్ధికి అంతం లేదన్నారు. సామూహిక ఆకాంక్ష ఉన్నప్పుడే సామాజిక పరిణామానికి అవకాశముందని వీరి అభిప్రాయం. శ్రీ అరవిందులు భవిష్యకవితలో నూతన దివ్య మానవ జాతిని ఊహించుకుని మురిసిపోయారు. నూతన మానవ జాతే దివ్య మానవ జాతి. ఇది ప్రస్తుత మానవుని ఆశయమే కాక భవిష్య సిద్ధి కూడ. శక్తిమంతమయిన ఐక్యతా రూపమే మానవ సంఘం. ఈ సామాజిక సమస్యలు కవిత్వం పుట్టినప్పటి నుండి, సమాజం పుట్టినప్పటి నుండి వస్తున్నవే. వేదకాలం నుండి మనిషి ఈ సమస్యలను గురించి కవి–త్వం వ్రాస్తూనే ఉన్నాడు. వేదకాలం నాటి సామాజిక సమస్యలకీ ఈనాటి సమస్యలకీ వ్యత్యాసం లేకపోలేదు. ప్రకృతిని చూసి పరవశుడయిపోయేవాడు వైదిక కవి. మరి ఈనాటి కవి రెచ్చకొట్టే కవిత్వాలు రచించి మరో ప్రపంచం వస్తుంది, అన్యాయాలు తొలగిపోతాయి. మీరంతా పదండి ముందుకు అని ఉద్బోధిస్తున్నాడు[36]. కవి సంఘంలోని వాడే కనుక అతని వ్యక్తిత్వం, ఆలోచన ఎంత స్వతంత్రించినా సాంఘికమయినవే. ఆయా దేశకాల పరిస్థితుల ప్రభావం కవి మీద ఉండి తీరుతుంది. కళాకారుడు ఆకస్మికంగా ఆకాశం నుండి ఊడిపడడు. అతడు నిర్దిష్టమైన ఒక సంఘంలో, ఒక దేశంలో, ఒక కాలంలో పుట్టినవాడే. కాబట్టి సంఘదేశ కాలాల ప్రభావం అతనిమీద ఉంటుంది. ఆ ప్రభావాలు అతని రచనల్లోనూ, కావ్యాల్లోనూ ప్రతిబింబిస్తాయి. ఒక చోట స్పష్టంగా మరొక చోట అస్పష్టంగా; ఇంకొక చోట ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉండవచ్చు.

తెలుగు సాహిత్యంలో సామాజిక సమస్యలను ప్రతిఫలింపజేసి, సాహిత్యానికి కొత్త బాటలు వేసి మార్గదర్శి అయిన వైతాళికుడు గురజాడ అప్పారావు. వీరి 'కన్యాశుల్కం' ఆనాటి సమాజంలోని వరకట్న బాధని, వేశ్యల సమస్యలను విశ్లేషించింది. కందుకూరి వీరేశలింగం తమ కలాన్ని ఝళిపించిన మహాపురుషులు. తమ రచనల్లో

ఆనాటి సామాజిక సమస్యలయిన లంచగొండితనాన్ని బట్టబయలు చేయడం, స్త్రీ విద్య, వితంతు వివాహాలను విశ్లేషించి సమాజంలో గొప్ప సంచలనాన్ని కలిగించారు. ప్రాచీనాంధ్ర కవిత్వంలో తన చుట్టు జరిగే విషయాలను సూటిగా ఎత్తి చూపి, సాంఘిక దురాచారాలను అధిక్షేపించి ఆధునిక కవులకి మార్గదర్శి అయ్యాడు. సంఘ సంస్కరణార్థమ-యి కవిత్వాన్ని ప్రయోగించిన మహాకవి వేమన.

స్వాతంత్ర్యానంతర కవులలో శ్రీశ్రీ, జాషువ, దాశరథి, కాళోజీ, కుందుర్తి, బాపురెడ్డి, బోయి భీమన్న మొదలయిన వారు సామాజిక సమస్యలను తమ రచనల్లో ప్రతిబింబింప జేశారు. మార్క్సిజం ప్రభావంలో నగ్నముని, చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్ మొదలయిన కవులు కూడా సమాజంలోని సమస్యల్నే ఇతివృత్తంగా తీసుకున్నారు. ఈ అభ్యుదయ కవిత్వం ప్రజలను ఉద్రేకపూరితులను చేసి పదండి ముందుకు, పోరాడుదాం అని విప్లవ నినాదాలను ఘోషిస్తుంది. ప్రస్తుత సామాజిక సమస్యలకు పరిష్కార మార్గాన్ని సూచిస్తుందని భావించవచ్చు. సామాజిక భావనను నాలుగు విధాలుగా విభజించవచ్చు. అవి – 1. సామాజిక వాస్తవికత, 2. సామాజిక ఆదర్శం. 3. సామాజిక విమర్శ, 4. సమగ్ర సమాజం

సమాజంలోని సమస్యలను, సమాజ పరిస్థితులను ఉన్నదున్నట్లుగా వర్ణిస్తే అది సామాజిక వాస్తవికత. సమాజం ఏ విధంగా ఉండాలని కవిత్వంలో విశ్లేషించి, సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గాన్ని సూచిస్తే అది సామాజిక ఆదర్శాత్మక కవిత అవుతుంది. సమాజంలోని లోటుపాట్లను పేద ధనిక వర్గాల మధ్య ఉన్న భేదాన్ని ఎత్తి చూపితే అది సామాజిక విమర్శ అవుతుంది. సమాజంలోని అన్ని సమస్యలను వివరిస్తే అది సమగ్ర సామాజిక భావన అవుతుంది. అంటే సమాజంలోని విద్యా విధానం, సమాజ చైతన్యం, ఆధునికత, తత్త్వం, శాస్త్రం ఇవన్నీ సమగ్ర సామాజిక భావనలుగా పరిగణింపబడుతాయి. ఈ భావనలన్నీ శ్రీ అరవిందుల రచనల్లో స్పష్టంగా వ్యక్తమవుతాయి.

శ్రీ అరవిందులు సమాజంలో శ్రామిక ధనిక వర్గమనే భేదం లేని వర్గరహిత సమ సమాజాన్ని ఆశించారు. వ్యక్తిగతంగా మానవుడు ఎదిగినపుడే సమాజంలో సామూహిక చైతన్యం కలుగుతుందని విశ్వసించారు. సమాజంలో 'సోషలిజం' ఏర్పడినపుడే సమాజం అభివృద్ధి చెందుతుంది, అన్నింటినీ మించి సమష్టి దృష్టితో శ్రమించినపుడే ప్రగతి శీలత ఆవిర్భవిస్తుంది[37]. ఈ భావమే దాశరథి కవితలో వ్యక్తమవుతుంది.

" రానున్నది యేది నిజం ?
అది ఒకటే, సోషలిజం
కలపండోయ్ భుజం భుజం
కదలండోయ్ గజం గజం" [38] (రానున్నది)

పై కవిత సమాజంలో రాబోయే సమసమాజాన్ని సూచిస్తుంది. సోషలిజం సమాజంలో సమైక్యతను పెంపొందిస్తుందని ఈ కవితాదర్శం. కాబట్టి దాశరథి 'రానున్నది' అనే కవిత పసామాజిక ఆదర్శానికి ప్రతిరూపమని భావించవచ్చు. శ్రీ అరవిందులు తమ రచనల్లో ఈ భావాన్నే పరివర్తన వ్యక్తుల్లో కలగాలని అప్పుడే సమాజం పరిణామానికి దారి తీస్తుందని వివరించారు. ఈ సందర్భంలో వీరు వర్గ రహిత సమసమాజం ఏర్పడటం అసంభవమని, వ్యక్తి మానసికంగా ఎదిగినపుడే అతనిలో భేద భావం తొలగిపోతుందని తెలిపారు. సమాజంలో పేద ధనిక వర్గ ఘర్షణ అనాదిగా జరుగుతున్నదే. శ్రీ అరవిందుల అభిప్రాయంలో ఈ వర్గ సంఘర్షణ కేవలం మానసికమైనది. వర్గ సంఘర్షణ లేకుండా శ్రామిక ధనిక వర్గాల మధ్య అవగాహన

ఏర్పడినపుడు భేద భావం తుడిచివేయబడుతుంది. సామూహికంగా సమష్టి భావంతో పనిచేసి తమ వంతు భాగాన్ని అనుభవించాలి. ప్రేమతోను, సమష్టి దృష్టితోను, సమైక్య భావంతోను పనిచేసి వృద్ధిలోకి రావాలన్నదే శ్రీ అరవిందుల అభిప్రాయం[39].

ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవితా సాంప్రదాయాలన్ని అనుసరించి కవిత్వం రాసిన వారిలో శ్రీ దాశరథి ప్రముఖులు. వీరి కవితల్లో వ్యక్తమవుతున్న సామాజిక భావాలకు, శ్రీ అరవిందుల రచనల్లోని సామాజిక భావాలకు పోలికలున్నాయని చెప్పవచ్చు

'కత్తిపట్టి గెలిచినట్టి
ఘనుడగు వీరుండెవ్వడు
మెత్తని హృదయం దాడికి
తుత్తునియలు కానిదెవ్వడు ?
అజ్ఞానపు అడుసు కరిగి
అసలువిషయ మెరుంగిడి
ఘర్షణలో ఏనాటికి
హర్షం లభియింపబోదు' [40]

ఈ కవిత్వం సమగ్ర సమాజ తత్త్వాన్ని బోధిస్తుంది. భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు సమ ప్రాధాన్యమిచ్చింది. హింసా అహింసలను విశ్లేషించింది. అహింసా మార్గానికి లొంగని వాడెవడని, ప్రేమ, స్నేహం గొప్పదని, ఘర్షణలో ఏనాటికి హర్షం లభించదని వివరింపబడింది. ఇది సమగ్ర సామాజిక భావనకి సంబంధించిన కవిత. ఆగర్భ శ్రీనాథునికి, అనాథునికి మధ్య జరిగే నేటి సమాజిక సమస్యలను దాశరథి తమ కవిత్వంలో కవితా వస్తువుగా ఎంచుకున్నారు.

"మధనపడే మేధావులు
శాస్త్రజ్ఞులు, విద్యాంసులు
కనిపెట్టిన అణుశక్తికి
ప్రభుత్వాల కంట్రోళ్ళు"[40]
" షావుకారు వడ్డీలకు
జమిందార్ల హింసలకు
వేగలేక ఆగలేక
తిరగబడితే "అతివాదం"[41] (అనంత సంగ్రామం)

ఈ కవితలో పేద, ధనిక వర్గాల మధ్య జరిగే సంగ్రామం వర్ణింపబడింది. ఇది సామాజిక విమర్శకు చెందిన కవిత.

"కవి మాటకు విలువ హెచ్చి
కలహం మాట నశిస్తుంది

రూపాయికి విలవ లేని
రోజు రేపు వస్తుంది" [42] (రేపు)

రేపటి సమాజం ఏ విధంగా రూపొందనున్నదో దాశరథి తమ కవితలో వివరించారు. మనిషికి, కవికి విలువ పెరుగుతుందని, కలహం నశిస్తుందని, డబ్బుకు విలువిచ్చే రోజులు అంతమవుతాయని అభిప్రాయపడ్డారు.

శ్రీ అరవిందులు నూతన సమాజాన్ని దర్శించారు. భవిష్య సమాజంలో మానవుడు పరిణామం చెంది, దివ్య మానవుడుగా రూపొందాలని ఆశిస్తాడు. ఇటువంటి సమాజం ఏర్పడాలంటే మానవులు వ్యక్తిగతంగా ముందుకు రావడమే కాకుండా వారి మనస్సులు వికసించి చైతన్యవంతం కావాలి. అప్పుడే సమ సమాజం ఏర్పడుతుంది.

శ్రీశ్రీ సమాజంలో ప్రజలు పొందవలసిన పరిణామాన్ని వివరించారు. నిన్న నేడు ఒక వర్గంవారు ఇంకొక వర్గాన్ని పీడించి అణచారు. కనీసం రేపయినా సమ సమాజం ఏర్పరుచు కుందామనే భావనను వ్యక్తపరచారు. ఇది సామాజిక ఆదర్శ కవిత అని చెప్పవచ్చు. రేపటి సమాజాన్ని ఆశించే శ్రీశ్రీలో, శ్రీఅరవిందుల్లో భావసామ్యం ఉందని చెప్పవచ్చు.

"నిన్నటి మన స్వరూపం స్మరించి
నేటి మన స్వభావం గ్రహించి
రేపటి మన సమాజం కోసం కలిసి
మెలసి శ్రమించుదాం! " [43] ( ఒకటి – పది )

ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవిత్వానికి శ్రీకారం చుట్టినవాడు శ్రీశ్రీ. భావకవిత్వపు పోకడలు వీరి కవిత్వంలో స్పష్టమవుతాయి. వీరి కవిత్వంలో సామాజిక సమస్యలే ఇతివృత్తంగా స్వీకరింపబడ్డాయి. శ్రామిక వర్గజాతి ప్రజల శ్రమకు గుర్తింపు కలుగకపోవడం, ధనిక వర్గ ప్రజల నిరంకుశత్వం స్ఫురిస్తుంది.

" నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవనమెట్టిది ?
తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు ?"[44] (దేశ చరిత్రలు)

తాజ్‌మహల్‌ను చూడగానే షాజహాన్ గుర్తుకొస్తాడు, కానీ దాని నిర్మాణానికి శ్రమించిన కూలీలు గుర్తుకు రారు. సామాన్యుడికి సమాజంలో సమ ప్రాధాన్యం అభించినప్పుడే నాగరికత ప్రగతి పథంవైపు పరుగుతీస్తుంది. ఈ భావాన్నే శ్రీ అరవిందులు ఈ విధంగా తెలిపారు. " No thyself next as a worker. Understand nature to be worker"[45].

పేద ప్రజలు పిడికెడు మెతుకుల కోసం పడే శ్రమను నేడు మన సమాజంలో చూస్తున్న వాస్తవిక సమస్య, శ్రామిక వర్గ ప్రజలకు ధనిక వర్గం న్యాయం చేకూర్చదు. పైకి వచ్చే అవకాశాన్ని అంతకన్నా కల్పించదు. ఈ భావాల్నే శ్రీశ్రీ 'పేదలు' అనే కవితలో వర్ణించారు.

" అంతేలే, పేదల గుండెలు !

ఆశ్రువులే నిండిన కుండలు
శ్మశానమున శశికాంతులతో
చలిబారిన వెలిరాబండలు"                    (పేదలు)

" అంతేలే, పేదల బ్రతుకులు !
తిరిపెమునకు పిడికెడు మెతుకులు
తెరువెరుగని దీర్ఘరాత్రిలో
తల పగిలెడి తలపుల గతుకులు                (పేదలు)

ఈ భావాలే ఆంగ్ల రచయిత జాన్ రస్కిన్ రచన 'రూట్స్ ఆఫ్ హానర్' లోను, టాల్‌స్టాయ్ రచన 'కింగ్‌డమ్ ఆఫ్ హెవెన్ అపాన్ ఎర్త్'లోను, మహాత్మాగాంధీ రచన 'సర్వోదయ' లోన, శ్రీ అరవిందుల ఫ్యూచర్ సొసైటీ[46] లోనూ గమనించవచ్చు. శ్రీ అరవిందులు సమగ్ర సమాజ భావాల్ని 'హ్యూమన్‌సైకిల్' అనే గ్రంథంలో విపులంగా వివరించారు. దీనిలోని భావాలు సమకాలీన సామాజిక శాస్త్రజ్ఞులను, భిన్న భాషల సాహితీవేత్తలను ప్రభావితం చేసిందని చెప్పవచ్చు. శ్రీ అరవిందుల సామాజిక భావాలకు, తెలుగు సాహిత్యంలో సామాజిక సమస్యలకు రేపటి సమాజం కోసం ఎదురు చూసే ఆదర్శవాదులైన దాశరథి, శ్రీశ్రీ భావాలకు సామ్యముందని చెప్పవచ్చు.

శ్రీ అరవిందులు రచించిన బెంగాలీ గేయం శ్రీశ్రీ 'జగన్నాథుని రథచక్రాలు' రచనకు స్ఫూర్తిదాయకమైంది. శ్రీ అరవిందులు ఈ గేయంలో జగన్నాథుని రథచక్రాలు సమాజ నిర్మాణానికి నాలుగు ధర్మాలని, చక్రాల సమ భావం వ్యక్తులలో సమతా భావంగా నిలవాలని ఆ భావంపై నిలిచిన రథమే సమాజమని వర్ణించారు. ఈ భావాన్నే శ్రీశ్రీ జగన్నాథ రథచక్రాలు లో గమనించవచ్చు.

శ్రీ అరవిందుల దృష్టిలో సమగ్ర సమాజమంటే దివ్యమయిన భవిష్య సమాజం. సమాజం ప్రగతిశీల పథం వైపు సాగాలంటే సమాజంలోని వ్యక్తులు పరిపూర్ణ మానవులుగా పరిణమించాలి. దోష రహిత సమాజాన్ని మానవుడు నిర్మించలేడు. ఆదర్శవంతుడైన మానవుని ప్రగతి పథానికి మూల పురుషునిగా గుర్తిస్తుంది. మానవుడు మానవతను, ఆధ్యాత్మికతను పెంపొందింపజేసుకున్న-ప్పుడే పరిపూర్ణ మానవుడుగా రూపొందుతాడు. కళ, కళాతత్త్వం సౌందర్యావబోధ మానవునికి ఆ ధ్యాత్మికతను ప్రసాదిస్తాయి. యోగ సాధన, ధ్యాన మార్గం మానవుని జీవితానికి అత్యవసరమయినవి. వ్యక్తిగత పరిణామం, సమాజ ప్రగతి, సామూహిక అవగాహన వల్ల ఆదర్శమయిన సమాజం ఏర్పడటానికి అవకాశముంది. దివ్య సమాజం అహంకారంతో కూడినది కాదు. అది ఆధ్యాత్మిక భావం గల సమాజం. మానవ సమైక్యతే శ్రీ అరవిందుల ఆదర్శం. సమాజ పురోభివృద్ధికి, మానవుల చైతన్య వికాసానికి సమాజం పాటుపడాలి.

"There should be somewhere upon the earth a place that no nation could claim as its sole property, a place where all human beings of goodwill, sincere in their aspiration could live freely as citizen of the world obeying one single authority that of the supreme truth"[47].

## 5.4. భక్తిభావం :

శ్రీ అరవిందుల రచనల్లో భక్తిభావం వ్యక్తమవుతుంది. వీరి సమగ్ర తత్త్వశాస్త్రంలోను, భవిష్య కవితలోను భక్తిభావమే ప్రతిబింబిస్తుంది. దైవమే సర్వస్వమని గుర్తించినపుడు అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని శ్రీ అరవిందుల భావం. భారతీయ చింతనలో భగవంతుడు వ్యక్తిగతమయిన, విశ్వజనీనమయిన దివ్య స్వరూపుడు. భగవంతునికి విశ్వాత్మ ఉంది. అతడు సర్వాంతర్యామి. మనలోని ఆత్మే భగవంతుడు. దీని మూలంగా అవిద్య నుండి విజ్ఞానవంతులయ్యే అవకాశముంది. భగవంతుని దివ్య స్వరూపాన్ని మనలో నిలపుకునే ఉన్నతస్థితి కోసం మనం చైతన్యవంతులం కావాలి.

శ్రీ అరవిందుల కవిత్వంలో భగవంతుడు విశ్వానికి సంబంధించిన వాస్తవికత అని వ్యక్తమవుతుంది. వేదాల్లో పేర్కొన్న విధంగా మిగిలిన దేవతా స్వరూపాలు ఈ దేవుని ప్రతిరూపాలనే భావాన్ని శ్రీ అరవిందులు కూడ దృఢపరిచారు. వేదోపనిషత్తుల్లో బృహస్పతియే జ్ఞానం, విష్ణువే విశ్వ చైతన్యం, వాయువే ప్రాణం, వరుణుడే అనంతం, ఆర్యమానవుడే శక్తి[48]. ఇవే కాకుండా మిగిలిన శక్తుల ప్రాధాన్యాన్ని కూడ వివరించారు. విఘ్నేశ్వరుడు విఘ్నాలను తొలగించే శక్తి కలవాడు. కార్తికేయుడు విజయానికి ప్రతీక. ప్రతి దేవునికి సాంకేతిక ప్రాధాన్యం ఉంది. ఈ బహుముఖ శక్తులన్నీ భిన్న రూపాలు కావు. ఇవన్నీ భగవంతుని ప్రతిరూపాలే. ఇవన్నీ దివ్య రహస్యాలను అవగాహన చేసుకోవడానికి తోడ్పడుతాయి. "Veda prayer', Parabramha', 'God', 'God's Labour', 'The Mother of God', 'The Divine Hearing', The Indwelling Universal', 'The Cosmic Dance', 'Cosmic Consciousness', 'The Bliss of Bramhan', 'Nirvana' and 'Rose of God' మొదలైన కవితల్లో శ్రీ అరవిందుని భక్తి భావం వ్యక్తమవుతుంది.

బ్రహ్మయే విశ్వసృష్టికి మూలపురుషుడు. శ్రీ అరవిందుల దృష్టిలో విగ్రహారాధన, దేవతారాధనలు తప్పుకావు. దీని మూలంగా మానవుడు ప్రగతిని సాధిస్తాడు. భక్తి, సమర్పణల మూలంగా మానవుని చైతన్యం నిమ్నస్థాయి నుండి ఉన్నత స్థాయికి చేరుకుంటుంది. సామాన్యంగా ఈ భావమే మానవుని జీవితంలో విగ్రహారాధన వల్ల పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల వ్యక్తమవుతుంది. శ్రీ అరవిందుల రచనలలో మనం యోగ సాధనలను, దేవుని ఉనికిని, ఆయన దృక్పథాన్ని విశ్లేషించవచ్చు. యోగమార్గం దేవుని సిద్ధిని పొందేమార్గం, దేవుని సిద్ధిని పొందడానికి మాత్రమే దేవుని ప్రార్థించాలి. దేవుని సిద్ధిని పొందాలనుకొనేవాడికి కోరికలుండకూడదు. దేవుడిని కోరికలు నెరవేర్చ మని కోరడం హర్షించదగిన విషయం కాదు. ఇదే సందర్భంలో మానవులు దేవుడ్ని ఏదీ కోరరాదన్న విషయం కూడ అంత సమంజసమయింది కాదు. సాధకుడు ఆధ్యాత్మిక జీవనాన్ని గడిపేందుకు ఆరోగ్యాన్ని ప్రసాదించమని కోరవచ్చు. దేవుని సిద్ధిని పొందాలన్నవారికి ఆరోగ్యం ప్రాథమిక అవసరం.

శ్రీ అరవిందుల భక్తి పూరిత రచనలు కేవలం వారి అనుచరులను మాత్రమే కాక, రచయితలను కవులను కూడ ప్రభావితం చేశాయి. ముఖ్యంగా దక్షిణ భారత సాహిత్యాలను ప్రభావితం చేశాయని చెప్పవచ్చు. భగవంతుడు అనంత స్వరూపుడు. వేదోపనిషత్తుల అనుసారం భగవంతుడు, ప్రతి వ్యక్తి ఆత్మలోను ఉన్నాడు. వేదాంతంలో ఈశ్వరుని దివ్య మూర్తిగా, బ్రహ్మని దివ్య సత్యంగాను, కొన్ని సమయాల్లో దివ్య పురుషునిగా వ్యాఖ్యానించారు. శ్రీ అరవిందులు భక్తి భావాన్ని చైతన్యంగా, శక్తిగా, సిద్ధిసారంగా వివరించారు. భగవద్గీతలో భగవంతుని సూర్య చంద్రుల కాంతిగా, మానవుల్లోని మానవత్వంగా, విజ్ఞానుల్లో జ్ఞానంగా, బలవంతులలో బలంగా, శక్తిమంతుల్లో శక్తిగా, విరాగుల్లో వైరాగ్యంగా వివరింపబడింది. భగవద్గీతలో దేవునికి మూడు శక్తులున్నాయి.

అవి– పరమ పురుషోత్తం, విశ్వాత్మ, అనేకాత్మ. ఆధ్మాత్మిక ప్రకృతిని పరాకృతి అంటారు. ఇదే పురుషోత్తముని ప్రకృతి. దేవునికి రెండు స్థితులున్నాయి. అవి–స్థిరత్వం గల స్థితి, క్రియాశీలతగల స్థితి. స్థిరత్వం గల స్థితిని నివృత్తియని, క్రియా శీలత గల స్థితిని ప్రవృత్తియని అంటారు.

శ్రీ అరవిందుల్లో దైవభావన మిగిలిన భావాలకన్న ఉన్నతమయినదని చెప్పవచ్చు. సమకాలీన కవులు శ్రీ అరవిందుల భావాలను తమ రచనల్లో ప్రతిబింబింపజేశారు. విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, వేదుల సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, తల్లా వఝుల శివశంకర శాస్త్రి, నోరి నరసింహశాస్త్రి, కోవెల సుప్రసన్నాచార్య, వేదుల సత్యనారాయణ, జంధ్యాల పాపయ్య శాస్త్రి మొదలయిన ఆధునిక తెలుగు కవుల కవితల్లో శ్రీ అరవిందుల తాత్త్విక చింతనా ప్రభావం ప్రత్యక్షంగా ఉంది. శివశంకర శాస్త్రి 'ఆనందమా' అనే కవితలో శ్రీ అరవిందులను, శ్రీ మాతను, వారి పరిణామ చైతన్యాన్ని, జ్ఞానాన్ని, శక్తిని, పరమాత్మ స్వరూపదర్శనాన్ని, సాంకేతికంగా వివరించారు.

" తరువు మూలము చుట్టునున్న
వితర్దిపై నుపవిష్టయై,
తరుణి యెవ్వతె యోరమోమయి,
దవ్వు జూపుల దిక్కులం
బరపుచున్న విధాన దోచును
బైరగడ్డమువాడు
చ్చరణ సన్నిధి నెవ్వడాతడు"
"ఆగవే, పోవకే! ఆ జగత్పూజితన్
యోగినిం జూడగా యుక్తకాలమ్ములో"[49]

దూరదృష్టి, దివ్యదృష్టి గల తరుణి శ్రీమాతగా, బైరగడ్డం గల యోగి శ్రీ అరవిందులుగా వ్యక్తవమవుతారు. వీరిని దర్శించేందుకు జనం మూగుచున్నది. ఎందుకని కవి ఆశ్చర్యాన్ని వ్యక్త పరిచారు. ఆ యోగిని దర్శించేందుకు తాను కూడా కుతూహల పడుతున్నట్లు తెలుస్తున్నది. ఈ కవితలో కవి యోగిని దర్శిచేందుకు తనకున్న భక్తి భావాన్ని ప్రదర్శిస్తున్నాడు. "Sri Aurobindo on Himself" లో శ్రీ అరవిందులు తన గురించి ఈ విధంగా చెప్పుకున్నారు. "Neither you nor any one else knows anything at all of my life; It has not been on the surface for men to see"[50]. శ్రీ అరవిందుల జీవితం అంతర్ముఖమైనది. కొద్దిమంది మాత్రమే వ్యక్తుల ప్రాధాన్యాన్ని గుర్తించగలరు. ఈ భూమి మీద ఇటువంటి వ్యక్తులు పుట్టడంలో గల ఆంతర్యాన్ని తెలుసుకోవాలనే ఆకాంక్ష కలిగినపుడే వారి ప్రాధాన్యానికి గుర్తింపు కలుగుతుంది. ఈ తపనే శివశంకరశాస్త్రి కవితలో వ్యక్తమయింది. అయితే నోరి నరసింహశాస్త్రి 'దివ్యానుభూతి'లో భక్తిభావం వ్యక్తమవుతుంది.

" నిను నే గన్నుల జూడజాలమికి చింతింపన్ రవంతేని, నా
కనయంబున్ భవదీయ మోహన మనోజ్ఞాకార ముల్లంబునన్
ఘనశంపాలతికా ప్రభావిశద రేఖాపాళి రూపొంది శో
భవ దివ్యోజ్జ్వల రాగ రంజిత కలా ప్రౌఢిన్ విరాజిల్లున్"
" నీ పల్కుల్ విననోచ నేరమికి చింతింపన్, శ్రవోవీధిలో

రేపున్ మాపు సమస్త వేళల గడున్ హృద్యంబులై నీ ప్రియా”[51].

కవితానూహించిన దివ్యానుభూతిని పై కవితలో చిత్రించారు. మానవ ప్రేమకు అతీత స్థానమిచ్చి దివ్య ప్రేమగా రూపొందించారు. కవి భావించిన దివ్యానుభూతి అతనిలో కలిగిన దివ్య చైతన్యానికి నిదర్శనం. కవి ఊహించిన దానిని జ్ఞానేంద్రియాల ద్వారా చూడకున్నా హృదయాంతరంగంలో దాని ప్రతిరూపం నిలిచి ఉంటుంది. కవి అంతర దృష్టి మూలంగా దాన్ని ప్రత్యక్ష పరచు కొని దివ్యానుభూతిని పొందగలిగారు. ఆయన భావించినదాని పలుకులు వినలేకపోయినప్పటికీ చింతించలేదు. ఆయినా వారి శ్రవోవీధిలో పలుకులు వినిపించాయి. కవి తన ప్రేమని, భక్తిని ఈ విధంగా వ్యక్తపరిచారు. తన్మాత్రుల మూలంగా, అంతరేంద్రియాల మూలంగా ఆంతర దృష్టిని కలిగి ఉండడం అనే భావాన్ని శ్రీ అరవిందుల్లోనూ మనం గమనించవచ్చు. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వ దర్శన ప్రభావం ప్రత్యక్షంగా నోరి నరసింహశాస్త్రి మీద ఉంది అనలేం గాని, వీరి భావనలో మాత్రం సామ్యం ఉందని చెప్పవచ్చు.

పాండిచ్చేరిని దర్శించిన తరువాత కోవెల సుప్రసన్నాచార్యులు తన అనుభూతిని ‘పాండిచ్చేరి గీతాలు’ లో వ్యక్త పరిచారు. శ్రీ అరవిందుల తాత్త్విక చింతన, అధి భౌతిక భావం వీరి రచనల్లో ప్రతిబింబించాయి.

“మంచును కోసేవాడూ, చీకటిని కాలరాచేవాడూ,
లోతుల్లో పగవాళ్ళను పాదుల్లోంచి పెకల్చేవాడూ,
కృతఘ్నులను రూపుమాపేవాడూ
ఆకాశం ఒకేసారి ఫక్కున నవ్వినట్లు
అదే సహస్రార చక్రంలా సూర్యుడు”
“ ఇప్పుడు మూలధారం ఒకటి అన్నిటికీ
ఒకే ఆనందం గమ్యం, ఒకే అనంత సౌందర్యపథం
సొగసైన పుష్పయాత్ర ఈ బతుకు”[52]

సుప్రసన్నాచార్యుల దృష్టిలో సూర్యుడు ఉన్నత చైతన్యానికి ప్రతీక. వీరి కవితలోని సూర్యుడు శ్రీ అరవిందులను కూడా సూచిస్తుంది. సాధకులు జీవనాన్నే యోగంగా భావించడం చేత దు:ఖానికి దూరంగా పరిపూర్ణతకి దగ్గరగా ఉన్నారు. వికసించడం, పరిమళించడం, ఈశ్వరార్చణ కావడం పుష్పయాత్ర లక్షణం.

స్వాతంత్ర్యానంతర కవి సుప్రసన్నాచార్యులు పాండిచ్చేరి ఆశ్రమ జీవితాన్ని, సాధకుల సాధనని వర్ణించారు. సాధకులకు జీవితమంతా యోగమే. వీరు నిత్య వ్యవహార జీవితానికి దూరంగా, ఉన్నత సిద్ధికి చేరువగా ఉన్నారు. కవి ఆధ్యాత్మిక జీవిత ప్రగతిని, యోగసాధనని పుష్పయాత్రగా భావించారు. పువ్వులు రేకులు విప్పి బంగారు రేకులను తొడుక్కుంటున్నాయని వివరించారు. శ్రీ అరవిందుల తత్త్వంలో బంగారు రేకులు నూతన చైతన్యానికి ప్రతీక. ఇది అతి మానసిక అవతరణకు ప్రారంభదశ. ఈ సందర్భంలో కవి శ్రీ అరవిందుల తత్త్వాన్ని గ్రహించి పాండిచ్చేరి ఆశ్రమాన్ని ఆదర్శమయిన ఆశ్రమంగా గుర్తించారు. ఈ కవితలో కవికి కలిగిన భక్తిభావం వ్యక్తమవుతుంది

“రుక్మిణితో జగన్నాథుడు తిరిగి కుండినకు వెళుతున్నట్లు
కిరణాలను వెంబడించి సూర్యజ్యోతి పృథ్వికి దిగివచ్చినట్లు
చిత్తమూ, అహంకారమూ, మనస్సూ, బుద్ధీ నాల్గు స్తంభాలై

పైన కట్టే దేవాలయం శిఖరం ఒక సారి స్ఫురించినట్లు"[53]

రుక్మిణి జగన్నాథునితో భూమికి దిగివచ్చినట్లు శ్రీమాత, శ్రీ అరవిందులు భూమిమీద అవతరించారు. రుక్మిణికి , జగన్నాథునికి మధ్య ఉన్న అనుబంధం అపూర్వమైనది, విడదీయరానిది. శ్రీ మాత, శ్రీ అరవిందుల అనుబంధం కూడా ఇట్టిదే. పృథివీ రూపాంతరమే ధ్యేయంగా తలచిన శ్రీమాత, శ్రీ అరవిందులు భిన్న రూపాలు, బింబప్రతిబింబ రూపాలుగా భావించవచ్చు. ఈ సమయంలో కవి అనుచితమైన పోలికను చెప్పలేదని భావించవచ్చు. శ్రీ మాత, శ్రీ అరవిందులకు ఉన్న సంబంధం తల్లికి, గురువుకి ఉన్న సంబంధం వంటిది. రుక్మిణి జగన్నాథునికి మధ్య ఉన్న సంబంధం భిన్నమయినది.

కవి సూర్య కిరణాలను వర్ణించారు. సూర్య కిరాణాలను వెంబడించి సూర్యజ్యోతి పృథివికి దిగివచ్చినట్లుంది. ఈ సూర్యకిరణాలు అవరోహణకు సంకేతం. ఈ కవితలో భక్తిభావాన్ని వ్యక్తపరిచారు. ఈ ఆశ్రమ వర్ణన టాల్‌స్టాయ్ " Kingdom of Heaven upon earth" వర్ణనను తలపింప జేస్తుంది. చిత్తం, అహంకారం, మనస్సు, బుద్ధి, ఇవి నాలుగు స్తంభాలయి దేవాలయ శిఖరాన్ని స్ఫురింపజేస్తాయి. అంటే మానవుడు చైతన్య వికాసం వల్ల ఉన్నతస్థాయికి ఎదిగి నూతన జీవితంలో అడుగు పెట్టవచ్చున్న భావన వ్యక్తమవతుంది. ఇక్కడ దేవాలయమన్నది దేవుని గుడి లేదా మానవులు యోగసాధన మూలంగా ఆలయంగా రూపొందించిన దేహం కావచ్చు. ఈ సందర్భంలో మనకు శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వ సిద్ధాంతం స్ఫురిస్తుంది. కాషాయ వస్త్రాలు, కమండలాలు, గడ్డాలు, ఉపన్యాసాలు లేని ఆధునిక వశిష్టాశ్రమంగా కవి భావించారు. ఈ కవిత వీరి భక్తిభావాన్ని వ్యక్తపరుస్తుంది.

సుప్రసన్నాచార్యుల భక్తి భావాన్ని వ్యక్తపరిచే మరొక పాండిచ్చేరి గీతం :

" చేరనీ, చేరనీ నూరంచుల నుండి రేఖలు కేంద్రానికి
రూపొందనీ మాతృమందిరం భూమండలమై చతుర్భుజాలతో
భావిలోకి తొంగి చూస్తున్నాను. ఇది అయోధ్య, ఇది మిథిల
ఆగామి అతిమనస్సృష్టి కాహ్లాదడోలిక యిద్దీ" [54]

కవి పాండిచ్చేరిలో 'ఆరోవిల్ ' లోని మాతృమందిరాన్ని వర్ణించారు. ఇది మూడు వందల దేశాలు సమైక్య దృష్టితో నిర్మించిన మందిరం. నాలుగు స్తంభాల మీద నిర్మింపబడినది. ఒక సూర్య కిరణం నూరు సూర్య కిరణాలుగా చీలిపోతాయి. నూరంచుల నుండి సూర్యకిరణాలు కేంద్రానికి వచ్చి చేరుతాయి. భవిష్యత్తులోకి తొంగి చూస్తే, అది అయోధ్యగాను, మిథిలగాను స్ఫురించింది. అయోధ్యా, మిథిలా పురాలు సౌభాగ్యానికి, సంతోషానికి, న్యాయానికి సంకేతాలు. పాండిచ్చేరి ఆశ్రమం ఈశ్వరుడనుకున్న ప్రయోగాశాలగా కవి భావించారు.

సర్వం భగవన్మయమనే తత్త్వం అందరికీ తెలిసిందే. భారతీయ తత్త్వశాస్త్రంలో కూడ ఈ భావమే వ్యక్తమవుతుంది. పరమాత్ముని విశ్వవ్యాప్తి లక్షణాన్ని శ్రీ అరవిందులు "Who" అనే కవితలో వర్ణించారు. " In the blue of the sky, in the green of the forest, whose is the hand that has painted the glow? When the winds were asleep in the ether, who was it around them and bade them to blow?[55]

నింగి నీలిమ, అడవి పచ్చదనం, గాలి ఇవన్నీ ఆ భగవంతుని విలాసాలే అని శ్రీ అరవిందుల అభిప్రాయం. ఈ భావాన్నే స్వాతంత్ర్యానంతర తెలుగు కవి కరుణశ్రీ 'ఉదయ శ్రీ' కావ్యంలో వెల్లడించారు.

" పూలకంచాలలో రోలంబములకు రే
పటి భోజనము సిద్ధపరచు' వాడుగా
'తెలవారకుండ మొగ్గలోనే చొరబడి

వింత వింతల రంగువేయు' వాడుగా"[56]

శ్రీ అరవిందుల దృక్పథంలోను, కరుణశ్రీ దృక్పథంలోను ప్రకృతి అంతా భగవంతుని విలాసమేనన్న భావం వ్యక్తమవుతుంది. భగవంతుడిని ప్రపంచాన్ని సృష్టించిన విశ్వ కళాకారునిగా వీరిద్దరూ భావించారు. ఆకాసానికి నీలిరంగును, చెట్టు చేమలకి పచ్చరంగును ఎవరు వేసారని ప్రశ్నించారు. ఈ సృష్టికంతటికి మూల పరుషుడు భగవంతుడని విశ్వసించారు. ఈ భావాన్నే కరుణశ్రీ కూడా వ్యక్తపరిచారు. జీవకోటికి ఆహారాన్ని సిద్ధపరిచేవాడెవరని; పువ్వులలోని, మొగ్గలలోని వింత రంగులు వేసిన వాడెవరని ప్రశ్నించారు. ఈ విలాసం భగవంతుని లీలగా, భగవంతుడు మానవునికిచ్చే సందేశంగాను స్ఫురించింది. శ్రీ అరవిందుల భక్తిభావానికి, కరుణశ్రీ భక్తి భావానికి సామ్యముంది. అయితే శ్రీ అరవిందుల తత్త్వదర్శన ప్రభావం వీరిమీద ఉందని చెప్పలేం.

## 5.5 అధి భౌతిక భావం

శ్రీ అరవిందుల అధిమానసిక కవిత్వంలో అధి భౌతిక భావాలున్నాయి[57]. అధి భౌతిక భావమనేది ఆత్మకు సంబంధించిన శాస్త్రం వంటిది. ఇది భౌతిక విజ్ఞాన శాస్త్రంకన్నా భిన్నమయినదీ, ఉన్నతమయినదీ అని భావించవచ్చు. శ్రీ అరవిందులు తన కవితలో అధి భౌతిక భావాలను ముఖ్యంగా మనస్సు, అతిమనస్సు, దేవుని స్వరూప స్వభావాలను చిత్రించారు. ఇదే కాకుండా మానవుడు దివ్య మానవుడుగా, వైరాగ్యునిగా రూపొందడం మొదలయిన భావాలను కూడా తెలిపారు. శ్రీ అరవిందుల కవిత్వం ప్రత్యేకమయినది. కాబట్టి శ్రీ అరవిందులను భవిష్యత్ కవిగా, భవిష్యత్ విమర్శకునిగా పరిగణించవచ్చు. నిత్య నూతన అధిమానసిక సౌందర్య శాస్త్రమయిన వీరు తమ కవితల్లో మానవతలోని ప్రాథమిక ఆవేశాన్ని చర్చించారు. దేవుని సిద్ధిని పొందేందుకు మానవుడిలో అంతులేని ఆకాంక్షనే కాకుండా మానవుడి గమ్యాన్ని కూడా వివరించారు. మానవుడు త్రివిధ రూపాంతరాలు చెందుతాడని వీరు విశ్వసించారు. మూడు విధాలయిన రూపాంతర అవస్థలు – భౌతికం, ప్రాణం, మానసికం. భూత, భవిష్య, వర్తమాన కాలాలను దర్శించగల ప్రజ్ఞాచక్షువున్న శ్రీ అరవిందుల కవిత్వం కేవలం ప్రతిభతోనే కాకుండా అధిభౌతిక భావాలతో కూడి ఉంటుంది. వీరి ఉద్దేశంలో ప్రస్తుత మానవుడు ప్రాపంచిక సుఖాలతో తృప్తి పడేవాడు కాడు. వీటన్నిటికీ అతీతమయిన దాన్ని గురించి ప్రాకులాడతాడని విశ్వసించారు.

భవిష్యకవిత అంతర్బుద్ధి, మనస్సుకు సంబంధించిన భావమని చెప్పవచ్చు. ఇది మానసికావేశాన్ని, ఆనంద పారవశ్యాన్ని కలిగిస్తుంది. భవిష్యకవితలో శ్రీ అరవిందుల విశ్వదృష్టి వ్యక్తమవుతుంది. ఈ కవితలో ఆధ్యాత్మిక భావం ప్రధానాంశం. శ్రీ అరవిందులు భౌతిక వాస్తవికత కన్న ఆధ్యాత్మిక సిద్ధికే ప్రాధాన్యమిచ్చారు. మనస్సు అధిమనస్సు పరిణామం చెందే క్రమం అన్నది ప్రకృతి దివ్య ప్రకృతిగా రూపొందించడానికి మార్గం అని అర్థం. దీనినే అధిభౌతిక వాస్తవికత అని వివరించారు. శ్రీ అరవిందుల కావ్య ఖండికల్లో ఈ పరిణామ సిద్ధాంతం స్పష్టంగా వివరింపబడింది. వీరి కవిత్వం రూపాంతర ప్రక్రియను కూడ సూచిస్తుంది. సచ్చిదానందం ఈ పరిణామంలో ప్రాథమిక సత్త, ఆరోహణ, అవరోహణ అనే రెండు క్రమాలున్నాయి. ఆరోహణ క్రమాన్ని పరిణామమని, అవరోహణ క్రమాన్ని 'అంతర్వలన'మని అంటారు.

శ్రీ అరవిందుల అధిమానసిక కవిత్వంలో సృష్టి లీలను వివరించారు. ఈ సృష్టి స్థితిలయ విలాసంలో పరమ దేవుడికి ఆనందం తప్ప వేరే ఆంతర్యం ఏదీ లేదని శ్రీ అరవిందులు విశ్వసించారు[58]. ఈ సందర్భంలో శ్రీ

అరవిందులను, కాంట్‌ను పోల్చి చూడవచ్చు. అధి భౌతిక తత్త్వవేత్త కాంట్‌కు, ఆధునిక భారతీయ పునరుజ్జీవనానికి నాంది పలికిన శ్రీ అరవిందులకు భావ సామ్యముంది. కాంట్ తమ భౌతిక వాదం లేదా విమర్శనాత్మక భావవాదంలో సృష్టి స్థితి లయకారకుడయిన పరమ దేవుడు పారమార్థిక యథార్థమని లేదా యదార్థ వస్తువని పేర్కొన్నారు. భగవంతుడు చలించడు, కాని ఈ ప్రపంచంలోని విలాసానికంతటికీ అతడే మూలపురుషుడని అరిస్టాటిల్ కూడ విశ్వసించారు. శ్రీ అరవిందులు సృష్టి లీలను భగవంతుని విలాసంగా చిత్రించారు. వీరి ఆధ్యాత్మిక పరిణామ భావం మిగిలిన భావాలకన్నా ప్రత్యేకమయినదని చెప్పవచ్చు. ఉన్నత చైతన్యం, ఉన్నత రూపాంతరీకరణలు ఆధ్మాత్మిక పరిణామానికి ముఖ్య లక్షణాలు.

శ్రీ అరవిందులు అధి భౌతిక భావంలో విశ్వం, దివ్యత్వం, వ్యక్తిగతం, విశ్వజనీనం, మొదలయిన విషయాలను చర్చించారు. ఇవన్నీ భిన్న సత్యాలు కావు. శ్రీ అరవిందుల కవిత్వం ఆంతర బౌద్ధికమయినది, దివ్యమైనది. వీరు తమ రచనల్లో మనస్సు ఏ విధంగా క్రమ పరిణామం చెందుతుందో వివరించారు. మనస్సు ఉన్నత మనస్సుగా, ఉన్నత మనస్సు తేజోపూరిత మనస్సుగా, తేజోపూరిత మనస్సు అంతర్బుద్ధి మనస్సుగా, అంతర్బుద్ధి మనస్సు అధిమనస్సుగా, అధిమనస్సు అతి మనస్సుగా క్రమంగా పరిణామం చెందుతుంది. శ్రీ అరవిందులు దీన్నే ఆరోహణ క్రమం అని వివరించారు. క్రమం లేనిదే పరిణామం అసంపూర్ణం. ఈ పరిణామం ఏక పక్షం కాదు. అది సర్వ పక్షాలకు సంబంధించింది. ఇది మానవ భవిష్యత్తులో ఒక కొత్త దూరదృష్టిగా భావించవచ్చు[59].

మనో విశ్లేషణలో మనస్సుకు మూడు స్థితులున్నాయి. అవి చేతన, అచేతన, అవచేతన. అయితే శ్రీ అరవిందుల ఉద్దేశంలో మనస్సుకు ఆరు స్థితులున్నాయి. అందుకే వీరి కవిత్వాన్ని అధిభౌతిక కవితయని చెప్పవచ్చు. వీరి కవితా భావాలన్నీ అతి మానసికం, ఆధ్యాత్మికం; కాబట్టి అధి భౌతిక కవిత అని భావించవచ్చు. ఉన్నత సిద్ధిని పొందాలనే ఆకాంక్షకు ప్రాధాన్యాన్నిస్తుంది కాబట్టి, వీరి కవిత ఆవేశపూరితమయినదని కూడా చెప్పవచ్చు. “Vedantin’s prayer” అనేది శ్రీ అరవిందుల తొలి కవితల్లో అధిభౌతిక భావాన్ని వ్యక్తపరిచే కవిత. ‘Ahana’, ‘Rose of Gd’, Adwaita’, Evoluation’, ‘transformation’, ‘ The Descent of Ahana’, Decent’ కవితల్లో శ్రీ అరవిందుల భావావేశాన్ని, అనుభూతిని, అధిభౌతిక భావాలను గమనించవచ్చు.

దాశరథి, బాపురెడ్డి, సుప్రసన్నాచార్యులు వంటి స్వాతంత్ర్యానంతర తెలుగు కవుల కవితల్లో అధిభౌతిక భావం వ్యక్తమవుతుంది. దాశరథి ‘క్షీరసాగరం’ అనే కవితలో మానవ ప్రయత్నాలను వివరించారు. అనుకున్నదాన్ని సాధించటానికి మానవుడిలో ఆకాంక్ష, ప్రయత్నం అనేవి ముఖ్యమైన లక్షణాలు. స్థిర సంకల్పం ఉన్నప్పుడే ఉన్నత సిద్ధిని పొందాలనే తపన మానవుడిలో కలుగుతుంది. జీవితంలో ఒడిదుడుకులను, కష్ట దు:ఖాలను ఎదుర్కొన్న వ్యక్తి చేరాలనుకున్న గమ్యానికి చేరగలుగుతాడు. వీరి కవితలో అధి భౌతిక భావం స్పష్టంగా కనిపిస్తుంది.

“ తరచినపుడె అమృతధార
తరలి వచ్చునోయి
విషము మ్రింగ గలుగువాడె
విశ్వేశ్వరుడోయి”[60] (క్షీరసాగరం)

దాశరథి రచించిన ‘వలయాలు’ కవితలో అధిభౌతిక భావం వ్యక్తమవుతుంది. ‘సరస్సులో జలవలయాలు, ఉషస్సులో హిమవలయాలు, మానవుడి మనసులో విషవలయాలు’ అని దాశరథి తెలిపారు.

మానవుడిలో దైవత్వం, దానవత్వం అనే రెండు గుణాలున్నాయని అభిప్రాయపడ్డారు. వీరు అవిద్య, అధ్యాసను గురించి వివరించారు. మనిషిలో అజ్ఞానం, అహంకారం అనేవి చీకటి వంటివి. మనిషిలో ఈ చీకటి ఉన్నతంకాలం ఏది సత్యమో, ఏది అసత్యమో తెలియదు.

" మనిషిలోని అజ్ఞానపు చీకటి
మనసులోని అహంకారపు చీకటి..."

" నీ ముందున్న నిజాన్ని నీకే కనపడ నివ్వదు
నీలోని లోపాన్ని నిన్నే చూసుకోనివ్వదు" [61] (జగజ్జ్యోతి)

ఈ అధి భౌతిక వాదాన్నే శ్రీ అరవిందులు "Evolution"కవితలో వ్యక్తపరచారు.

" Earth was a cradle for the arriving God and man
But a half-dark half-luminous sign"[62]

దాశరథి తమ కవితలో పునర్నవకాలం వచ్చిందని అది చూసి లోకం హర్షించాలని ఆకాంక్షించారు. రోజూ కనపడే నక్షత్రాల్లోనే రోజూ కనబడని కొత్తదన్నాన్ని చూసి ఆనందానుభూతిని పొందాలి. కొన్ని లక్షల యేండ్ల నుండి ఉన్న ఆకాసం మళ్ళీ ఈ రోజు కొత్త మబ్బులతో తొంగి చూస్తుంది. రోజు కొత్త సూర్యుడిని చూస్తున్నానని పాశ్చాత్యులు చెప్పినా, దిగని ప్రవాహం దినదినమిదిగో అని అన్నమయ్య చెప్పినా భావం ఒక్కటే కదా. సృజన శక్తి, దర్శన శక్తి ఉన్న కవితాలోకానికి దాశరథి ప్రాధాన్యమిచ్చారు. మానవుడిలో స్థిర సంకల్పం, ఉన్నత స్థితి పొందాలనే తపన అత్యవసరం. మానవుడి మనస్సులో కృత్రిమాల చీకటి తొలగిపోయినపుడే మనసు వికసిస్తుంది. మనసు వికసించినపుడే సృష్టి రహస్యం అవగతమవుతుంది. 'పునర్నవం' కవితలో అధి భౌతిక భావం వ్యక్తమవుతుంది.

" పోవాలి కృత్రిమాల చీకటి
అప్పుడు వెలుగుతుంది మన:కుటి
రావాలి మన నరాల్లోకి జవం
అప్పుడర్థమవుతుంది పునర్నవం[63] (పునర్నవం)

డా.జె.బాపురెడ్డి తన 'అనంత సత్యాలు' కావ్యంలో మానవుని అజ్ఞాన జ్ఞానం గురించి వివరించారు. మానవుని అజ్ఞానం రెండు సత్యాలను కనిపెట్టింది. ఒకటి దైవత్వం, రెండవది అనంతత్వం. ఇవి మానవ నాగరికత సాధించిన అంతిమ విజయాలు. ఆత్మ జ్ఞానానికి, పదార్థ జ్ఞానానికి ఆఖరి మెట్టు. వరుసగా దైవత్యం, అనంతత్వం, మానవుడు ఆంతరంగిక మార్గం ద్వారా యోగసాధన ద్వారా దైవత్వాన్ని అన్వేషిస్తున్నాడు. రవీంద్రనాథ టాగూరు కూడా తన రచనల్లో దైవత్వంలో మానవత్వాన్ని, మానవత్వంలో దైవత్వాన్ని వివరించారు. కొన్ని సందర్భాలలో దీనినే మానవత్వం ఉన్న దేవుడిగా, దైవత్వం ఉన్న మానవుడిగా వ్యాఖ్యానించారు[64]. బాపురెడ్డి కూడ తమ కావ్యంలో దైవత్వం, అనంతత్త్వం అనే అధిభౌతిక భావాలను వ్యక్తపరిచారు.

" ఆత్మ జ్ఞానానికి
అవతలిగట్టు దేవుడూ
పదార్థ జ్ఞానానికి
ఆఖరి మెట్టు అనంతత్త్వం
అంతర్ముఖంగా

యోగమార్గం
అన్వేషిస్తున్నది దైవత్వాన్ని" [65] (అజ్ఞాన జ్ఞానం)

బాపురెడ్డి 'ఏదిసత్యం?' అనే కవితలో సత్యాన్ని సమీక్షించే విధానంలోని భిన్నత్వాన్ని స్పష్టంగా తెలిపారు. మన కళ్ళకు కనిపించేది సత్యం కాదని మాయావాది వాదం. ఇవి సమయ సత్యాలే కాని శాశ్వత సత్యాలు కావు. కవి ఉద్దేశంలో ఈ రెండూ సత్యాలే. మాయ కూడా సత్యమే. ఏది సత్యం కాదు? అనుకున్న సమయంలో అన్నీ సత్యాలుగానే కనిపిస్తాయి. కవి అధి భౌతిక భావాలను పరోక్షంగా వెల్లడించారు.

"మనకు కనిపించేది
సత్యం కాదని
మాయావాది వాదం
మరి మనకు కనిపించనిది
సత్యం ఎలా అవుతుందని
హేతువాది ప్రశ్న" [66] (ఏది సత్యం)

బాపురెడ్డి "భావవాద, భౌతిక వాద సరస సమ్మేళనంలో ఆనంద బ్రహ్మను దర్శిద్దాం" అని 'భావభౌతికాలు' అనే కవితలో చెప్పారు. " దైవత్వం మానవుడు అందుకొనదలచిన పరిపూర్ణత్వానికి ప్రతీక. అనంతత్త్వం ప్రకృతిలో పదార్థ సత్యాన్ని అన్వేషించాలన్న ప్రయోగ దర్శనానికి ఫలత్వం. భౌతిక పరిపూర్ణత్వ భావనతో సంప్రదించినపుడు అనుభూతమయ్యేది ఆనందమనే అనంతసత్యం"[67]. భావవాదం, భౌతికవాదం సమ్మేనంలో పరబ్రహ్మ సిద్ధిని పొందవచ్చునని కవిభావం. కొందరు ఆత్మజ్ఞానానికి, మరికొందరు పదార్థ జ్ఞానానికి ప్రాధాన్యమిస్తారు. కాని ఇది పాక్షికమైన సత్యం. ఈ రెండు వాదాల సరస సమ్మేళనంలో బ్రహ్మని దర్శించవచ్చు. బాపురెడ్డి రచించిన ఈ కవిత సమగ్రమయినదే కాక అధి భౌతిక భావాలున్న కవితని చెప్పవచ్చు. కవి అధి భౌతిక ఏకసత్తావాదాన్ని విశ్వసించారు.

" భావవాద
భౌతిక వాద
సరస సమ్మేళనంలో
ఆనంద బ్రహ్మను దర్శిద్దాం "[68] (భావ భౌతికాలు)

మానవుడి జీవితం మహాకావ్యం. అది మహాస్వప్నం. మానవుడు ఎక్కడ నుండి వస్తున్నాడో ఎక్కడికి పోతున్నాడో ఎవరికీ తెలియదు. శ్రీ అరవిందుల కవితల్లోని భావాలు బాపురెడ్డి కవితల్లో కూడా వ్యక్తమవుతున్నాయి. మానవుడిలో అజ్ఞాన జ్ఞానం, దైవత్వాన్ని అన్వేషించడం, అనంతత్వాన్ని శోధించడం మొదలయిన అధి భౌతిక భావాలను శ్రీ అరవిందుల కవితలో గమనించవచ్చు.

" A creative of his own grey ignorance,
A mind half – shadow and half – gleam,"
" Attempt of a divinity within,.
A consciousness in the inconscient Night".
" Aspiring to **gold** head from lisensible clay
He travels show – footed towards the eternal day"[69].

సుప్రసన్నాచార్యులు ప్రకృతిలో చైతన్య స్రవంతిని వివరించారు. 'చైతన్యజ్వాల వెలక్కపోతే ఎంత ప్రశాంతంగా ఉండేది అవికృత రూపాన ప్రకృతి'. ప్రశాంతంగా ఉండవలసిన ప్రకృతిని చైతన్యం గగ్గోలు పరుస్తుంది.

ఈ పరివర్తన ప్రకృతి స్వరూపాన్నే మార్చివేసింది. ఈ విధంగానే మానవుడిలో చైతన్యం వికసించినపుడు పరివర్తన కలగడం సహజం. ఈ చైతన్యం మానవునిలో అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానవంతునిగా చేస్తుంది. మానవుడ్ని ప్రస్తుతం ఉన్న స్థితికన్నా ఉన్నత స్థితికి ఎదిగేట్లు చేస్తుంది. ప్రకృతిలో చైతన్యం లేకపోతే అది " Painted ship on a painted ocan" లా ఉంటుంది అని Coleridge అన్నారు.

శ్రీ అరవిందుల భావాలను సుప్రసన్నాచార్యులు తమ కవితల్లో ప్రతిబింబింపజేశారు. మానవుని మనస్సులోని చైతన్య విప్లవం అనంతంగా కొనసాగుతుందని, ఈ చైతన్య జ్వాలే అన్నిటికీ మూలమని ఆయన వివరించారు. భౌతికం, ప్రాణం, బౌద్ధికం, మానసికం, ఆధ్యాత్మికం– ఈ పరిణామాలకు చైతన్యమే ప్రధానంశం.

" జడజగత్తులో అప్పుడు చైతన్య జ్వాల వెలక్క పోతే
ఎంత ప్రశాంతంగా ఉండేది ప్రకృతి అవికృత రూపాన
ఈ చేతన వెల్గుతూ వెల్గిస్తూ ఎంత గగ్గోలు పరుస్తుంది
ఇదిగో మానవులు వీళ్ళా సగం దైత్యులు సగం వేల్పులు"[70] (మథనం)

ప్రకృతిలో పరిణామం, మానవుల్లో పరిణామం అనే భావాలు శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వంలో వ్యక్తమవుతాయి. కోవెల సుప్రసన్నాచార్యులు 'ఆనంద ప్రభాతం కోసం' అనే కావ్యంలో మనస్సు పొందే పరిణామాన్ని వివరించారు.

" మనోమయ జీవనం వెలుపల
తీయని పిలుపులు వినపడి
మగతగా నిద్రపోతున్న నన్ను
ఏదో రహస్య హస్తం
బురదలోంచి పైకి లాగినట్లు గుర్తు" [71]

శ్రీ అరవిందుల సమగ్రతత్త్వశాస్త్రంలోని ప్రపత్తియోగంలో మానసిక దశలు ఏ విధంగా అతిమానసిక దశకు పరిణమిస్తాయో వివరింపబడింది. ఈ క్రమ పరిణామాన్నే సుప్రసన్నాచార్యులు తమ కవితలో తెలిపారు. పరిణామం అనేక దశలలో సాగుతుంది. అవి – మనస్సు, ఉన్నత మనస్సు, తేజోపూరిత మనస్సు, అంతర్బుద్ధి మనస్సు, అధిమనస్సు, అతి మనస్సు ఈ విధంగానే వ్యక్తిలో ఐదు పరిణామ దశలు ఉన్నాయి. అవి – భౌతికం, ప్రాణం, బౌద్ధికం, మానసికం, ఆధ్యాత్మికం. అధిమనసు దశలో పరిణామ క్రమం ఉన్నత చైతన్య అవరోహణ కోసం ఆగుతుంది. అధి మనస్సు స్థాయికి మనస్సు చేరిన తరువాత దేవుని అనుగ్రహం మూలంగా అతి మానసిక చైతన్య అవరోహణ కోసం ఆగుతుంది. ఆకాంక్ష, సర్వసమర్పణలనేవి శ్రీ అరవిందుల తత్త్వ శాస్త్రంలోని రూపాంతర మార్గానికి ముఖ్య లక్షణాలు. భగవద్గీతలో ఈ చైతన్య స్థితులను అన్నమయకోశం, ప్రాణమయ కోశం, మనోమయ కోశం, విజ్ఞానమయ కోశం, ఆనందమయ కోశం అని పేర్కొన్నారు. ఆధునిక మనో విజ్ఞానశాస్త్రంలో ఈ దశల చేతన, అవచేతన, అచేతన, అతీతచేతన అని పిలుస్తారు. సుప్రసన్నాచార్యులు ఈ కావ్యంలో మనోమయస్థితిలో అధిమానసిక చైతన్యం కలిగి ఏదో రహస్య హస్తం పైకి లాగినట్లినిపించిందని వర్ణించారు. అచేతన స్థితిలో నిద్రావృత జగత్తులో ఉన్నట్లు హిమగిరి శిలగా, స్మృతిలేని దశలో ఉన్నాడు. అచేతన స్థితి నుండి అవచేతన స్థితికి

రాగానే సగం వెలుగు సగం చీకటిగా కనిపించింది. అచేతనావస్థకు రాగానే మనోమయ జీవనం వెలుపల ఏవో పిలుపులు వినిపించాయి. అతీత చేతనావస్థలో జ్ఞానేంద్రియాలు లేకుండానే సర్వం అవగతమయినట్లనిపించింది. ఈ స్థితిలోనే మన భారతీయ తత్త్వవేత్తలు హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు, వైశ్వానర, పరబ్రహ్మం అని వివరించారు. ఈ నాలుగు స్థితులు బ్రహ్మకి ప్రతిరూపాలే.

మానసిక పరిణామ దశలను మొదటిసారిగా తత్త్వశాస్త్రంలో ప్రభోదించినవారు శ్రీ అరవిందులు. ఆధునిక తెలుగు కవి కోవెల సుప్రసన్నాచార్యులపై శ్రీ అరవిందుల తత్త్వదర్శన ప్రభావం ప్రత్యక్షంగా ఉంది. సుప్రసన్నాచార్యులు 'పాండిచ్చేరిగీతాలు'లో అధి భౌతిక భావాలను వ్యక్తపరిచారు. ప్రపంచాన్ని ప్రయోగశాలగా భావించారు. ఈ భావన కూడ శ్రీ అరవిందులదే. శ్రీ అరవిందులు మానవుణ్ణి ప్రయోగశాలలోని సాధనంగా భావించారు.

మానవ సృష్టికి జంతుకోటిని సజీవ ప్రయోగశాలగా ప్రకృతి పరిగణించినట్లే, దివ్య మానవుని సృష్టికి మానవుడు సజీవ ప్రయోగశాలగా పరిగణింపబడుతున్నాడని శ్రీ అరవిందుల అభిప్రాయం. ఇదే వీరి పరిణామ లక్ష్యం.

"ఇంత అల్పమైన స్థలం ఈశ్వరుడెన్నుకొన్న ప్రయోగశాల
దివ్యాదివ్య లోకాల సంగమ బిందువు. అబేధ్యసేతువు అద్భుతమైన సంకల్పం[72]..!

" My body is God's happy living tool,
My spirit, a vast sun of deathless light"[73] (Transformation)

శ్రీ అరవిందుల అధిభౌతిక భావాన్ని సుప్రసన్నాచార్యులు తమ కవితల్లో వ్యక్త పరచారని చెప్పవచ్చు.

శ్రీ అరవిందులు తమ రచనల్లో భవిష్య మానవుడి భవిష్యత్తును వ్యక్తపరిచారు. భవిష్య కవితలో వీరు భవిష్య కవులను, భావి పౌరులను, నూతన మానవజాతిని వివరించారు. భవిష్య మానవులు కేవలం మాటలతోనే కాకుండా అనుభవ పూర్వకమైన చేతలతో భవిష్యత్తుని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తారని, వ్యక్తిగత జీవితంలోను, సామాజిక జీవన సరళిలోను ఎన్నో మార్పులను మనం గమనించవలసి వస్తుందని శ్రీ అరవిందులు వివరించారు. వీరు తమ భవిష్య కావ్యంలో బాహ్య జీవితానికన్న అంతరంగ జీవితానికే ప్రాధాన్యమిచ్చారు. అంతరాత్మే బాహ్య జీవిత విధానంలో మౌలికమైన మార్పులను తెస్తుంది. శ్రీ అరవిందుల అభిప్రాయంలో విశ్వపరిణామ ప్రక్రియలో మానవుడు ఒక స్థాయిగా పరిగణింపబడుతున్నాడే కాని అతడే పరిణామ ప్రక్రియకు మూలాధారం కాదు. మానవుడు పరిణామం చెంది సంపూర్ణ చైతన్యాన్ని, విశ్వదృష్టిని, శక్తులను పెంపొందించు కుంటాడు.భవిష్యత్తులో ఉన్నత గుణాలున్న వ్యక్తులు మానవ నాగరికతకు మార్గదర్శకులౌతారు. దీని ఆధారంగా పరిణామం కన్న గుణమే ప్రధానమని చెప్పవచ్చు. భవిష్యత్ మానవజాతిలో నూతన శక్తి వెలుగులోకొస్తుంది. అప్పుడు ఇంద్రియ జ్ఞానం కూడా వృద్ధి చెందుతుంది.

శ్రీ అరవిందుల కవిత్వం భవిష్య మానవ జీవితానికి సంబంధించిన తత్త్వం. వీరి కవిత్వం మార్మిక, అధి భౌతిక భావాలతో కూడి ఉంది. వీరి భవిష్య కవిత్వం ప్రస్తుత మానవుడికి మాత్రమే కాక భవిష్య మానవుడికి కూడ మార్గదర్శి వంటిది. శ్రీ అరవిందుల అధి భౌతిక కవితల్లో తత్త్వసంబంధమయిన భావాలను, సమగ్ర భావాలను, భవిష్యత్ భావాలను, ఆధ్యాత్మిక భావాలను చూడవచ్చు.

## 5.6. భవిష్య భావం :

సమకాలీన సాహిత్యంలో భవిష్యత్ భావం ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిందని చెప్పవచ్చు. నేటి తెలుగు సాహిత్యంలో కూడ ఈ భావాలు వ్యక్తమవుతున్నాయి. చాలా వరకు స్వాతంత్ర్యానంతర కవులందరూ తమ రచనల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భవిష్యత్ సమాజం ఏవిధంగా ఉండాలో వివరించారు. తెలుగు సాహిత్యంలో భవిష్యత్ భావాలను కనబరచిన కవుల్లో శ్రీశ్రీ, దాశరథి, సి. నారాయణరెడ్డి, బాపురెడ్డి, సుప్రసన్నాచార్యులు ప్రముఖులు. కవిగా శ్రీ అరవిందులు భవిష్యత్ తత్త్వశాస్త్రానికి చేసిన కృషికి ఉదాహరణగా వీరి భవిష్య కవితని పేర్కొనవచ్చు. వీరి భావనలో భవిష్యత్ మానవునకు, పురుషోత్తమునకు ఉన్న సన్నిహిత సంబంధాన్ని స్పష్టంగా వివరించారు. వీరి భవిష్య కవిత ఛందోనియమాలను ఉల్లంఘించిన స్వతంత్రరచన. ఈ కవిత సత్యాన్ని ప్రతిబింబిచడమే కాక వాస్తవాన్ని కూడా సాక్షాత్కరింపజేస్తుంది. సత్య సాక్షాత్కారం దీని ప్రధాన లక్ష్యం. భవిష్యత్కవిత అంతరాత్మలో మార్పుని కలిగిస్తుంది. ఈ మార్పే బాహ్య జీవిత విధానాన్ని తీర్చిదిద్దుతుంది. అప్పుడు భవిష్యత్ మానవజాతిలో అధిమానసిక లక్షణాలను గమనించవచ్చు. ఈ కారణంగా వ్యక్తిగత చైతన్యానికి, విశ్వ చైతన్యానికి మధ్య స్వర్ణసేతువును నిర్మించవచ్చు. భవిష్యత్ మానవ జాతి ఉన్నత మానవత్వాన్ని కలిగి ఉంటుందని శ్రీ అరవిందుల అభిప్రాయం.

వీరి భావాలు విప్లవాత్మకంగా గోచరిస్తాయి. వేదకాలం నాటి ఋషులు భవిష్యత్తుని సూచించారు. కాని ఆధునిక యుగంలో శ్రీ అరవిందునివలె స్పష్టంగా భవిష్యత్తును వివరించిన వారు లేరని చెప్పాలి. కవిగా, యోగిగా శ్రీ అరవిందుల ప్రభావం ఆధునిక జీవన విధానం మీద ఉంది. కాని ఆ ప్రభావం స్వాతంత్ర్యానంతర కవుల మీద ఎంతవరకు, ఏవిధంగా ఉంది అనే విషయాన్ని విశ్లేషించి చెప్పలేం. శ్రీ అరవిందుల ప్రభావం విశ్వజనీనమైనది. శక్తివంతమైనది. వీరి భావ ప్రవాహ ప్రభావం భవిష్య రచనలలో కనిపిస్తుందని చెప్పవచ్చు. ఈ సందర్భంలో శ్రీ అరవిందుల తత్త్వ ప్రభావం ఇతర భాషా సాహిత్యాలని ప్రభావితం చేసినట్లే తెలుగు సాహిత్యాన్ని కూడా ప్రభావితం చేసింది. గోపీచంద్ అసమర్థుని జీవయాత్రలో ముసలివాడి తాత్త్విక ప్రసంగంలో అరవింద దర్శనం కనిపిస్తుంది. వేలూరి శివరామశాస్త్రి, వేలూరి సహజానంద, వేలూరి చంద్రశేఖరం శ్రీ అరవిందుల తాత్త్విక దర్శనానికి ప్రభావితులైనవారు.

ఆంధ్ర సాహిత్య లోకాన్ని ఉత్తేజితం చేసిన అభ్యుదయ మూల విరాట్టు శ్రీశ్రీ. వ్యక్తి చైతన్యంతో పాటు సంఘ చైతన్యాన్ని ప్రవచించారు. శ్రీశ్రీ గేయాల్లో అధికభాగం మార్క్సిజాన్ని గర్భీకరించుకున్న రచనలే. అయినా కొన్ని మౌలిక సత్యాలయిన వ్యక్తిగత చైతన్యం, సామాజిక చైతన్యం, ప్రకృతికి , మానవుడికి సంబంధించిన సత్యాలు కూడ వీరి రచనల్లో గర్భితమయి ఉన్నాయి. వీరి గేయాల్లో అక్కడక్కడ భవిష్య భావాలు వ్యక్తమవుతాయి.

" మరోప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది."[74] (మహాప్రస్థానం)

" ప్రపంచమును పరిహసిస్తాం
భవిష్యమును పరిపాలిస్తాం"[75] (అద్వైతం)

దాశరథి కవితల్లో భవిష్య భావాలు వ్యక్తమవుతాయి. 'భవిష్యత్తుకు స్వాగతం' అనే కవితలో భవిష్యత్తు ఏవిధంగా ఉండాలో సూచించారు. పూల గుత్తుల్లా, వసంతంలా, నందనవన సుగంధంలా, నవరసమయ ప్రబంధంలా,

అలగీత గోవిందంలా, అనురాగ బంధంలా, యువహృదయాలలో నవప్రణయం అంకురింపజేసేలా భవిష్యత్తు రావాలని దాశరథి ప్రవచించారు.

“ విరిసిన సౌందర్యారవిందంలా
రావాలి భవిష్యత్తు”

“ సువర్ణ పతాకలా
ప్రగతి ప్రతీకలా
రావాలి నా భవిష్యత్తు”[76]

భవిష్యత్తు ప్రగతికి ప్రతీకలా ఉండాలని ఆశించారు. దాశరథి భవిష్యత్తు గురించి ఆశాసౌధాన్ని అధిరోహించాలని సూచించారు. మానవుల్లో సమష్టిభావం ఉంటే సురలోకం నిర్మించవచ్చని చెప్పారు. వర్తమానపు పునాదుల్లోనే భవిష్యత్తు ఉందని, ఈ నాడు నెగటివ్‌గా కనిపించేది రేపు పాజిటివ్‌గా కనిపించవచ్చని వివరించారు.

“ భవిష్యత్తు అనగానే
భయపడతారెందుకు?
వర్తమానపు పునాదుల్లో
భవిష్యత్తు నా సౌధం”[77] (ఆశాసౌధం)

స్వాప్నికుడు అనే కవితలో దాశరథి ఆదర్శమయిన భవిష్యత్తును చిత్రించారు. నేటి పరిస్థితి దుర్భరంగా ఉన్నా, రేపటి కోసం విశ్వాసంతో ఈ రోజు ఎలా ఉన్నా భరిస్తారని వివరించారు. గొంగళిపురుగులే సీతాకోక చిలుకలు లాగా వికసిస్తాయని, కృత్రిమాల ఉక్కు చట్రం కూలి సత్యం, దయ, శాంతాల ధర్మచక్ర నిత్యం పరిభ్రమిస్తుందని విశ్వసించారు.

“ రేపు మీద విశ్వాసం ఉన్న నేను
నేడు ఎలా ఉన్నా భరిస్తాను”[78] (స్వాప్నికుడు)

‘మార్పు నా తీర్పు’ కవితలో నారాయణరెడ్డి భవిష్యత్ భావాలను మనం గమనించవచ్చు.

“శిశిరం నుంచి వసంతానికి
చీకటి నుంచి ప్రభాతానికి
నిరాశ నుంచి ఆశాశిఖరానికి
అశ్రుజలనిధి నుంచి ఆనంద తీరానికి
నడిపించే మార్పు
నేనిచ్చు తీర్పు” [79] (మార్పు నా తీర్పు)

మానవుల్లోనూ, సమాజంలోనూ మార్పు రావాలని, చైతన్యం కలగాలని నారాయణరెడ్డి కవితలోని అంతరార్థం. ప్రగతిని తప్పుదారి పట్టించేవారికి మరణశిక్ష విధించాలని, అదే తన తీర్పని వివరించారు. ఆనందం వెల్లివిరిసే భవిష్యత్తు వసంతంలా రావాలని ఆశించారు.

'రేపటి కోసం' కవితలో నేటి పరిస్థితిని, రేపటి పరిస్థితిని నారాయణరెడ్డి వివరించారు. నేడు నిశ్శబ్దాన్ని గుండె నిండా పీల్చుకొని, నీడని ఒంటినిండా కప్పుకుంటే రేపు బద్దలయ్యే అగ్ని పర్వతాల రొదల కోసం, ప్రజ్వలించే మండుటెండల కోసం ఆగవలసి వస్తుంది. రేపటి విప్లవానికి సిద్ధంగా ఉండండని ప్రవచిస్తున్నారు.

బాపురెడ్డి కవితల్లో భవిష్యత్ భావాలను చూడవచ్చు. బాపురెడ్డి 'భవిష్యద్దర్శనం'లో భావభౌతిక వాదాన్ని కనబరచారు. మానవుడు ప్రపంచంలోని పరిణామాన్ని వీక్షించబోతున్నాడని, మానవుని జిజ్ఞాస పెరిగి సృష్టి రహస్యాలను తెలుసుకుంటాడని ఉన్నత భవిష్యత్తుని ఆశించారు. భవిష్యత్ మానవుడికి తిండిగుడ్డలు అల్పవిషయాలుగా కనిపిస్తాయి. ఇరవై ఒకటో శతాబ్దంలోని మనిషి మహానుభావుడని చిత్రించారు.

అదిగో ఇరువది యొక శతాబ్ద
మందు మనిషి మహానుభావుడు
చూడుమాతని బ్రతుకు ఎంతటి
సుందరమ్మో, ప్రచలితమ్మో[80]

బాపు రెడ్డి కవితలో జగత్పరిణామం సంభవిస్తుందనే సిద్ధాంతం ప్రతిబింబిస్తుంది.

సుప్రసన్నాచార్యుల కవితల్లో కూడా భవిష్యత్ భావం వ్యక్తమవుతుంది. జగత్పరిణామక్రమంలో మానవుడు పరివర్తన పొందుతాడని వివరించారు. మానవుడు చైతన్య వంతుడయినపుడు ఉన్నత సిద్ధిని పొందేందుకు ప్రయత్నిస్తాడని, ఆ విధంగా ఎదురుచూసే ఆ వేళ తప్పక వస్తుందని భావించారు.

" పొరలు పొరలు క్రమంగా తొలగిపోయి
స్వచ్ఛమయిన సూర్యకిరణంగా సాగిపోయే నీవు
అనంతత్వ ద్వారాలు భళ్ళున తెరుచుకొనేవేళ
మనస్సుకు, విశ్వచేతనకూ మళ్ళీ ముడిపడేవేళ
ఆచింత్య సౌందర్య జ్వాలాతోరణ మెలిగే వేళ
ఎదురు చూసే వేళ తప్పక సాక్షాత్కరిస్తుంది."[81] (ఆవేళ)

'ఆవేళ' కవితలో సుప్రసన్నాచార్యుల భవిష్య భావాలు శ్రీ అరవిందుల భవిష్య భావాలేనని చెప్పవచ్చు. 'పాండిచ్చేరిగీతాలు'లో వీరు భవిష్యత్తుని దర్శించారు. శ్రీ అరవిందుల పరిణామ సిద్ధాంతాన్నే తమ కవితల్లో విశదీకరించారు. శ్రీ అరవిందులు భవిష్యత్తుని దర్శించిన కోణంలోనే సుప్రసన్నాచార్యులు కూడ భవిష్యత్తుని దర్శించారు. మానవుల్లోను, ప్రకృతిలోను పరిణామం సంభవిస్తుందని, పురోగతి ఉంటుందని వివరించారు.

" జడవస్తువులలో చైతన్య పరిమళం
ప్రతి కదలిక పురోగతి మన ఉద్గతి
ప్రతిభావన క్రొత్తశ్రుతుల అన్వేషణ"[82]

" ఇక్కడ అందరూ వ్యక్తులు కారు ప్రతీకలు
రాబోయే సమిష్టి చేతనా యుగానికి వార్తికాలు"[83]

వీరు తమ కవితల్లో ప్రతి భావన కొత్త అన్వేషణ అని, రాబోయే యుగం చేతనా యుగమని వివరించారు. వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంగా మారి జగత్పరిణామానికి దారి తీస్తుంది. విశ్వచేతన కలిగినపుడు అది చేతనాయుగమే అవుతుంది. శ్రీ అరవిందులు త్రివిధ రూపాంతీకరణను సూచించిన ద్రష్ట.

---

## పాద సూచికలు


1. వెల్చేరు నారాయణ రావు. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, నాగార్జున ప్రింటింగ్ వర్క్స్. హైదరాబాదూ 20. మొదటి ముద్రణ. 1978, పుటలు 95-96.

2. V.Rangarajan, Mahakavi Bharathi's vision of National integration. Bharateeya vikas, Quarterly magazine of Bharateeya Vikas Yojana samithi, Volume11. No.1 September, 1981. p.51.(Editor: Sri R.B. Madhekar)

3. V.K. Goakak, Sri Aurobindo Seer and Poet, Abhinav Publications, New Delhi, 1972, P.156.

4. అడపా రామకృష్ణారావు, ఆంధ్ర సాహిత్యంలో శ్రీ అరవిందుల దర్శనం. తెలుగు. త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక. సంపాదకుడు . డా. కొత్తపల్లి వీరభద్రరావు, తెలుగు అకాడమీ, హైదరాబాదు అక్టోబరు -డిశంబరు- 1972 పు. 70.

5. దివ్య దీపిక, విశ్వజనీన ప్రగతి పత్రిక, ప్రథమ సంచిక, విజయదశమీ, అక్టోబరు 1980.

6. Sri Aurobindo, The Synthesis of Yoga, (Vol.20) Birth Centenary Library, Pondicherry, 1972, p.418-419.

7. డాక్టర్ సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు; ప్రయోగములు, సోల్ డిస్ట్రిబ్యూటర్స్, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాద్, మచిలీపట్నం, జనవరి 1967, పు. 363.

8. రాయప్రోలు సుబ్బారావు, మిశ్రమంజరి, అజంతా ప్రింటర్స్, సికింద్రాబాదు, ప్రథమ ముద్రణ, 1963. పుట 153-154.

9. దాశరథి, దాశరథి కవిత, మహేంద్ర ప్రచురణలు, కోడంబాకం, మద్రాసు 24. 1 నవంబరు, 1977, పుట 295- 296.

10,11,12. Sri Aurobindo, Collected poems, The complete poetical works (Volume – 5) Birth Centenary Library, August, 1972.

13. డాక్టర్ సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు; ప్రయోగములు, సోల్ డిస్ట్రిబ్యూటర్స్, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాద్, మచిలీపట్నం, జనవరి 1967 పి. 364.

14, 15, 16. దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షము, దేవులపల్లి కృష్ణశాస్త్రి సన్మాన సంఘ ప్రచురణ, మద్రాసు, జనవరి 1975, పుటలు 119- 120.

17. శ్రీ రాయప్రోలు సుబ్బారావు, రమ్యాలోకము, నవ్యసాహిత్య పరిషత్తు, గుంటూరు, పు. 18,16

18. Sri Aurobindo, (On Nature), Bulletin, August, 1970. p.67.

19. శ్రీ రాయప్రోలు సుబ్బారావు, రమ్యాలోకము, నవ్యసాహిత్య పరిషత్తు, గుంటూరు, పు. 18,16

20. Sri Aurobindo, The Life divine, India Library Society, NewYark, 1965. p.153, 314&778.

21. శ్రీ అరవిందుల ప్రకృతి తత్త్వదర్శనం విశ్వజనీనమయినదని చెప్పవచ్చు. ఈ తత్త్వ దర్శనంలో వీరు భూలోక పరమయిన ప్రకృతి మొదలు విశ్వ ప్రకృతి వరకు అన్నింటినీ వివరించారు.వీరి రచనలన్నీ రూపాంతరానికి ప్రాధాన్యం ఇస్తాయి. ఈ భావాలే వీరి కవిత్వంలోను వ్యక్తమవుతా యి. అందువల్ల వీరి ప్రకృతి వర్ణనకి ప్రత్యేక స్థానముందని చెప్పవచ్చు.

22. Sri Aurobindo, Bandemataram, Vol.1, Birth Centenary Library, Pondicherry, 1972, p.533 & Karmayogin, Vol.2. Birth Centenary Library, Pondicherry, 1972. p.p.42 & 109.

23. Sri Aurobindo, Karmayogin, Vol.2. Birth Centenary Library, Pondicherry, 1972. p.11

24. శ్రీ అరవిందుల కాలంలో ఉధృతంగా సాగుతున్న స్వాతంత్ర్య సమరోద్యమం రెండు పాయలుగా చీలింది. 1. అతివాదుల ఉద్యమం, 2. మితవాదుల ఉద్యమం. శ్రీ అరవిందులు మితవాదుల ఉద్యమానికి ప్రధాన పాత్ర వహించారని చెప్పవచ్చు. హింసామార్గం వల్ల అనుకున్న దాన్ని సాధించలేమని, గమ్యం చేరుకోలేమని శ్రీ అరవిందులు విశ్వసించారు.

25. శ్రీ అరవిందులు, శ్రీ అరవింద వ్యాసావళి,(అను) బ్రహ్మశ్రీ వేలూరు చంద్రశేఖరం శ్రీ అరవిందాశ్రమ ముద్రణాలయం. పుదుచ్చేరి, 1947, పుట 137–138.

26, 27, 28 : ముదిగొండ వీరభద్రమూర్తి, 'వందేమాతరం' స్వాతంత్ర్యోద్యమ చరిత్ర 1860 –1906, శ్రీ వరలక్ష్మి ప్రెస్, హైదరాబాద్, ఆగస్టు 1977, పుట. 302, 341–342.

29. ముదిగొండ వీరభద్రయ్య, తెలుగు కవిత సాంఘిక సిద్ధాంతాలు, శ్రీ అరవిందు సొసైటీ, హన్మకొండ శాఖ, జూన్ 1980, పు.116.

30, 31. రాయప్రోలు సుబ్బారావూ జన్మభూమి. సంకలనం: ముద్దుకృష్ణ వైతాళికులు, విశాలాంధ్ర పబ్లికేషన్స్, విజయవాడ 1978, పు.9.

32. సంపాదకుడు : వి. మన్‌మోహన్‌రెడ్డి, శ్రీ అరవిందుల అతిమానసిక అవతారమూర్తి, రాయ ప్రోలు సుబ్బారావు, మహాయోగి, శ్రీ అరవింద శత జయంతి సంపుటము, ఆగస్టు 15, 1972, పు.277.

33. The Modern Review, July 1928.

34. Sri Aurobindo, Social and Political Thought, Vol. 15. Birth Centenary Library, Pondicherry, 1972. P.52 & 267.

35. శ్రీ అరవిందులు మానవ రూపాంతరాన్ని మూడు స్థాయిలుగా విభజించారు. భౌతిక రూపాంతరం, మానసిక ఆధ్యాత్మిక రూపాంతరం. దీన్నే త్రిముఖ రూపాంతీకరణమంటారు. ఈ స్థాయిల మూలంగా మానవుడు నిమ్నస్థాయి నుండి ఉన్నత స్థాయికి చేరుకుంటాడు.

36. కే.వి. రమణారెడ్డి, శ్రీశ్రీ సాహిత్యం, మూడు –వచన విభాగం, 1945–1969, శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘం, 2 జనవరి 1970.

37. Sri Aurobindo, Social and Political Thought, Vol. 15. Birth Centenary Library, Pondicherry, 1972. P.325.

38. దాశరథి, దాశరథి కవిత, రుద్రవీణ, మహేంద్ర ప్రచురణలు, మద్రాసు-24, జనవరి 1977, పి. 134.
39. Sri Aurobindo, Social and Political Thought, Vol. 15. Birth Centenary Library, Pondicherry, 1972. P.381.
40. దాశరథి, దాశరథి కవిత, పునర్నవం, మహేంధ్ర ప్రచురణలు, మద్రాసు-24, జనవరి 1977. పు. 214.
41. దాశరథి, దాశరథి కవిత, అగ్నిధార, పుట. 104-105.
42. దాశరథి, దాశరథి కవిత, అగ్నిధార, పుట. 238.
43. కే.వి. రమణారెడ్డి, శ్రీశ్రీ సాహిత్యం, మూడు - వచన విభాగం, 1945-1969, శ్రీశ్రీ షష్టి పూర్తి సన్మాన సంఘం, 2 జనవరి 1970. పుట 68.
44. శ్రీశ్రీ మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ -2, 15వ కూర్పు, నవంబర్ 1975, పుట. 73.
45. Sri Aurobindo, Supermental Manifestation, Vol. 16. Sri Aurobindo Birth Centenary Library, Pondicherry, 1972. P.288.
46. Sri Aurobindo and The Mother, on The Future Society, Sri Aurobindo Society, Pondicherry-2, 1973.
47. Sri Aurobindo and The Mother, on The Future Society, Sri Aurobindo Society, Pondicherry-2, 1973. P.26.
48. Sri Aurobindo, Letters On Yoga, (Vol. 22). Sri Aurobindo Birth Centenary Library, Pondicherry, 1972. P.385.
49. శ్రీ శివశంకర శాస్త్రి, 'ఆనందమా', భారతి, సంపాదకుడు; శివలెంక శంభుప్రసాద్, 1951, పే. 32.
50. Sri Aurobindo, Sri Aurobindo On Himself.
51. శ్రీ నోరి నరసింహశాస్త్రి, 'దివ్యానుభూతి', భారతి, (సం) శివలెంక శంభుప్రసాద్, సెప్టెంబర్ 1966, పుట. 1.
52. డా. సుప్రసన్న, పాండిచ్చేరి గీతాలు, శ్రీ అరవింద కేంద్రము, వరంగల్, 24 ఏప్రియల్, 1975, పుట. 3.
53. డా. సుప్రసన్న, పాండిచ్చేరి గీతాలు, శ్రీ అరవింద కేంద్రము, వరంగల్, 24 ఏప్రియల్, 1975, పుట. 12.
54. డా. సుప్రసన్న, పాండిచ్చేరి గీతాలు, శ్రీ అరవింద కేంద్రము, వరంగల్, 24 ఏప్రియల్, 1975, పుట. 7.
55. Sri Aurobindo,Collected Poems. Sri Aurobindo Birth Centenary Library, Pondicherry, 1972. P.40.
56. కరుణశ్రీ, ఉదయశ్రీ : ప్రథమ భాగము, న్యూస్టూడెంట్స్ బుక్ సెంటర్, విజయవాడా2. సెప్టెంబర్ 1979.

57. సాహిత్యంలోను, తత్త్వశాస్త్రంలోను అధిభౌతిక భావాలన్నవి సర్వసాధారణమయిన అభివ్యంజనాలు. అధిభౌతిక భావం అనంత సత్యాలను వెల్లడిస్తుంది. జనన మరణాలు, సృష్టి రహస్యాలు, అమరత్వం, స్వేచ్ఛ, జీవితం, వీటికి సంబంధించిన విషయాలన్నింటినీ అధిభౌతిక భావాలుగా భావించవచ్చు. అధిభౌతిక భావం భౌతిక శాస్త్రానికన్నా విలక్షణమైనది.

58. Sri Aurobindo, The Life Divine, India Library Society, NewYork, 1965. p.281.

59. శ్రీ అరవిందుల పరిణామ సిద్ధాంతం భవిష్య మానవ క్రమ పరిణామంగా పేర్కొనబడింది. ఇది అతి ప్రాచీనమయిన సిద్ధాంతం. శ్రీ అరవిందులకు పూర్వం మానవుని భవిష్యత్తు గురించి ఇంత విపులంగా ఎవరూ చెప్పలేదు. ఆధునిక విజ్ఞాన శాస్త్రరీత్యా శ్రీ అరవిందుల పరిణామ సిద్ధాంతం శాస్త్రీయమయిన సిద్ధాంతమే.

60. డా.. దాశరధి, తిమిరంతో సమరం, మహేంద్ర ప్రచురణలు, మద్రాసు, 1975, పు.27.

61. డా.. దాశరధి, తిమిరంతో సమరం, మహేంద్ర ప్రచురణలు, మద్రాసు, 1975, పు.53.

62. Sri Aurobindo,Collected Poems. Vol. 5, Sri Aurobindo Birth Centenary Library, Pondicherry, 1972. P.157.

63. దాశరథి, దాశరథి కవిత, పునర్నవం, మహేంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1నవంబరు 1977, పు. 233.

64. రవీంద్రనాథ టాగూరు 'రిలీజియన్ ఆఫ్ మాన్' అనే గ్రంథంలో నూతన మానవతని సృజనాత్మక మానవతగా పేర్కొన్నారు. మానవుడిలో దైవత్వం, దేవునిలో మానవత్వం ఉంటుంది. ఈ రెండూ విడదీయరాని అంశాలని, వీరిద్దరికీ పరిమిత – అపరిమిత సంబంధముందని వీరు విశ్వసించారు. మానవత్వాన్ని, దైవత్వాన్ని బాపురెడ్డి తమ కవితల్లో అనంతత్త్వంగా, దైవత్వంగా వివరించారు.

65. జె.బాపురెడ్డి, అనంతసత్యాలు, సుఖేలానికేతన్, హైదరాబాద్, మే 1979, పేజీ 1.

66. Ibid, P.4.

67. డా.. జి.వి. సుబ్రహ్మణ్యం, (సంపా) బాపురెడ్డి సాహితీ రజతోత్సవ సంచిక, వంశీ ఆర్ట్స్ థియేటర్స్, హైదరాబాదు, డిశెంబరు 23, 1980. పుట 13.

68. జె.బాపురెడ్డి, అనంత సత్యాలు, సుఖేలానికేతన్, మే, 1980. పుట 11.

69. Sri Aurobindo,Collected Poems. Vol. 5, Sri Aurobindo Birth Centenary Library, Pondicherry, 1972. P.168.

70. కోవెల సంపత్కుమారాచార్యులు, (సంపా) చేతనావర్తనం, వచన కవితా సంకలనం –2, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 25 ఆగస్టు 1970, పుట 95.

71. కోవెల సంపత్కుమారాచార్యులు, (సంపా) చేతనావర్తనం, వచన కవితా సంకలనం–2, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 25 ఆగస్టు 1970, పుట 103.

72. డా.సుప్రసన్న, పాండిచ్చేరి గీతాలు, శ్రీ అరవింద కేంద్రము, 24 ఏప్రియల్, 1975, పుట.3

73. Sri Aurobindo,Collected Poems. Vol. 5, Sri Aurobindo Birth Centenary Library, Pondicherry, 1972. P.161.

74, 75. శ్రీశ్రీ మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ –2, 15వ కూర్పు, నవంబర్ 1975, పుట. 17, 71.

76. డా.. దాశరధి, తిమిరంతో సమరం, మహేంధ్ర ప్రచురణలు, మద్రాసు, 1975, పు.46.

77. దాశరథి, దాశరథి కవిత, అమృతాభిషేకం, మహేంద్ర ప్రచురణలు, మద్రాసు-24, జనవరి1977, పుట132.
78. దాశరథి, ధ్వజమెత్తిన ప్రజ, యం.శేషాచలం అండ్ కంపెనీ, సెప్టెంబర్ 1981, పు. 14.
79. డా..సి. నారాయణరెడ్డి, మార్పు నా తీర్పు, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ డిసంబర్ 1974, పుట.2.
80. జె.బాపురెడ్డి, బాపురెడ్డి గేయాలు, సుఖేలా ప్రచురణ, హైదరాబాదు, 1974. పుట 16.
81. సంపాదకుడు కోవెల సంపత్కుమారాచార్యులు, చేతనావర్తనం, వచన కవితా సంకలనం,ఆగస్టు, 1970, పుట.102.
82, 83. డా.సుప్రసన్న, పాండిచ్చేరి గీతాలు, శ్రీ అరవింద కేంద్రము, 24 ఏప్రియల్, 1975, పుట.5.

---

# 6. ముగింపు

శ్రీ అరవిందుల తత్త్వలక్షణాలను ముఖ్యంగా కవితాలక్షణాలను తెలిసికొని, వాటి ప్రభావం ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ స్వాతంత్ర్యానంతర తెలుగు కవుల మీద ఎంతవరకు ఉందో వివరించడమే ఈ సిద్ధాంత వ్యాస ప్రధానోద్దేశం. ఆధునిక చింతనా రంగంలో శ్రీ అరవిందుల ప్రభావం సార్వత్రికమయినది. కాబట్టి వీరి ప్రభావం ఏయే రంగాల్లో ఉందో స్పష్టంగా వివరించి చెప్పలేం. భారతదేశంలోని అన్ని భాషా సాహిత్యాల మీద శ్రీ అరవిందుల కవితా భావాల, యోగసాధన భావాల ప్రభావముంది. ఈ సందర్భంలో కన్నడ, బెంగాలీ సాహిత్యాల మీద వీరి ప్రభావం ప్రత్యక్షంగా ఉందని వేరుగా చెప్పనక్కరలేదు. స్వాతంత్ర్యానంతర కవులను పేర్కొన్నప్పుడు బెంగాలీ, కన్నడ కవుల మీద కూడా శ్రీ అరవిందుల ప్రభావం ఉన్నట్లుగా వివరించేందుకు ప్రయత్నించాను.

శ్రీ అరవిందుల తత్త్వశాస్త్రం దేశభక్తి భావానికి నిదర్శనం. శ్రీ అరవిందులు స్వాతంత్ర్య సమర యోధుడుగా, జాతీయ నాయకుడుగా గొప్ప కృషి చేశారు. వీరి కృషి, ఆదర్శ భావాలు ఆనాటి భావాలకు పతాకలు. ఉదాహరణకు కర్మయోగిన్(1905), ఇందు ప్రకాశ (1893), బందేమాతరం (1905), భవానీమందిర్ (1905) పత్రికల్లోని వీరి రచనలు జాతీయ భావానికి, దేశభక్తికి నిలువుటద్దాలు. ఆనాడు శ్రీ అరవిందులు దేశ ప్రగతికి మార్గదర్శిగా నిలిచారు. ఈ విధంగా రచనల్లో, కవిత్వంలో అనేక నవ్య ప్రక్రియలకు మార్గదర్శకులయిన శ్రీ అరవిందుల ప్రభావం అన్ని భాషా సాహిత్యాల మీద పడిందని వేరే చెప్పనక్కరలేదు.

భవిష్యత్తులో శ్రీ అరవిందుల రచనలు సమగ్ర జీవన విధానానికి పునాది రాళ్ళుగా నిలుస్తాయి. వీరి రచనల్లో 'లైఫ్‌డివైన్' మకుటాయమానం. శ్రీ అరవిందులు ఈ ప్రపంచంలో దివ్య జీవనానికి అనుకూలమయిన వాతావరణాన్ని అంటే మానసిక నైతిక పరిస్థితిని ముఖ్యంగా కళాత్మక, భావాత్మక పరిస్థితిని సృష్టించారు. శ్రీ అరవిందుల్లో ఈ జీవనమే అధిమానసిక అభివ్యంజనగా పరిగణింపబడింది. ఆయన రచించిన 'ది సింతసిస్ ఆఫ్ యోగ' (1958) రచన భారతదేశంలో యోగజీవితం మీద, యోగ సాధన మీద ప్రత్యేకమైన ప్రభావాన్ని కలిగించింది. అంతేకాక ఇది రాబో–యే కాలాన్ని గురించి, మంచి భవిష్యత్తును గురించి మానవుడిలో కొత్త ఆశని చిగురింప జేసింది. 'Essays on the Gita(1955)ద్వారా భగవద్గీత లోని అనంత సత్యాలను విలక్షణమైన విధానంలో తెలియజేశారు. భక్తి, కర్మ, జ్ఞానయోగ మార్గాలను గురించి శ్రీ అరవిందులు చేసిన వ్యాఖ్యానం సమగ్రమయినది. The Hour of God (1964), The Ideal of Karmayogin (1950), The Supermental manifestation upon earth(1952) వంటి వీరి రచనలు యౌగిక భావాలను, జీవిత విధానాలను, సిద్ధిని గురించి తెలుపుతాయి. ఇవి అనుభవజ్ఞులైన శ్రీ అరవిందులకు మరింత వన్నెను చేకూర్చాయి. వీరు దివ్య జీవనానిన మలచిన శిల్పి అన్నది అందరికీ తెలిసిన విషయమే. మరేయోగి కాని, ప్రవక్తగాని శ్రీ అరవిందుల వలె ఆధ్యాత్మికతను స్పష్టంగా వివరించలేదు. వీరి ఆధ్యాత్మిక భావం సమగ్రమయినది. ఇది మానవుడి మూర్తిమత్వ లక్షణాలను కూడా వివరించింది.

శ్రీ అరవిందులు సారస్వాతాభిలాషి. వీరు సాహిత్యానికి చేసిన కృషి అపారమయినది. దివ్య మానవ భావం, ఆధ్మాత్మిక మానవ భావం అనేవి కొత్త సామాజిక జీవనానికి, సమష్టి జీవితానికి, దారితీస్తాయనే వీరి భావం అతి నవ్యమే. శ్రీ అరవిందుల భవిష్యకవితలో భవిష్యత్ మానవుడు, సౌందర్యావబోధ, కళాశాస్త్రాలను గురించి వివరించారు. కవిత్వానికొక కొత్త నిర్వచనం చెప్పి, నవ్య సాహిత్య మార్గంలో ప్రస్థానం చేసిన ప్రవక్త వీరు. వీరి భవిష్యకవిత డా.. జేమ్స్, హెచ్. కజిన్స్ రాసిన 'New ways in English Literature' అనే సాహిత్య సిద్ధాంతానికి

విమర్శనాత్మక సమీక్ష. భవిష్యకవిత శ్రీ అరవిందుల యోగ సాధన, ఆధ్యాత్మికతని గురించి మాత్రమే కాక సాహిత్యంలో వారికున్న అభిరుచిని, ప్రజ్ఞను ప్రతిబింబిస్తుంది.

శ్రీ అరవిందుల తత్త్వదర్శన ప్రభావం ఏయే కవుల మీద ఉందో నిర్దిష్టంగా చెప్పడం కష్టంతో కూడుకున్న పని. కానీ వీరి ప్రబోధగేయాలను, రచనలను పరిశీలించనపుడు ఆ కాలం నాటి సంఘటనలు, సన్నివేశాల ప్రభావం వీరి రచనల్లో వ్యక్తమవుతాయి. వీరి కవిత్వంలో, సమకాలీన పరిస్థితులు, స్వాతంత్ర్యోద్యమ సంఘటనలు ప్రతిబింబించాయి. దీని ఆధారంగా శ్రీ అరవిందులు ఆనాటి జాతీయ రాజకీయ జీవిత విధానానికి దూరంగా పోలేదని తెలుస్తుంది. శ్రీ అరవిందులు దిన, వార పత్రికల ద్వారా జాతీయ, దేశభక్తి భావాలను ప్రతిబింబింపజేసి ఆనాటి సామాన్య ప్రజల హృదయాలలో చైతన్యాన్ని రేకెత్తించారు. వీరి కవిత్వం ఉదాత్తమయినది. వీరి కవిత్వంలో జాతీయ భావమే కాక విప్లవాత్మక అభినివేశం, దేశభక్తి కనిపిస్తాయి. వీరి రచనల్లో అన్యాయానికి ఎదురు తిరిగి నిలిచే స్వభావం కనిపిస్తుంది. స్వదేశీభావం పట్ల ప్రేమ, భారతీయ సంస్కృతిపట్ల గౌరవం వీరి రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయి. వీరి కవిత అధిమానసిక చింతనా ప్రక్రియకు సేతువు వంటిది.

శ్రీ అరవిందులు కొనసాగించిన స్వాతంత్ర్యోద్యమ ప్రభావం ప్రత్యక్షంగా స్వాతంత్ర్యానంతర కవుల మీద ఉందని చెప్పవచ్చు. ఆనాటి సాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ సత్యం స్పష్టమవుతుంది. ఏయే సాహిత్య రంగాల్లో ఏ రీతిగావీరి ప్రభావం పడిందో మనం వివరించలేమని గతంలో ఏ రీతిగా వీరి ప్రభావం పడిందో మనం వివరించలేమని గతంలో తెలపడమయింది. వీరి ప్రభావానికి లోనయినవారు అంతర్ముఖులుగా ఉండటమనేది సత్యం.

స్వాతంత్ర్యానంతర కవుల సామాన్య లక్షణాలను ఈ కింది విధంగా తెలుపవచ్చు. అవి సామాన్య మానవులకు అర్థమయ్యే ప్రజల భాషలో భావాలను వ్యక్తీకరించారు. మాటలను ఈటెలుగా మార్చి, నిత్య జీవితంలో జరిగే ఘటనలను తమ కవిత్వంలో ప్రతిబింబింప చేశారు. వాస్తవ సత్యాలను చూపించి సమాజంలోని కుళ్ళును ఎత్తి చూపారు. స్వాతంత్ర్యానంతర కవులు తమ రచనల్లో నిరుద్యోగ సమస్య, పేదరికం, బానిసత్వం, నిరంకుశత్వాలను చిత్రించారు. వీరి సాహిత్యంలో ప్రజాస్వామ్య భావాలు, సమైక్య భావాలు, వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తి హక్కులు మొదలయిన విషయాలను బలపరచారు. తిరుగుబాటు, విప్లవం అనేవి వీరి రచనల్లో సర్వ సాధారణం. మానవ భావం, విశ్వమానవ ప్రేమ వీరి రచనల్లో ప్రధానాంశం. సామాజిక భావం, అధిభౌతిక భావం, భవిష్య భావం వీరి రచనల్లో వ్యక్తమయ్యే నవ్య భావాలు. గతానుగతికమయిన ధోరణిని విడిచి కొత్తగా చెప్పాలన్న కాంక్ష స్వాతంత్ర్యానంతర కవుల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వీరు రచనల్లో ఛందో నియమాలను ఉల్లంఘించారు. ఇది సాహసోపేతమైన ప్రయోగమని చెప్పవచ్చు. వీరి కవిత్వం ప్రస్తుత ప్రాపంచిక సత్యాలకు సంబంధించినది.

శ్రీ అరవిందులు అధిమానసిక కళాతత్త్వానికి ఒక కొత్త లక్షణ సిద్ధాంతాన్ని రూపొందించి ఈనాటి సాహిత్యాన్ని ప్రభావితం చేశారని చెప్పవచ్చు. శ్రీ అరవిందుల సమగ్ర తత్త్వశాస్త్ర ప్రభావం సమకాలీన కవులమీద బాగా కనిపిస్తుంది. వీరి కవిత్వంలోని వ్యాఖ్యానం సంశ్లేషణాత్మకమయినది. కాబట్టి స్వాతంత్ర్యానంతర కవుల ఆదర్శభావాలకి పతాక వంటిది. రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, శ్రీశ్రీ, కరుణశ్రీ, కోవెల సుప్రసన్నాచార్యులు, తల్లా వఝల శివశంకర శాస్త్రి, నోరి నరసింహశాస్త్రి మొదలయిన స్వాతంత్ర్యానంతర తెలుగు కవులు తమ రచనల్లో అరవిందుల ప్రకృతి భావాలను, అధి భౌతిక భావాన్ని, భవిష్య భావాన్ని, రూపాంతరయోగ భావాన్ని , దివ్య మానవ జాతి భావాన్ని ప్రతిబింబింపజేశారు.

శ్రీ అరవిందుల కవిత్వం దివ్య మంత్రం వంటిది. వీరు తమ కవితల్లో ఛందోనియమాలన అన్నింటిని అధిగమించారు. చాలా వరకు స్వాతంత్ర్యానంతర కవులందరూ ఛందోనియమాలను ఉల్లంఘించారనే చెప్పాలి. వీరి రచనల్లో భవిష్య భావాలు వ్యక్తమవుతాయి. భవిష్యద్దర్శనమే శ్రీ అరవిందుల కవిత్వంలో ప్రధానాంశం. వీరి కవిత్వంలో చింతనకి, క్రియకి మధ్య భేదం లేదు. స్వాతంత్ర్యానంతర కవుల్లో సమగ్రభావాలు వ్యక్తమవుతాయి. భవిష్య భావం, దివ్య జీవన విధానమన్నవి స్వాతంత్ర్యానంతర కవుల్లో కలిగిన సరికొత్త భావానలు. ఈ జగత్తులో కొందరు మహానుభావులు మానవ జాతిని సరిదిద్ది, సరియైన మార్గంలో నడిపేందుకు కృషి చేసి మార్గదర్శకులౌతారు. అట్టి మహానుభావుల్లో శ్రీఅరవిందులు ఒకరు. వీరు భవిష్య కవిత్వానికి మాత్రమే కాక భవిష్య మానవజాతికి కూడ మార్గదర్శకులయ్యారు.

## ఉపయుక్త గ్రంథాలు


1. అనంత సత్యాలు (1979/80), డా. జి. బాపురెడ్డి;
2. ఆధునికాంధ్రకవిత్వము, సంప్రదాయములు ప్రయోగములు(1967) డా. సి. నారాయణరెడ్డి
3. ఉదయశ్రీ కరుణశ్రీ
4. కృష్ణపక్షం (1975), దేవులపల్లి కృష్ణశాస్త్రి,
5. చేతనావర్తనం కోవెల సంపత్కుమారాచార్యులు
6. తిమిరంతో సమరం దాశరథి కృష్ణమాచార్యులు
7. తెలుగు కవిత సాంఘిక సిద్ధాంతాలు డా. ముదిగొండ వీరభద్రయ్య
8. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం డా. వెల్చేరు నారాయణరావు
9. దాశరథి కవిత (1977), దాశరథి
10. ధ్వజమెత్తిన ప్రజ దాశరథి కృష్ణమాచార్యులు
11. పాండిచ్చేరి గీతాలు కోవెల సుప్రసన్న
12. బాపురెడ్డి గేయాలు డా. జె. బాపురెడ్డి
13. మహాప్రస్థానం శ్రీశ్రీ
14. మిశ్రమంజరి రాయప్రోలు సుబ్బారావు
15. రమ్యాలోకం రాయప్రోలు సుబ్బారావు
16. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర 1860–1906 వందేమాతరం (1977) ముదిగొండ వీరభద్రమూర్తి
17. వైతాళికులు ముద్దుకృష్ణ
18. శ్రీ అరవిందులు (అను) డా. జె. మంగమ్మ
19. శ్రీ అరవిందులు అతిమానసిక అవతార మూర్తి (సం) డా. వి. మన్‌మోహన్‌రెడ్డి
20 శ్రీ అరవిందుల జీవితం చతుర్వేదుల వెంకట కృష్ణయ్య
21. శ్రీ అరవిందుల యోగసమన్వయం కమలాకర వెంకటరావు
22. శ్రీ అరవిందుల వ్యాసావళి (1947–అను) బ్రహ్మశ్రీ వేలూరి చంద్రశేఖరం
23. శ్రీశ్రీ సాహిత్యం కె.వి. రమణారెడ్డి
24. తెలుగు త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక (సం.) డా. కొత్తపల్లి వీరభద్రరావు
25. బాపురెడ్డి సాహితీ రజతోత్సవ సంచిక (సం.) డా. జి.వి. సుబ్రహ్మణ్యం
26. భారతి (సం.) శివలెంక శంభుప్రసాద్
27. A gate way to Sri Aurobindo's thoughts Sri Aurobindo
28. An integral view of poetry V.K. Gokak
29. Bandemataram Sri Aurobindo
30. Collected poems, Vol.5 (1972) Sri Aurobindo
31. Eastern and Western Philosophy Dr. V.N.K. Reddy
32. Karmayogin Sri Aurobindo

33. Letters on Yoga — Sri Aurobindo
34. Life, Literature and Yoga — Sri Aurobindo
35. On Himself — Sri Aurobindo
36. Savitri — Sri Aurobindo
37. Social and Political Thought — Sri Aurobindo
38. Sri Aurobindo a Biography and History(2Volumes) — K.R. Srinivasa Iyenger
39. Sri Aurobindo Seer and Poet — V.K. Gokak
40. The Future Poetry — Sri Aurobindo
41. The Hour of God — Sri Aurobindo
42. The Life Devine — Sri Aurobindo
43. The Literary Criticism of Sri Aurobindo — S.K. Prasad
44. The Supermental manifestation — Sri Aurobindo
45. The synthesis of Yoga — Sri Aurobindo
46. The Upanishads — Sri Aurobindo
47. Bharateeya Vikas — (Ed) R.B. Madhekar
48. The modern Review- 1928. — Sri Aurobindo Press Trust

******************

# పారిభాషిక పదకోశం

## తెలుగు – ఇంగ్లీషు

| | |
|---|---|
| అచేతన | Unconscious |
| అతిమనస్సు | Over mind |
| అతీత మానసీకరణ | Supramental |
| అంత:కరణం ప్రవృత్తి | Intutive mind |
| అంతర్ జ్ఞానం | Apperception |
| అంతర్వలనం | Involution |
| అంతరాత్మ | Conscience |
| అధిభౌతిక భావవాదం | Meta Physical Idealism |
| అధిమనస్సు | Super Mind |
| అనేకాంతవాదం | Pluralism |
| అభివ్యంజనం | Manisfestaion |
| ఆరోహణ | Ascent |
| అవచేతన | Subconscious |
| అవరోహణ | Descent |
| ఆకాంక్ష | Aspiration |
| ఆత్మ | Spirit |
| ఆధ్యాత్మికీకరణం | Spiritualisation |
| ఆధ్యాత్మిక భావం | Spiritual Trend |
| ఆధ్మాత్మిక రంగం | Spiritual field |
| ఆధ్యాత్మిక వాదం | Spirityalism |
| ఉద్గామి పరిణామం | Emergent evolution |
| ఉన్నత మనస్సు | Higher mind |
| ఏకసత్తవాదం | Monism |
| కనబడుతున్నదే ఉన్నది | Esse ist percipil |
| క్రమపరిణామం | Evolution |
| కేవలసత్త | Absolute being |
| చైతన్యం | Consciousness |
| జీవాత్మ | Vital Soul |
| జీవశక్తివాదం | Vitalism |
| జ్ఞేయ చైతన్యం | Gnostic Consciouness |

| | |
|---|---|
| తత్త్వశాస్త్ర చరిత్ర | History of Philosophy |
| త్రివిధ రూపాంతరీకరణం | Triple transformation |
| తేజోపూరిత మనస్సు | Illumined mind |
| దివ్యమానవుడు | Superman |
| దివ్యాత్మ | Divine Spirit |
| నిర్గతాంశ | Emanation |
| నిష్కామ కర్మ | Selfless action |
| పరమసత్త | Ultimate reality |
| పరిణామం | Evolution |
| పరిమిత- అపరిమిత | Finite-Infinite |
| ప్రతివాదం | Antithesis |
| ప్రపత్తియోగం | Yoga of self surrender |
| ప్రాక్చేతన | Pre-conscious |
| పునరుజ్జీవం | Renaissance |
| పూర్ణయోగం | Integral Yoga |
| ప్రాకృతిక తత్త్వశాస్త్రం | Natural Philosophy |
| ప్రాణం/ప్రాణిక | Vital |
| భగవంతునితో సంసర్గం | Identity with God |
| భవిష్యత్సూచన | Prognastication |
| భవిష్య భావం | Futuristic trend |
| భౌతికవాద నిరాకరణ | Materialistic denial |
| మనస్సు | Mind |
| మానసికం | Mental |
| మనసీకరణం | Psychicisation |
| మూర్తిమత్వ విశేషకాలు | Dimensions of personality |
| యదార్థవస్తువు | Thing-in-itself |
| యోగసమన్వయం | Synthesis of Yoga |
| యోగ సాధన | Pursuit of Yoga |
| రూపాంతరం | Transformation |
| విద్య- అవిద్య | Knowledge-Ignorance |
| విద్వత్ తత్త్వశాస్త్రం | Academic Philosophy |
| విమర్శనాత్మక భావవాదం | Critical Idealism |
| విశ్వం | Cosmic |

| | |
|---|---|
| విశ్వభావం | Welt an Chauung |
| సంగతత్త్వం | Consistency |
| స్వత:స్ఫురణ మనస్సు | Intuitive mind |
| సన్యాసత్వ నిరాకరణ | Refusal of the asceticism |
| సమగ్ర తత్త్వశాస్త్రం | Integral Philosophy |
| సమైక్య సంపూర్ణం | integral Perfection |
| సృజనాత్మకత | Creativity |
| సౌందర్యావబోధ/ కళాతత్త్వం | Aesthetics |